ఓం

శ్రీ సద్గురువుల దివ్య చరిత్ర

(గేయ కావ్యము)

శ్రీ పాద శ్రీవల్లభుడు, శ్రీ నరసింహ సరస్వతి

రాగ తాళ యుక్తముగ గానము చేయవచ్చును.

రచన :
పోతాప్రగడ వెంకట సుబ్బారావు, ఎం. ఏ.,

శ్రీ గురుదత్తమణి పీఠము
15/542, ఈడేపల్లి, జిల్లాకోర్టు వెనుక
మచిలీపట్నం - 521 002

శ్రీ సద్గురువుల దివ్య చరిత్ర

(గేయ కావ్యము)

రచన :

పోతాప్రగడ వెంకట సుబ్బారావు, ఎం. ఏ.,

ప్రచురణ : 1997 ఆగష్టు

ప్రతులు : 750 కాపీలు

వెల : రూ. [redacted]/- లు

ముద్రణ :

బృందావన్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్

బుట్టాయిపేట, మచిలీపట్టణం


ఫోన్స్ : 21204, 22832

ప్రతులకు :

శ్రీ గురుదత్తమణి పీఠము


15/542, ఈడేపల్లి, జిల్లాకోర్టు వెనుక

మచిలీపట్నం - 521 002



This Book is Printed with the Financial Assistance under the AID to Religious Publications of the **TIRUMALA TIRUPATI DEVASTHANAMS**

అదిగో వారే దత్త ప్రభువులు. ఎవని నామస్మరణ మాత్రముననే సమస్త ఫాపములు హరింపబడునో (మహామునుల పాపములు కూడ) ఎవరు యోగసిద్ధుల నన్నిటిని సంతోషముతో ప్రసాదించునో, ఎవరు కారుణ్యాది సత్యజ్ఞానమునకు ఆది ప్రవక్తయో! తన యందు భక్తి కలిగియున్నను లేకున్నను సమస్త జనులను అజ్ఞానము నుండి ఎవరు రక్షించునో! ఎవరు జనుల సుఖదుఃఖము లందు కూడ చెలికాడో ఎవరు యోగశాస్త్రమునకు ఆలంబనమో ఎవరు భక్తుల పాలిటి చింతామణియో ఎవరు బ్రహ్మా విష్ణు శివాత్మకుడై సర్వవ్యాపకశీలియో అదిగో ఆ దత్త ప్రభువే రక్షకుడు. అట్టి గురుచరణకమలములకు నేను నిత్యము శ్రద్ధా భక్తులతో నమస్కరించుచున్నాను.



అంకితము

జ్ఞానయోగవిధి

విశ్వగురువు

యోగిజన ప్రియుడు

భక్తవశ్యుడు

సిద్ధమునుడు

సర్వగామి

ఈ గేయ కావ్యరచనకు ప్రేరకుడు

అయిన దత్తాత్రేయ పరబ్రహ్మమునకు

భక్తిప్రపత్తులతో

పోతాప్రగడ వెంకట సుబ్బారావు, ఎం. ఏ.,

శ్రీ దత్తాత్రేయులు

దత్తాత్రేయం శివం శాంతం
ఇంద్రనీల నిభం ప్రభుం
ఆత్మమాయా రతం దేవం
అవధూతం దిగంబరం
భస్మోద్ధూలిత సర్వాంగం
జటాజూటధరం విభుం
చతుర్బాహు ముదారాంగం
ప్రఫుల్ల కమలేక్షణం
జ్ఞాన యోగనిధిం విశ్వ
గురుం యోగిజన ప్రియం
భక్తానుకంపినం సర్వ
సాక్షిణం సిద్ధ సేవితం
ఏవం యః సతతం ధ్యాయేత్
దేవదేవం సనాతనం
సముక్త సర్వపాపేభ్యో
నిశ్రేయశమ వాప్నుయాత్

- శాండిల్యోపనిషత్

అనసూయానందవర్ధనుడు అత్రిపుత్రుడు
అగు దత్త భగవానుడు త్రిమూర్త్యాత్మకుడు.
శ్రీ దత్త భగవానుని రూపము సచ్చిదానంద
ముల ప్రోవుగ అనుభూతిని కలిగించును.
ఈ భగవంతుడు "స్మర్తృగామి" స్మరణ
మాత్రసంతుష్టుడు, సన్నిహితుడు.
ఓంకారములోని అ, ఉ, మ లకు
మూడు శిరస్సులు సంకేతము

అక్షమాల - సర్వమంత్రాత్మకము
త్రిశూలము - త్రికము లన్నిటిని సూచించును
చక్రము - అవిద్యానాశకము
శంఖము - నాదాత్మకము
డమరుక - సారస్వత జనకము
సోదక కమండలము - కర్మఫలదాయకము
గోవు - మనోరూపమగు మాయ - తన యోగబలముచే
కామధేనువుగ శ్రీదత్తుడు మార్చెను
జాగిలములు - నాల్గు వేదములు వేదధర్మము
నుద్ధరింపుమని దత్తాత్రేయుని వేడుచుండును

దత్తనామమును చిత్తము నందున
నిరంతరంబును స్మరించుచుండిన
శాంతి సుఖంబులు సమకూరు తడయక

దత్తాత్రేయుడు

అజగర రూపమున ప్రహ్లాదునకు
ఆత్మ విద్యను బోధించెను
కార్తవీర్యార్జునకు స్వాత్మ విద్యను ప్రసాదించెను
అలర్కునకు బ్రహ్మవిద్య గరిపెను
పరశురామునకు శ్రీవిద్యను ప్రసాదించెను
దుష్టులను శిక్షింపక వారి మనః
పరివర్తన చేయుట శ్రీ దత్త విభూతి

శ్రీపాద శ్రీవల్లభుడు, శ్రీ నరసింహసరస్వతి
శ్రీ దత్తాత్రేయుని పూర్ణావతారములు

సద్గురుమూర్తులు
శ్రీపాద శ్రీవల్లభ శ్రీనరసింహ సరస్వతుల
సంగ్రహ చరిత్ర

శ్రీపాద శ్రీవల్లభుడు

పిఠాపురమున సుమతి, అప్పలరాజా దంపతుల పుణ్య ఫలముగ శ్రీదత్త భగవానుడు వారింట శ్రీపాద శ్రీవల్లభునిగ జన్మించెను. గ్రుడ్డి సోదరునకు చూపు, కుంటి సోదరునకు నడక ప్రసాదించి తల్లి దండ్రులకు ముదమును గూర్చెను. తల్లి దండ్రులకు జ్ఞానోపదేశము చేసి తీర్థాటనమునకు వెడలెను. గోకర్ణ క్షేత్రములో కొద్ది కాలముండి కురుగడ్డను చేరెను.

ఒక మందబుద్ధిని ప్రజ్ఞావంతునిగ అనుగ్రహించెను. తన్ను భక్తితో సేవించిన రజకునకు జన్మాంతరమున బీదరు రాజగునట్లు అనుగ్రహించెను. వల్లభేశుడను విప్ర వ్యాపారిని దొంగల బారినుండి కాపాడెను. కురుగడ్డలో అనేక దివ్య లీలలు చూపెను.

కురుగడ్డ

ఇది కృష్ణానదిలో ఉన్న చిన్న ద్వీపము. విస్తీర్ణము సుమారు 12 చదరపు కిలోమీటర్లుండును.

రాయచూరు జిల్లాలో ఆంధ్ర కర్ణాటక సరిహద్దున ఉన్నది. దీనిని చేరుటకు నాల్గు మార్గములు గలవు. 1. బొంబాయి మద్రాసు బ్రాడ్‌గేజ్‌లైనులో రాయచూరు, కృష్ణా స్టేషన్ల వద్దగాని కాచ్‌గూడా కర్నూలు మీటరుగే.జి లైనులో దేవల్ కాద్రా, గద్వాల్ స్టేషన్ల వద్దగాని దిగవలెను.

1. గద్వాలు స్టేషనులో దిగి రాయచూరుకు పోవు బస్సులో యాపలదిన్ని అను గ్రామము వద్ద దిగవలెను. అక్కడికి 6

కిలోమీటర్లు దూరములో నున్న ఆత్కూరు గ్రామమునకు పోయి అక్కడ స్థానికుల సహాయముతో కృష్ణపాయను దాటి కురుగడ్డ చేరవచ్చును.

2. రాయచూరు నుండి యాపలదిన్ని, అక్కడ నుండి ఆత్కూరు చేరి స్థానికుల సహాయముతో కృష్ణ దాటి కురుగడ్డ చేరవచ్చును.

3. కృష్ణా స్టేషనులో దిగి సుమారు 30 కిలోమీటర్లు బండిపై/ బస్సుపై ప్రయాణము చేసి పాసిపల్లి గ్రామము చేరవలెను. అక్కడ కృష్ణను జాలర్ల సహాయముతో దాటి కురుగడ్డ చేరవచ్చును.

4. దేవరకాద్రా స్టేషనులో దిగి బస్సులో 'ముక్తార్' అను గ్రామము చేరవలెను. అక్కడ నుండి పంచంపాడు గ్రామము చేరుకొని పడవ వారి సహాయముతో కురుగడ్డ చేర వచ్చును. పైన పేర్కొన్న గ్రామములలో బస చేయుటకు సత్రములు ఉన్నవి.

కురుగడ్డ వద్ద కృష్ణానది రెండుగా చీలి దానిని చుట్టి యున్నది.

కురుగడ్డలో శ్రీవాసుదేవానంద సరస్వతి తపస్సు చేసిన గుహ యున్నది. ఈ కురుగడ్డలోనే శ్రీపాద శ్రీవల్లభులు సిద్ధి పొందినారు.

వారి పాదుకలకు గుడిలో ప్రతి నిత్యము పూజలు అభి షేకములు జరుపుచుందురు.

కురుగడ్డ అత్యంత పవిత్రమైన ప్రదేశము. శ్రీపాద శ్రీవల్లభులు అచటనే అనేక దివ్యలీలలు ప్రదర్శించిరి.

అత్యంత రమణీయమైన అచటి ప్రకృతి దర్శనము పరమ శాంతిని కలుగజేయును.

కృష్ణానది ఈ గడ్డకు భక్తితో ప్రదక్షిణము చేయుచున్నదా అన్నట్లుండును. కృష్ణానదిలో స్నానము చేసి పవిత్రులైన తరువాతనే కురుగడ్డను చేరుకుందుము.

కురుగడ్డ యాత్ర చేసిన వారి సర్వదుఃఖములు హరించును. సందియము లేదు. ఇచ్చట శివాలయము, పురాతనమైన మఱ్ఱిచెట్టు చూడదగినవి - మహిమాన్వితములు.

నరసింహ సరస్వతి

కరంజపురమున మాధవుడు, అంబ అను దంపతులకు జన్మించెను. దత్త భగవానుని అవతారమే. ఉపనయనము వరకు మౌనముగ మూగవానివలె నుండి తరువాత మౌనము వీడి మాటలాడిన మహాత్ముడు. అనేక దివ్యలీలలను ప్రదర్శించెను. పిశాచములకు దృష్టి మాత్రమున సద్గతి కల్గించెను. కుష్టు వ్యాధుల పూర్తిగ హరింపజేసెను. మరణించినవారిని బ్రతికించెను. ఉద్దండ పండితుల అహంకారము నడచెను. ఉపాసకుల అహంకారము సరిదిద్దెను. ధర్మసూక్ష్మముల నుపదేశించెను. వేదధర్మమును పునరుజ్జీవింపజేసెను.

కుల మత జాతుల ప్రసక్తి లేదు. ఎందరెందరినో అనుగ్ర హించెను. గాణ్గాపురము, నరసింహసరస్వతి యునికిచే మహాక్షేత్ర మయ్యెను.

గాణ్గాపురము

రాయచూర్ పూనా రైలు మార్గములో గాణ్గాపూర్ స్టేషను ఉన్నది. అక్కడ దిగి 24 కిలోమీటర్ల దూరములో నున్న గాణ్గా పురమును చేరవచ్చును. బస్సులున్నవి. భీమా అమరజా నదులు కలియుచోటు (సంగమము) అక్కడికి రెండు కిలోమీటర్ల దూరములో నున్నది.

గాణ్గాపురమున నరసింహ సరస్వతీస్వామివారు సుమారు 24 సంవత్సరములుండిరి. అనేక దివ్యలీలలు చూపిరి. దత్త క్షేత్రములన్నిటిలోను ప్రసిద్ధి గాంచినది గాణ్గాపురము.

ప్రారంభములో నరసింహ సరస్వతి సంగమము వద్ద నుండెను. గాణ్గాపురము రాజు ప్రార్థన నంగీకరించి గాణ్గా పురమున తన కొరకై నిర్మించిన మఠమునకు వచ్చిరి.

గాణ్గాపురమున నరసింహసరస్వతి నిర్గుణపాదుక లున్నవి. ఈ పాదుకలకు జలాభిషేకము చేయరు. అష్టగంధ లేపనము కేసరి లేపనము చేయుదురు.

శివపార్వతులు, నాగనాధుడు, ఆంజనేయుడు వీరి విగ్రహ ములు పరిసరములలో నున్నవి.

దగ్గరలో అష్ట తీర్థము లున్నవి.

1. షట్కుల తీర్థము
2. నరసింహతీర్థము
3. భాగీరథీ తీర్థము
4. పాపనాశతీర్థము
5. కోటి తీర్థము
6. రుద్రపాదతీర్థము
7. చక్రతీర్థము
8. మన్మధ తీర్థము

గాణ్గాపురమున దత్త జయంతి ఉత్సవములు అతి వైభవ ముగా జరుపుదురు. దత్తోపాసకులు భక్తులు ఈ క్షేత్రములో నెలల తరబడి దత్తుని ధ్యానము, గురు చరిత్ర పారాయణము చేయు చుందురు.

ఉపోద్ఘాతము

శ్రీ నరసింహసరస్వతి ముఖ్య శిష్యులలోనివాడు సాయందేవుడు. ఈయన పుత్రుడు నాగనాధుడు. నాగనాధుని కొడుకు దేవరాజు. దేవరాజు పుత్రుడు గంగాధరుడు - గంగాధరుని కుమారుడు సరస్వతి. (గురుచరిత్ర సొంతము తెలియుట అమరులకైనను అసాధ్యమే) సరస్వతి నామకుడయిన గంగాధరుని పుత్రుడు, మహారాష్ట్ర భాషలో ఈ గురుచరిత్ర రచించెను. సర్వజనులకు ఉపయోగపడునట్లుగా గురుచరిత్రను శ్రీ వాసుదేవానంద సరస్వతి సంస్కృత భాషలోనికి అనువదించెను. భారతీయ భాషలన్నిటిలోను గురుచరిత్ర అనువాదము లున్నవి.

తెనుగు భాషలోనికి శ్రీ అవధూత బోదానంద సరస్వతీ స్వామి, శ్రీ ఇనుకపల్లి సంజీవశర్మగారు, శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు గురుచరిత్రను అనువదించిరి. ఈ మూడును యధాతధానువాదములు కాకపోవుటచే శ్రీపాద శ్రీవల్లభమహా సంస్థానమువారు (పిఠాపురము) యధాతదముగా శ్రీ గురు చరిత్రను సంస్కృతము నుండి తెనుగులోనికి అనువదింప జేసి ప్రచురించిరి. ఈ అనువాదము చేసినది శ్రీ పన్నాల భట్టుశర్మగారు.

గురుచరిత్ర కామధేనువు వంటిది. భక్తితో చదివిన వారికి సుఖసంపదలు శాంతియు కలుగును, కోరికలన్నియు తీరును, కష్టములన్నియూ హరించిపోవును. గ్రంధమును ప్రత్యక్షముగ నున్న గురుమూర్తిగా భావించినచో సర్వైశ్వర్యములు సమకూరును.

గురుచరిత్ర నామ ధారక సిద్ధసంవాదరూపములో రచింపబడినది.

నామధారకుడు

ఇతను దత్తాత్రేయుని నిత్యము ఆరాధించును. పూజలు భజనలు చేయును - అయినను అతని మనస్సుకు శాంతిలేదు. దైన్యముతో మనస్సు కుందుచుండును.

గాణ్గాపురమున గురుపాదుకల పూజించు వారలనేకులు తమకు కల్గిన కామితార్థములకు సంతోషించుచుండుట విని గురుపాదుకలను స్వయముగా అర్చించుటకు నామధారకుడు ప్రయాణ మాయెను. తనలో పరిపరి తన దీనస్థితిని తలచు కొనుచు; గురుమూర్తి ఏల అనుగ్రహింపడని కుందుచు దు:ఖించుచు దోవలో ఒక చెట్టు నీడలో మూర్ఛ నొందెను. భక్తవత్సలుడు కలలో నామధారకునికి దర్శనమిచ్చి దీవించెను.

మేలుకొని ముందుకు సాగుచుండగా కలలో నగుపడిన సాధువే ప్రక్కగ నడుచుచుండుట చూచి స్వామీ అని పిలిచెను. స్వామి దగ్గరకు పోయి తన గోడు చెప్పుకొనెను. స్వామి తన పేరు సిద్ధుడనియు, శ్రీ నరసింహసరస్వతీ స్వామి ముఖ్య శిష్యులలో తానొకడిననియు, గాణ్గాపురమున సద్గురు పాదుకల నర్చించుటకు పోవుచున్నాననియు చెప్పెను.

నామధారకుడు తానును గాణ్గాపురమునకే పోవుచున్నానని గురుమూర్తిని భక్తితో అర్చించుచున్నను తనకు దీనత్వ మేలయని ప్రశ్నించెను. సిద్ధుడు నామధారకునితో గురువుపై పరిపూర్ణ విశ్వాసము ముఖ్యమని చెప్పి అతనికి గురుతత్త్వమును పూర్తిగ తెలుపుటకునై "గురుచరిత్ర"ను చెప్పుట ప్రారంభించెను. మధ్య మధ్యలో నామధారకుడు ప్రశ్నించుటయు సిద్ధుడు అతని సందేహములను తీర్చుటయు గురుచరిత్రగా ప్రఖ్యాతమయ్యెను.

పోతాప్రగడ వెంకట సుబ్బారావు

విషయ సూచిక

విషయము	పుట సంఖ్య

శ్రీపాద శ్రీవల్లభుల చరిత్ర

(గేయము)

రాగతాళయుక్తముగ గానము చేయవచ్చును



రచన :

పోతాప్రగడ వెంకట సుబ్బారావు, ఎం.ఏ.,

ఓం గురుదేవ దత్త

శ్రీపాదశ్రీవల్లభదిగంబరా

జననము-బాల్యము

ఆంధ్రదేశమున పురాతనంబగు
పిఠాపురంబను పట్టనమున్నది
అట నివశించెను అప్పలరాజా
సత్కులజాతుడు సద్బ్రాహ్మనుండు
అతని సతి సుమతి అనుపమ గుణవతి

దంపతులిద్దరు ధర్మము తప్పక
సదాచారముల సాంప్రదాయముల
పరిపాటింతురు భయభక్తులతో
విష్ణుడె ఇంటికి వేంచేసెననుచు
అతిధులు వచ్చిన ఆనందింతురు

అమవస దినమది ఆ సమయంబున
నడినెత్తిని సూర్యుడుండె దత్తుడు
బ్రాహ్మణ వేషము వహించి వచ్చెను
వారింటి ముందు నిలబడె బిక్షువు.
గమనించె నతని సుమతి శ్రద్ధగ
మహాత్ము డీతడు మన అదృష్ట మిది
ఆతిథ్య మొసగి ఆదరించవలె
భిక్షకు దత్తుడు వచ్చు సమయమిది
అని మది తలచెను ఆహ్వానించెను
లోనికి రమ్మని వినయ ముట్టిపడ

పితృతర్పణములు జరుగనేలేదు
ఆలస్య మగును, ఆసన మిదిగో
విశ్రాంతి గొనుడు వచ్చెదరిపుడే (భర్త)
అని తా చెప్పుట అనుచిత మగునని

సపర్యలన్నియు చక్కగ జేసెను
సామికి పెట్టె స్వాదు భోజనము.
అతిథి భుజించెను ఆనందించెను
మెచ్చెను మదిలో హెచ్చుగ ఆ యమ
సౌజన్యంబును సౌశీల్యంబును
నిజరూపంబున దర్శన మొసగెను
వరదుడు దత్తుడు కరుణకు నిలయుడు.

మైమరచి సుమతి ఆ మహనీయుని
కాంచుచు నిలబడె కనుమూయకుండ
నిరాలంబమై పరగెను చిత్తము.

నీ మనోభీష్టమేమో తెలుపుము
అనుగ్రహించెద అనుమానింపకు
అని దత్తుండన ధైర్యము కలిగెను
భక్త వరదునకు భవాబ్ధి పోతకు
నమోవాకములు నమోవాకములు
కామింతదాయివి కరుణామయుడవు
ఆర్తిని దీర్చుము అనాధ రక్షక
నిను కనుగొంటిని నీ చరణములే
నాకు శరణ్యము నను కాపాడుము
(అనుచు) తాకెను పదములు ఏకాగ్రతతో

దత్తుడు అమ్మా ధైర్యము పూనుము
కోరుము వరమును కోరిక తీర్చెద
ఆనందముతో ఆయమ పల్కెను
అమ్మా యంటివి అదియే కోరిక
బిడ్డ లెందరో పుట్టిరి చచ్చిరి
ఇద్దరు మిగిలిరి అంధుం డొక్కడు
కుంటివా డొకడు కడు దుర్భరమిది
నిను పోలిన తనయుని నే కోరెద

జ్ఞానియు యోగియు జగద్వంద్యుడును
వంశ వర్ధనుడు వరిష్టు డగు నొక
తనయుడు కావలె అనుగ్రహింపుము

దత్తుడు అమ్మా దైన్యము విడువుము
కలుగును పుత్రుడు కోరిక తీర్చును
జగద్గురువుగా జగతిని వెలుగును
ఎదురాడ వలదు ఆతని మాటకు
ఎదురాడినచో విడుచును గృహమును
అని దత్తుడు తా నదృశ్యు డయ్యెను

ఆయమ కదలక అటనే నిలబడి
ఆ రూపమునే స్మరించు చుండెను
వచ్చిన పతితో విషయము చెప్పెను

అప్పలరాజా ఆనందముతో
ధన్యుల మైతిమి దత్తాత్రేయుడె
వచ్చె భిక్షువుగ వరము నొసంగెను
మన పూర్వజన్మ పుణ్య విశేషము
తరించె వంశము ధన్యులు పితరులు
దత్తాత్రేయుడు మధ్యాహ్నంబున
భిక్షకు వచ్చును విప్ర గృహములకు
వారు మాహురుని కరవీరంబున
ప్రసిద్ధి గాంచిన పాంచాలేశ్వర
క్షేత్ర రాజమున చరించు చుందురు
కరుణా మయుడగు పరబ్రహ్మమే
ధర జన్మించెను ధర్మరక్షణకు
యోగ మార్గముల నుద్ధరింపగా
భక్తుల నెల్లర పరిరక్షింపగ
అప్పలరాజా చెప్పిన మాటలు
శ్రద్ధగ విని తన సంశయము తెల్పె

అమవస దినమిది వైశ్వదేవమును
పితృతర్పణమును నిత్యార్చనయును
చేయక మునుపే చేసితి భిక్షను
క్షమించవలె, నను, సదయ హృదయమున

ఆమెతో ననెను అప్పలరాజా
జరిగిన దంతయు శాస్త్రసమ్మతమె
సమయస్ఫూర్తికి సంతసించితిని
పితృశ్రాద్ధమును పెట్టిన ఫలితము
విష్ణుని కర్పణ చేయుదురోయీ!
విష్ణువు తానే విచ్చేసె నిటకు
విచార మేలను విడువుము చింతను

అనంతర కాలమున
పుణ్యదంపతులు పూజలు చేయుచు
దత్తాత్రేయుని మదిలో తలచుచు
కాలము బుచ్చిరి కడు ముదమందుచు

అనతి కాలమున పుణ్యవతి సుమతి
దాల్చెను గర్భము దైన్యము తొలగెను
పుత్రుని గన్నది దత్తు నంశమున
బాలుని జాతక చక్రము రచించి
దైవజ్ఞు లనిరి దివ్య చరిత్రుడు
జగద్గురువుగా జగతిని శోభిలు
సాధుపురుషులకు సజ్జనావళికి
దీక్ష నొసంగును దీప్తిని పెంచును
శంఖచక్రాది రేఖలు చూచిరి
పెద్దలు బాలుని పాదములందున
శ్రీపాదుండని పేరిడి రతనికి.
బాలుని చూచుచు తల్లియు తండ్రియు
దత్తాత్రేయుడె తమకు తనయునిగ
జన్మించె ననుచు తన్మయులయ్యిరి

ప్రాయము వచ్చిన బాలునికి వారు
ఎనిమిదవ ఏట గణుతిగ జేసిరి
విధి విధానముగ విప్రుల సన్నిధి
ఉపనయనంబును ఉత్సాహముతో

అనతి కాలమున ఆ శ్రీపాదుడు
వేదవేదాంగ విద్యల నెల్లను
సమగ్రంబుగా చదువుటయె కాక
పాఠము చెప్పెను పండిత వరులకు

బాలునకు వచ్చె పదునారేడులు
తలిదండ్రు లపుడు తలపెట్టినారు
వివాహ మతనికి విని నీ మాటను
తన మనసులోని తలపును చెప్పెను
తడబాటు లేక తల్లి తండ్రులకు

వైరాగ్యము నే కోరెద నిరతము
స్త్రీలనందరిని తల్లిగ జూతును
యోగలక్ష్మియే తగిన సతీమణి
శ్రీపాదుడ నను శ్రీవల్లభునిగ
మది గమనించుడు ముదమును పొందుడు

ఉత్తర దిశగా పోయెద నిప్పుడు
ధర్మమార్గమును ధరలో నెరపెద
శాంతి సుఖంబులు భక్తుల కొసగెద

సుమతి అప్పలరాజులు

దత్తాత్రేయుడు దర్శన మొసగిన
నాటి మాటలను మాటిమాటికిని
"ఎదురాడినచో వదలును గృహమును"
మదిలో తలచుచు ఎదురు చెప్పకనె
కండ్ల నీరిడుచు యుండిరి మిన్నక

శ్రీపాదు డపుడు చిరుహాసముతో
వారి కన్నీరు కరమున తుడిచెను
ఏమి కష్టమో చెప్పడు నాతో
కోర్కెలు తీర్చెద కూర్చెద శాంతిని

సుమతి సుతునితో నెమ్మదిగ బల్కె
ఇన్ని దినంబులు నిను చూచుకొనుచు
హాయిగ నుంటిమి అన్ని దుఃఖములు
మటుమాయమయ్యె, మము వీడినచో
తిరిగి వచ్చునవి భరింపజాలము
వృద్ధుల మైతిమి ఆదుకొందువని
సంతోషముతో బ్రతుకుచున్నాము
మారెను కల్లగ మా కల లన్నియు
కుంటివాడొకడు గుడ్డివాడొకడు
ఇరువురు నీ సోదరులను చూడుము
నీ వేగినచో ఏ గతి పట్టునొ
ఇదియే కష్టము ఇదియే చింతయు

తల్లి చెప్పగా దరహాసంబున
అమృత దృష్టితో అన్నల చూచెను
కరుణామృతమును కురిపించగనే
కుంటి పరుగిడె నిటకును నటకును
గుడ్డివాని కట గోచర మయ్యెను
పరిసరములన్ని హా!యని అరచెను

ఇద్దరు సోదరులు

అమ్మా తమ్ముడు మహాత్ముడమ్మా
అతని చూపులో అమృతంబున్నది
అంగవైకల్య మవలీల బాసె

శ్రీపాదునితో

మము దరి చేర్చిన మహనీయుండవు

పరమాత్ముండవు భక్తవరదుడవు
అని స్తుతించిరి అమిత భక్తితో
శ్రీపాదుడు వారికి దీవన లిడె.
పుత్ర పౌత్రాభివృద్ధిని గందురు
సంపద సుఖములు శాంతియు చేకురు
తల్లి దండ్రులను తనుపుడు సేవల
అని వారల నత డాదేశించెను

తలి తండ్రులతో తా పలికె నిట్లు
అన్నలిద్దరూ ఆనందముతో
శత వత్సరములు వర్ధిలుచుందురు
వారి పుత్రులను మీరిద్దరునూ
ముద్దులాడుదురు ముదమునుగాంతురు

చింతను మానుడు శాంతి వహింపుడు
వేద విదులు మీ ఇంట జనింతురు
అనుజ్ఞ నొసగుడు ఆనందముతో
అని పలుకుచు తా నదృశ్యమయ్యెను

శ్రీపాద శ్రీవల్లభుని తీర్థయాత్రలు

వారణాశి తావడిగా చేరెను
విశాలాక్షినీ విశ్వనాధునీ
గంగా మాతను గణుతించె మదిని
ఆపై చేరెను ఆ శ్రీపాదుడు
బ్రహ్మర్షులుండు బదరికాశ్రమము
నరనారాయణ దర్శనము చేసె
దేశము నందలి దివ్యస్థలములు
క్షేత్రరాజములు సందర్శించెను
తీర్థాటనమును పూర్తి చేసికొని
గోకర్ణంబున గుప్తముగ నుండె
వత్సర త్రయము ఆత్మారతుడై

అనంతరము

శ్రీ భ్రమరాంబా శ్రీమల్లికార్జు
నుల దర్శించెను. శ్రీశైలముననె
చాతుర్మాసము చక్కగ నెరపెను
శ్రీగిరిని విడిచి శ్రీగురుమూర్తులు
కృష్ణానదిలో కుదురుగ నిలచిన
కురుపురవరమును చేరిరి. అటనే
లెక్కకు మీరిన లీలలు చూపుచు
స్థిరముగ నుండిరి శిష్యుల తోడను
శ్రీపాదులటనె సిద్ధిని పొందిరి

శ్రీపాదులు చూపిన లీలలు
రజకుని కధ

కురుపురవరమున కలడొక రజకుడు
శ్రీపాదుల సేవించును నిత్యము
నదిలో స్వామి స్నానము చేసిన
బట్టల నుతుకును పరిశుభ్రపరచు
మూడు పూటలను కడు వినయముతో
సాష్టాంగ నమస్కారము చేయును
క్రమమును తప్పడు నేమియు కోరడు
ధన్యుడ నైతిని దశమారునింక
అని మది తలచును ఆనందించును

ఒకదినము సామి చాకలిని చూచి
ఎంతో పుణ్యము చేసితివి నీవు
ఒక రాజ్యము నీ కొసగెద నోయీ
అన విని చాకలి వినయముతో ననె
దీనుడ నల్పుడ। దేవర వారో
సత్యసంకల్పులు తపో మూర్తులు
మీరన్నమాట జరుగుట తథ్యము
అని మిన్నకుండె నవనత ముఖుడై.

రజకుని మదిలో శ్రీపాదులపై
శ్రద్ధాభక్తులు అధికంబయ్యెను
సామిని జూచిన నమస్కరించును
దూరము నుండియె పరమ భక్తితో
ఆశ్రమము తుడిచి శుభ్రము చేయును
స్మరించు సామిని నిరంతరంబును
సర్వము సామికి అర్పణ చేయును

అది వైశాఖము నదీతీరమున
బట్టల నుతుకుచు నిటునటు చూచుచు
రజకుడు కాంచెను రమణీయంబగు
నావను నదిలో అపూర్వమైనది
దారాపుత్రాదులతో హాయిగ
విహరించుచుండె వేడుక మీరగ
యవన రాజొకడు అతి వైభవముగ
రథ గజ తురగపదాదులు తీరము
వెంబడి నడచెను, వీనుల విందుగ
వినబడుచుండెను వివిధ వాద్యముల
మధుర స్వనములు, మధుర భావములు
పెనగొన రజకుడు తనలో ననుకొనె
అనుభవించవలె ఐశ్వర్యంబును
వైభవము లేని నా బ్రతు కదియొక
బ్రతుకా వ్యర్థము కద పరికించిన

నా జీవిత మొక నరక ప్రాయము
దారిద్ర్యమునకు దరి లేకున్నది
పూర్వజన్మకృత పాప ఫలంబిది
ధన్యు డారాజు తానే దేవుని
ఆరాధించెనో ఐహిక సుఖములు
అధికారంబును సుందరుల పొందు

అనుభవించుచూ హాయిగ నుండెను
అని మది తలచుచు ఆశ్రమము చేరి
శ్రీపాదుల వారి ముందు నిలబడె
క్రిందికి చూచుచు చేతులు మోడ్చెను
సర్వజ్ఞుండగు సామి కనుగొనెను
రజకుని మదిలో రగులుచున్న యా
కోర్కెల నెల్లను. దరహాసముతో
ఓరీ రజకా! తెలుపుము కోరిక
తీర్చెద నన విని రజకుడు తెల్పెను
చూచిన విషయము హెచ్చిన కోర్కెయు
కోర్కెలు మనస్సు కలచి వైచినవి
ఇంద్రియ జయంబు ఇంచుకయు లేదు
సామీ మీ చరణములే శరణము

అన విని

శ్రీపాదులనిరి చిరుహాసముతో
వాసన లన్నియు నిశ్శేషముగా
నశింప కుండిన సంసరణములో
పరిభ్రమింతురు పరిపరి విధముల
రాజ్య భోగములు ఐశ్వర్యంబును
అనుభవించవలె నను నీ కోరిక
నిరాటంకముగ నెరవేరునురా!
నీదగు భక్తికి సంతసించితిని
మ్లేచ్ఛ రాజువై మేదిని జనించి
అనంత భోగము లనుభవించెదవు
అన విని రజకుడు ఆనందించెను

మీ చరణములే నాకు శరణ్యము
చరణ వియోగము భరింపజాలను
మరు జన్మంబున దర్శన మొసంగి
ధన్యుని చేయుడు నే నిదె కోరెద

శ్రీపాదులనిరి చిరుహాసముతో
బీదరు రాజుకు బిడ్డగ జనించి
రాజ్య మేలెదవు ధర్మబద్ధముగ
నరసింహ యతిగ దర్శన మిచ్చెద
కోరిక తీర్చెద మరువనులే నిను
వృద్ధాప్యంబున ఆత్మజ్ఞానము
అలవడు నీకని ఆశీశు లిడెను

అన విని రజకుడు అమిత భక్తితో
సాష్టాంగ నమస్కారము చేసెను
శ్రీపాదులనిరి ఈ జన్మముననె
రాజ్యమేలుటకు ఇచ్ఛయున్నచో
కోరిక తీర్చెద తెలుపుము తడయక
అది విని రజకుడు అవనత ముఖుడై

యవ్వనమే గద అన్ని భోగములు
అనుభవించుటకు అనువగు సమయము
వృద్ధుడ నైతిని చిత్తస్థైర్యము
కోల్పోయినాను, కరుణించ వలెను
అనుగ్రహింపుడు ఐశ్వర్యంబును
రాజభోగమును వచ్చెడి జన్మను
అన శ్రీపాదులు అటులే యగు ననె

రజకుడు

ఆ దినముననే అసువులు బాసెను
బీడరు నబాబు బిడ్డగ పుట్టెను
రాజాజ్ఞ యనుచు రమణీయముగా
అలంకరించిరి పౌరులు నగరము
దానధర్మములు దండిగ జరిగెను
భావి యువరాజు భాగ్యశాలి యని
బాలుని పొగడిరి పురజనులందరు.

అంబిక కథ

శాస్త్రము వేదము చక్కగ చదివిన
విప్రుండుండెను కురుపురవరమున
పరమ నైష్ఠికుడు పండితవర్యుడు
ఆతని సతి పే రంబిక, గుణవతి
ఆ దంపతులకు అదేమి కర్మమొ
పుట్టిరి గిట్టిరి పుత్రులెందరో
మిగిలెను చివరకు ఒకడే పుత్రుడు
జడుడా బాలుడు కడు మందబుద్ధి

ఎనిమిదవ ఏట చేసిరి పెద్దలు
ఉపనయనంబును ఉత్సాహముతో
వేదవిదునిగా తీర్చి దిద్దవలె
బాలుని అని మది తండ్రి తలపోసె
'సంత' తనయునకు మొదలిడె చెప్పట

బాలుడు

ఒక పదమైనను చక్కగ పలుకడు
తికమక పడుటను తిలకించె తండ్రి
వేదన చెందెను మదిలో హెచ్చుగ
ఇంతటి దుస్థితి ఏల కలిగినది
ఏ పాపఫలము ఇటు వెంటాడెను.
దండించె సుతుని దారుణంబుగా
భార్య అడ్డుపడి పతితో నిట్లనె

మనకు మిగిలినది ఈ నలుసొక్కడె
పురాకృత కర్మ ఫలంబు మనకిది
కొట్టిన బాలుడు తట్టుకొనలేడు
ఇకపై బాలుని శిక్షించినచో
ప్రాణము విడిచెద నని విలపించెను

విప్రుడు మదిలో వేదన చెందెను
దురదృష్టమనుచు విలపించె మదిని
కాలము తీరెను మరణించె నతడు

తల్లి, కొడుకు

దారిద్ర్యముతో తనయుడు తానును
యాచన చేయుచు అటనే యుండిరి
పదునెనిమిదేండ్లు బాలునకు వచ్చె
వివాహంబునకు వెదకెను కన్యను
తల్లియత్నములు ఫలింపకుండెను
బుద్ధిహీనునకు పుత్రిక నిచ్చిన
ఎటు పోషించును ఏమి సుఖపెట్టు

బాలుడగుపడిన బంధువు లందరు
పరిహసించుచూ పల్కెదరతనితో
వేదశాస్త్రములు విద్యలనేకము
నేర్చిన ఘనుండు నీ తండ్రి గదర
తల్లికి బరువై తిరుగుచుంటివిట
నీళ్లు మోసికొని ఇకపై బ్రతుకుము
ఇష్టము లేనిచో కృష్ణానదిలో
పడి చచ్చుటయే పద్ధతి నీకన
తల్లిని చేరెను మెల్లగ పలికెను
"అమ్మా నే నీ అవమానంబులు
భరింప జాలను మూర్ఖుడ నందురు

"చచ్చుట మంచిది చదువురాదు కద
నదిలో దూకుము ఇదియే మార్గము."
పెద్దల సలహా వ్యర్థము చేయక
నదిలో దూకెద అనుజ్ఞ నొసగుము"

అన విని

తల్లి హృదయము ద్రవించి పోయెను
నేనును నీతో మునిగెద నదిలో

మన మొకసారియె మరణింతమనుచు
నదిని చేరిరా మాతయు తనయుడు

అదే సమయమున అచటికి వచ్చిరి
స్నానమాడగా శ్రీపాద సామి
అంబిక చూచెను ఆ గురుమూర్తిని
పరుగిడి పోయెను పాదము పట్టెను

అంబిక స్వామితో

అధోగతి చేర్చు ఆత్మహత్య యని.
తెలిసియు మేమిట కేతెంచినాము
నదిలో పడుటకు మది నిశ్చయించి
ప్రాణము పోయిన బాధలు తొలగును
ఆపై ఏమో ఎవరికి తెలియును
కరుణామూర్తులు పరమపవిత్రులు
ఉద్ధరింపవలె దుర్గతిని బాపి

శ్రీపాదు లనిరి ఏమికష్టమది
అసువులు బాయుట కవసరమదేమి
అన విని చెప్పెను అవనతముఖియై
సామీ ఈ నా కుమారుడు జడుడు
బుద్ధిహీనుడని బంధువు లనెదరు
దూషింతు రతని చూచిన తోడనె
ప్రాణము విడిచిన బాధ తప్పనని
నదిలో దూకగ మది నిశ్చయించి
ఇచట చేరితిమి చూచితిమి మిమ్ము
వేదశాస్త్రములు విద్యల నెన్నియు
నేర్చిన ఘనునకు ఎట్లు జనించెనో
ఈ మందబుద్ధి ఏ పాప ఫలమొ

ముందు జన్మలో సుతుని కోరెదను
మీవంటివాని. మీరే తెలుపుడు

కోరిక తీర్చెడి తరుణోపాయము
భవభయ హరములు పరమపూజ్యములు
మీ చరణములే ఎదను నిల్పితిని
అనుగ్రహింపుడు ఆర్తిని తీర్చుడు
పుట్టిన దాదిగ కష్టములలోన
మ్రగ్గితి ఏ యొకసుఖంబు నెరుగను
పుట్టి రెందరో గిట్టిరి వారలు
నా సౌభాగ్యము నష్టంబాయెను
కలడీ బాలుడు కడు మందబుద్ధి
చిన్న పనినైన చేయుట తెలియదు
ముందు జన్మలో ముక్తిని గూర్చెడి
జగత్పూజ్యుడగు సత్పుత్రు బడయ
కోరిక యున్నది సరియగు మార్గము
బోధింపు డనుచు పదముల పైబడె
పరమ భక్తితో సర్వము మరచెను

అంబికను సామి ఆశీర్వదించె
ఆరాధింపుము అనన్య భక్తిని
శివుని నిత్యమును శివనామమునే
స్మరించుచుండుము నిరంతరంబును
ప్రదోష వ్రతమును భక్తిని సలుపుము
మరుజన్మంబున కలుగును పుత్రుడు
ననుబోలు వాడు నమ్ము నా మాట.

అని స్వామి తన అమృత మయంబగు
హస్తము బాలుని మస్తకమందున
హత్తెను మెల్లగ, ఆ క్షణముననే
బాలునకు గల్గె శాస్త్రజ్ఞానము
వేదము పఠించె విజ్ఞులు మెచ్చిరి
అంబిక మదిలో అబ్బురమందెను
సామి ఈశ్వరుడె సత్యంబిది యని

సామిని జూచుచు అంబిక పల్కెను
స్వామీ మీరే సర్వేశ్వరులని
మదిలో నమ్మితి మరచితి దుఃఖము
క్రమమును తప్పక అమలిన భక్తిని
ప్రదోష వ్రతమును పాటించుటకై
అనుగ్రహింపుడు మనోబలంబును

తెలిసె నందరకు బాలుని విషయము
పూజ్యుండితడని పొగడి నారతని
వివాహమయ్యెను వైభవంబుగా
ఐహిక సుఖములు ఆముష్మికములు
పుత్ర పౌత్రాభివృద్ధిని పొందెను
శ్రీపాదుల దగు అపార కృప ఇది

శ్రీపాదులు కొంత కాలము కురుపురముననే
యుండి వేరొక అవతారము స్వీకరింప
దలచి (అంబికకు ఇచ్చిన వరము)
ఆశ్వయుజ మాసము హస్తానక్షత్రము
కృష్ణపక్ష ద్వాదశి దినమున కృష్ణా
నదిలో భౌతిక కాయమును పరిత్యజించిరి

-: O :-

వ॥ దేహత్యాగము చేసిన తరువాత కూడ
శ్రీపాదులు భక్తులను రక్షించుచునేయున్నారు
నాటి నుండి నేటి వరకు

అప్పటి వలెనే ఇప్పడు కూడను
దర్శన మొసగును తలచి నంతనే
వారి పాదుకలు కురుపురమందున
ప్రతిష్ఠింపబడె వేదవిహితముగ

కామిత మొసగెడి కల్ప వృక్షములు
వాటి యునికిచే కురుపుర మొప్పెను
పేరెన్నిక గల యాత్రా స్థలముగ.

వల్లభేసుని కథ

కాశ్యపగోత్రుడు ఆచారపరుడు
వల్లభేశుడను విప్రుండుండెను
వాణిజ్యంబున వాసిని గాంచెను
ప్రతి వత్సరమును వల్లభేశుడా
కురుపుర యాత్రను మరువక చేయును
శ్రీపాదుల సేవించుట కొరకై

ఒక వత్సరమున మొక్కుకొనె నతడు
"వ్యాపారములో అధిక లాభములు
వచ్చినచో నే చేసెద తడయక
వేయి విప్రులకు విందును, దక్షిణ
లొసగెద వస్త్రము లిచ్చెద తృప్తిని
గూర్చెద కురుపురమున గురుసన్నిధి"
అనుకొని నటులే అధికలాభములు
వచ్చెను మాట ప్రకార మాతడు

సంబారంబుల సమకూర్చుకొనెను
కురుపురమున కరుగుచుండగా
దొంగలు కొందరు దోపిడి చేయగ
తలపెట్టి యతని దగ్గర చేరిరి
మారువేషమున మంచివారివలె

వల్లభేశుని దొంగలు దోచుకొని చంపుట

నమ్మెను వారిని, నాతో రావలె
విందారగించి ముదమును గూర్చుడు
అన విని వారలు ఆనందించిరి
మూడు దినంబులు గడచెను శాంతిగ
నాల్గవ దినమది అరణ్య మధ్యము
పరుండి రందరు అలసి యుంటచే
నిద్రను మునిగిరి సర్వము మరచిరి

దొంగలు మేల్కొని ఖడ్గములు తీసి
శిరము ఖండించి చేకొనిరి వారు
వల్లభేసు దగ్గరి ధనమంతయు

వల్లభేశుని శ్రీపాదులు బ్రతికించుట

మరణ సమయమున మదిలో తలచెను
శ్రీపాద గురుని "ఆపద్బాంధవ
నను రక్షింపుము నా వాగ్దానము
నెరవేర్చవలెను నీవే నా గతి"

భక్తవత్సలుడు భస్మధారియై
శూలపాణియై అరుదెంచె నటకు
ధూర్తుల నందర దునుమాడినాడు
తస్కరు డొక్కడు తత్తరపడుచూ
శ్రీపాదులవారి పదములు పట్టి
నే దొంగ కాను యాత్రకు వచ్చితి
వారు దొంగలని తెలియదు నాకనె

శ్రీపాదులు, ఓరీ, ఇటు చూడుము
ఇదిగో భస్మము దీనిని తడయక (వల్లభేశుని)
కంఠమున పూసి కలుపుము శిరమును

వాడటులే చేసెను

శ్రీపాదుడు ప్రసరింప జేసె
అమృత సమానంబగు తన చూపును
మృతదేహముపై. కదలిక వచ్చెను
సజీవుడయ్యెను సద్గురు కృపచే
వల్లభేసుండు మేల్కొని చూచెను
ఎదుటపడియున్న మృతదేహములను

చంపిన దెవ్వరు చెప్పుడు తడయక
సజ్జనుల నిట్లు చంపుట తగునా

అన విని

మిత్రులు చెప్పిరి వల్లభేశునకు

మంచివారి వలె మనతో వచ్చిరి
మారువేషమున చోరులు కొందరు
మీ తల నరికిరి విత్తము నంతయు
కొల్లగొట్టుకొని పరుగిడుచుండగ
తాపసి వచ్చెను తన శూలముతో
చోరుల నెల్లర పరిమార్చి నాడు
సంధింపజేయు మీ తల మెడపై
భస్మము నిచ్చెను. భస్మమలదగా
సజీవులయ్యిరి నిచ్చేష్టులమై
నిలబడి యుంటిమి అదృశ్యమాయెను
భక్తరక్షణకు పరమేశ్వరుడే
శూలపాణియై యరుదెంచినాడు

వల్లభేశుడనె పరమకృపాలురు
శ్రీపాదులె నను కాపాడినారు
దర్శనము చేయజాలకపోతిని

వల్లభేశుడు సమారాధన చేయుట

పరమ భక్తితో కురుపురముచేరి
శ్రీపాదులవారి పాదుకల తా
పూజించె సమస్తోపచారముల
అన్నదానమును మిన్నగ జేసెను
విప్రులు నాలుగు వేలకు మించిరి
భూరి దక్షిణలు వారి కొసంగెను
ఆనందించిరి ఆశీశు లిడిరి

వల్లభేశుండు పరమానందము
పొందెను జయ జయ సద్గురుమూర్తీ

దయాసాగరా తరించె జన్మము
శరణు జొచ్చితిని నీచరణములను
స్మరించుచుందును నిరంతరంబును
అనుగ్రహింపుము అనుగ్రహింపుము

శ్రీపాద శ్రీవల్లభుడు
వరదుడు
స్మరించినంతనె సన్నిధి నొసగును
భక్తరక్షకుడు పరమపావనుడు
అప్పటివలెనే ఇప్పుడుకూడను
కోర్కెలు తీర్చును వరములొసంగును
శ్రీపాదశ్రీవల్లభ చరితము
వినవలెనందరు వీనుల విందుగ
ఏకాగ్రతతో ఏ తలపు లేక
ఆత్మజ్ఞానము అలవడు వీరికి
సువర్ణజో తిగ శోభిలుటకునై

మంత్రం

దిగంబరా దిగంబరా
శ్రీపాద శ్రీవల్లభ దిగంబరా

ప్రతిదినము 108 సార్లు జపించినచో కోరికలు తీరును. జయము సమకూరును. జ్ఞానోదయము కలుగును.

ఓం శాంతిః శ్శాంతిః శాంతిః

శ్రీ నరసింహ సరస్వతి చరిత్ర

(గేయము)

రాగతాళయుక్తముగ గానము చేయవచ్చును



రచన :

పోతాప్రగడ వెంకట సుబ్బారావు, ఎం.ఏ.,

శ్రీ నరసింహ సరస్వతి చరిత్ర

జననము, బాల్యము

శ్రీపాదుని, తన చిత్తమున నిల్పి
అంబిక నీశ్వరు నర్చించుచుండె
ప్రదోషవ్రతము పరిపూర్తిచేసె
నియమము తప్పక నిరుపమభక్తిని
కాలము తీరెను మరణించె నామె.

అనంతరము

కరంజ నగరిని విప్రుని యింటను
అంబిక పుట్టెను అందము చింధుచు
పెద్దలు పెట్టిరి పేరు అంబ యని
వయస్సు రాగా వైభవ మొప్పగ
విధి విధానముగ పెండ్లిని చేసిరి
వరుడు మాధవుడు, వరిష్టుడాతడు

దంపతు లిద్దరు తమ పూర్వజన్మ
సంస్కారబలమున చక్కగ శివుని
పూజలు చేతురు సంజసమయమున.
అంబ మాధవులు హాయిగ నుండిరి
కాలక్రమమున గర్భము దాల్చెను
అంబ ముఖంబున అబ్బురము గొల్పు
తేజము కనబడె అసామాన్యమది
శాస్త్రోక్తములగు కర్మలు జరిపిరి
వేడుక లెన్నో విడువక చేసిరి
ముత్తైదువులకు ముచ్చట పడుచును
వాయనము లిచ్చి ఆనందించిరి

అంబకు నిండెను నవమాసంబులు
పుత్రుని గన్నది కోరినట్టుగా
ప్రణవోచ్చారణ పసిపాపచేసె

పుట్టిన తోడనె, పూర్ణ బ్రహ్మము
జనించెనిచ్చట యని తెలుపుట కన.
పుత్రుని జూచుచు పులకాంకితులై
తల్లియు తండ్రియు తలచిరి మదిలో
పరమ కృపాలుడు భక్తవత్సలుడు
పరమేశు డొసగె బాలుని తమకని.
బంధువులందరు ముదమున బల్కిరి
పురాణపురుషుడు పుట్టె మన ఇంట
పూర్వజన్మ కృతపుణ్యఫలంబిది

జాతకచక్రము సరిచూచిన యా
దైవజ్ఞులనిరి అపురూపంబిది
దైవమె రూపము దాల్చె మీ ఇంట
గురువుల కెల్లను గురువగు నీతడు
వేదముతో సమ మీతని వాక్యము
అనపాయినులై అష్ట సిద్ధులును
నవనిధు లీతని సపర్య చేయును
ప్రసిద్ధి కాంచును భక్తవరదుడని
భార్యను సుతులను మదిలో కోరడు
యతీశ్వరుండై అవని చరించును
మహాత్ము డీతడు మహేశు డీతడు
నారాయుడని నమస్కరించిరి

అంబ మాధవులు ఆ దైవజ్ఞుల
సత్కరించి రతి సంతోషముతో
భోజనము పెట్టి భూషణములొసగి
వస్త్రము లిచ్చిరి దక్షిణ లిచ్చిరి
నమస్కరించిరి నమ్రత మీరగ

బాలుని పెంచిరి గారాబముతో
దృష్టి దోషములు స్పృశింపకుండగ
మెడలో మొలలో కట్టిరి రక్షలు

ప్రణవోచ్చారణ ప్రస్ఫుటంబుగా
బాలుడు చేయును ప్రతి దినమందును
అపూర్వమిది యని ఆశ్చర్యముతో
బంధువులందరు మదిలో తలచిరి
పరశివు డీతడు పరబ్రహ్మమని
బాలునికి నామకరణము చేసిరి
నరహరి అనుచును. నరుడై పుట్టియు
హరి లక్షణములు గల్గియుంటచే.
చిరునగవులతో చిన్మయమూర్తిగ
పరమానందము గూర్చుచు నుండెను
తల్లి తండ్రులకు దాయాదులకును

నరహరి బాల్య లీలలు

తనదౌ స్తన్యము సరిపోలేదని
పతితో చెప్పెను సతి యొకదినమున
దాదిని గూర్చుడు తడయక అన విని
బాలుడు తాకెను తల్లి స్తనములు
ముద్దు గొలుపు తన హస్తము తోడను
పాలు స్రవించెను ధార ధారలుగ
ధరపై కారెను తడిసెను రవికయు

అబ్బుర మందిరి ఆ తలి తండ్రులు
గుట్టుగ నుంచిరి. దిష్టి బాలునకు
తగులు ననివారు తలచిరి మదిలో
రక్షను కట్టిరి ఆ క్షణముననే

అడుగులు వైచుచు నిటునటు దిరుగుచు
వేరొక మాటను పలుకడు బాలుడు
ఉచ్చరించు తానోంకారముునే
మూగవానివలె నగుపడుచుండెను
బధిరిడు వీడని మదిలో తలచిరి
వింతగ నున్నవి ఈతని చర్యలు

ఏమి జరుగునో వేచి చూడవలె
అని తలిదండ్రులు మిన్నక యుండిరి

ఏడేండ్లు నిండి ఎనిమిది వచ్చెను
ఉపనయనమునకు ఉత్తమ సమయము
మాటలు రావే మన బాలున కని
తలిదండ్రులు తా కలతను జెందిరి

నరహరి తాకిన లోహము బంగారమగుట

ఆరాధించితి మా పరమేశుని
ప్రదోషవ్రతము పరమ భక్తితో
నిశ్చల మతితో నాచరించితిమి
ప్రాప్తించిన దిది ఫలముగ పూజకు
మన గతి యెట్టిదొ యని మదిగుందిరి
అది గని బాలుడు శాంతి వహింపుడు
భద్రము మీకగు భయము మానుడని
చేతులు నూపుచు చేసెను సౌంజ్ఞను
బాలుడు తాకెను చిరుహాసముతో
ఇనుపముక్కనొక దానిని అపుడే (అది)
మిల మిల మెరసెను మారెను పసిడిగ

కలయా ఇది యని
వేరొక ముక్కను బాలున కిచ్చిరి
తాకినంతనే బంగార మాయె
అవధులు దాటిన ఆనందముతో
ఈ లీలను వా రేరికి తెలుపక
దినకృత్యంబులు తీర్చుచునుండిరి

నరహరి ఉపనయనము

జ్యోతిష్కు లిడిరి సుముహూర్తంబును
నరహరి ఉపనయనమునకు సరియగు
గ్రహకూటంబది గణనీయ మనుచు

బంధువుల నెల్ల వటుని దీవింప
ఆప్యాయతతో నాహ్వానించిరి
వేదవేత్తలను విద్యావంతుల
పండిత వర్యుల పౌరాణికులను
సజ్జనుల నెల్ల సత్కరింపగా
మది తలపోసిరి మాతయు పితయును

ఇరుగు పొరుగ వా రిటు తలపోసిరి
పిచ్చి మాధవుడు ముచ్చట పడుచును
మూగ బాలునికి ఉపనయనంబును
తలపెట్టినాడు పరిహాసనంబిది
గాయత్రి నెట్లు గానము చేయును
వ్యర్థప్రయత్నమిది నిష్ఫలితము
ఎవరికి తోచిన రీతిని వారను
మాటలు వినినను మారాడకుండ
తడబాటు పడక నుండె మాధవుడు

ఉపనయనమునకు ఉత్సాహముతో
సంబారంబులు సమకూర్చినారు
యాచకు లెందరొ ఆనందించిరి
విందు భోజనము విశేషదక్షిణ
లభించు తమకని లాభంబిదియని

అభ్యంగ స్నాన పుణ్యాహవా
చన చౌలంబులు చక్కగ నెరపిరి
వేదవిహితముగ శాస్త్రోక్తముగను
జరిపిరి నాందీ సమారాధనము
ధరించె దీక్షా వస్త్రము నాతడు
ఆపై మేఖల, అజనధారణము (జరిపిరి)
సుముహూర్తంబున సుతునికి చెవిలో
ఉపదేశించెను ముసుగు వైచికొని

గాయత్రిని పరమానందముతో.
తనువు పులకించె తన్మయుడయ్యెను
తేజోమూర్తిని ఎదుటను చూచుచు

తల్లి వచ్చె తన తనయుని వద్దకు
భిక్ష యడుగుమని హెచ్చరించగా
ఋగ్వేదమంత్ర మగ్ని మీడేను
చక్కగ చదివెను సస్వరంబుగా
తల్లీ భిక్షను తడయక పెట్టుము
అని బాలు డడిగె। ఆ మాటలు విని
అచటి సదస్యులు అబ్బుర మందిరి
ఇషేత్వా యజుర్వేద మంత్రమును
అగ్ని ఆయాహి అను సామంబును
చదువుచు భిక్షకు చాచెను చేతులు

అపూర్వమిది యనిరచటి పండితులు
బాలుని చూచిరి భాస్కర తేజుని

జగన్నాథుడే జన్మించినాడు
ధర్మస్థాపన ధరలో నెరపగ
ధన్యుల మైతిమి ధన్యుల మైతిమి
తిలకించితిమీ దివ్యసంఘటన

నరహరి తల్లిని భిక్షమడుగుట

నరహరి మెల్లగ తల్లితో ననెను
"అడుగుము భిక్షను" అన్నావమ్మా!
అడిగెద నిపుడే అడ్డు చెప్పకుము
నీవన్నమాట నిలబెట్టుకొనుము
బ్రహ్మచారినై భైక్ష్యము చేయుచు
లోకానుగ్రహ మొనర్చుటకునై
తీర్థయాత్రలకు పోదలచినాను
అనుజ్ఞ ఇమ్మిక ఆలసింపకుము

తనయుని మాటలు వినిన క్షణమున
నిర్ఘాంతపోయి నెమ్మదిగ బల్కె
నీ ఎడబాటును ఎటు భరియింతుము
మాటలాడకనె గడచెను బాల్యము
మూగవాని వలె మాకగు పడితివి
ఇపుడే కద నీ మాటలు వింటిమి
సంతసించితిమి శాంతిని గంటిమి
నీవరిగినచో ఎవరు మా దిక్కు?

నరహరి చూచెను తల్లిని జాలిగ
కౌగలించుకొనె కరుణామయుడై
తల్లినోదార్చె తత్వబోధతో

నరహరి తల్లికి తత్వము తెలుపుట

విను నా మాటను వివేకంబుతో
ధర్మరక్షణకు ఇల జన్మించితి
నల్గురు పుత్రులు కల్గుదురు నీకు
మిము సేవింతురు మిము పూజింతురు
పూర్వజన్మమున పరమభక్తితో
శివుని గొల్చితివి। అవతరించితిని
నీ సుతునిగనే। నీ పుణ్యఫలము
ఆ యమ శిరమున హత్తెను హస్తము

పూర్వజన్మమున వరము నొసంగిన
శ్రీపాదుల గనె చిత్తము పరవశ
మందెను ఆతని పాదము పట్టెను
ఆనందాశ్రుల వానిని తడిపెను

తల్లి నోదార్చి తనయుడు పలికెను
ఈ దర్శనమును ఏరికి తెలుపకు
అనుజ్ఞ నీయుము నే నరిగెదనిక

నరహరిని తల్లి వివాహమాడుమనుట

అన విని అంబిక తనయునితో నసె
ఇంటలేడాయె ఇంకొక తనయుడు
బాల్యంబుననే బ్రహ్మచారిగా
బంధము తెంచుకు యతి ధర్మంబును
అవలంభించుట అనుచిత మందురు
మూడాశ్రమములు ముఖ్యమైనవే
ఆపై సన్యాశాశ్రము । తెలిసిన
వాడవు తడయక పాటించు మనెను

తల్లి మాటలను తా విని నవ్వెను
తత్వ రహస్యము తల్లికి తెలిపెను

మరుక్షణంబున మమకార మెల్ల
నశించిపోయె జ్ఞానోదయమై
నిశ్చలమతితో నిలబడె అంబిక

నరహరి తల్లికి చెప్పిన తత్వ రహస్యము

"అమ్మా! దేహము అనిత్యమైనది
ఆత్మోన్నతికై ఆచరించవలె
ధర్మాచరణము నిరంతరంబును
మరణము తప్పదు మహనీయులకును
శరీరదార్ఢ్యము కలిగిన వేళనె
ధర్మాచరణము నెరపుచుండవలె
కాలుని జయింప తరమా ఏరికి
రావియాకు చివర మిలమిల మెరయు
నీటికణంబులు నేలపై ఎపుడు
చిందునొ ఏరును చెప్పలేరు కద
శరీర పతనము తెలుపుట కష్టము
ఆకుచివర కల అంబుకణమువలె
కర్మము పండిన కడతేరు జనుడు
తరుమాడు నతని తడయక మృత్యువు

జరిగిన రోజులు తిరిగి రావు కదా!
ధర్మాచరణము నిరసించువారు
పశు సమానులని పలికింప వలెను
పుణ్యము చేయని దినమది వ్యర్థము
దారా సుతులను ధనధాన్యంబుల
హెచ్చుగ మదిలో మెచ్చెడి వానిని
సంసార సుఖమె సర్వమను వాని
ముసలి తనంబను మొసలి పట్టుకొని
సంసరణంబను సుడిగుండములో
యమ యాతన నిడు ఆమరణాంతము

వివేకవంతుడు విమలబుద్ధితో
చరింపవలె ధర్మపథంబున.
తెలిసియు నీవిటు పలుకుట తగునా

సంసారంబిది సార విహీనము
మాలతి కుసుమము వలె క్షణములో
వడలు శరీరము । వాసన లుడుగవు

తల్లికి మెల్లగ తత్వము తెలిపెను
అబ్బుర మందిరి అచటి పండితులు

తల్లి తనకు సంతానము కలుగువరకు నరహరిని ఇంటిలో నుండుమనుట

బాలుని జూచుచు కరములు మోడ్చెను
మంగళమూర్తివి మా కుల దైవము
నీవే యని మది విశ్వసించితిని
నల్గురు పుత్రులు కల్గుదు రంటివి
పుత్రుడొకడైన పుట్టు వరకైన
మా కడ నుండుము మా అభిమతమిది
అమ్మను విడువకు అప్పటి వరకును
తల్లితో ననెను నరహరి అమ్మా
నీ మాట నీవు నిలుపుకోవలెను
ఇరువురు పుత్రులు కలిగిన తదుపరి
ఏగెద యాత్రకు ఈ చోటు వీడి.

ఇంటివద్దనే ఉండెను నరహరి
తల్లిదండ్రులకు కూర్చుచు ముదమును
బాలుండయ్యును పాఠము చెప్పును
పెద్దలందరకు విధి విధానములు.
అనుపమము బోధ అబ్బురము గొల్పు

ఆనందముతో అంబిక యుండెను
గర్భము దాల్చెను. నెలలు నిండగా
పుట్టిరి కవలలు, పుష్టిగ నుండిరి
వచ్చెను మూడవ మాసము వారికి
నరహరి నవ్వుచు తల్లితో ననెను

అమ్మా తమ్ములు ఆయుష్మంతులు
పుత్రులిద్దరును పుత్రిక యొకతెయు
నీ కడుపున జన్మింతురు భావిని
సుఖముగ నుందువు శుభములు కల్గును
నే నేగెద నిక అనుజ్ఞ నొసగుము

తలితండ్రు లనిరి తనయుని చూచుచు
మాయయు మమతయు మము బంధించెను
నీ నిజరూపము నెరుగలేకనే
కుమారుండవని, కోపగించితిమి
నిను పెంచుటలో ఎన్ని లోపములో
చేసితిమయ్యా! క్షమించవలె మము
ప్రదోషపూజా ఫలముగ పుత్రుడ
వైతివి వంశము పావనమయ్యెను
పూర్ణపురుషుడవు పరమాత్ముండవు
తరింపజేయుము దయతో చూడుము
నీవు లేకున్న ఎట్లు బ్రతుకుట
అని విలపించెడి తన తలితండ్రుల
జూచుచు నరహరి శోకింపవలదు

స్మరించినంతనె దర్శనమిత్తును
భయపడవలదిక భద్రము మీకగు
సిరిసంపదలకు నిలయము గృహమిక
దైన్యము మిమ్ముల దరిచేర దికను
తుదకు చేరెదరు కైలాసంబును
ముప్పది వత్సరముల తరువాతను
తిరిగి వచ్చెదను దర్శన మిచ్చెద

నరహరి గృహమును వీడుట

అని తలితండ్రుల అనుమతి గైకొని
విడిచె గృహంబును వీడె నగరమును
అరిగిరి పౌరులు ఆతని వెంబడి
ఈశ్వరు డీతడు సంశయము లేదు.
వేదము బాలుడు పఠించగలడా?
తత్వరహస్యము బోధించగలడ
పిన్నవయస్కుడు పెద్దలందరకు?

పురమును దాటిన నరహరికి వారు
నతశీర్షముతో నమస్కరించిరి
వెనుకకు మరలిరి విధిబలీయమని

తల్లియు తండ్రియు తనతో వచ్చుట
నరహరి చూచెను । వారి మోహమును
వారించుటకై దర్శన మిచ్చెను
దత్తునిగ శ్రీపాదస్వామిగ
తన్మయత నంది తలితండ్రులనిరి
త్రిమూర్తిరూపా మము దయజూడుము
విశ్వగురుండవు విశ్వరూపుడవు
మోహము తీరెను మోదము గలిగెను
వెనుకకు తిరిగిరి ఆనందముతో

కాశిలో నరహరి

నరహరి కాశిని చేరెను, నిత్యము
త్రిషవణ స్నాన మాచరించుచూ
అష్టాంగ యోగ మభ్యసించెనట

వారణాశిలో వశించు తపసులు
యోగులు యతులు అక్కజమందిరి
నరహరి నిష్టకు వైరాగ్యమునకు.
ఇంత వైరాగ్యమీ ప్రాయంబున
అబ్బుట అరుదే! అబ్బిన దితనికి
అవతారమూర్తియై యుండనోపు
స్వార్థము మదిలో లేదించుకయును
మూడు సంధ్యలను ముచ్చటగాతా
మణికర్ణికలో మజ్జన మాడును
సన్యాసమునకు సరియగు అర్హత
గలదితనికనుచు తలంచుచుండిరి

ఆ కాలంబున వారణాశిలో
వశించుచుండెను వయోవృద్ధుడగు
యతి కృష్ణసరస్వతి తపోధనుడు
జ్ఞానఘనుండని వినుతిని గాంచెను
ధర్మమూర్తియని పురజనులందరు
కృష్ణసరస్వతి శిష్యులతో ననె
పరమేశ్వరుడే నరహరిగా నిల
జన్మించినాడు సంశయములేదు

చతుర్థాశ్రమము చక్కగ నెరపుచు
పరోపకారము కర్తవ్య మనుచు
మహిని చరించెడి మహాత్ములందరు
వందనీయులని మది నెంచవలెను

నరహరి సన్యాసము స్వీకరించుట

నరహరి వద్దకు సరస్వతి జనెను
మీరు ప్రభువులు పరమ పవిత్రులు

స్వీకరింపవలె లోక హితమునకు
సన్యాసంబును సాంప్రదాయ విధి
మాచే పూజలు మన్నన పొందుడు
కలియుగమిది । పనికిరాదు సన్యా
సమను వాదము సరికాదనియెను
శంకర్షుల వారు సహేతుకంబుగ
సర్వసమర్థులు సన్యసించవలె
లోకహితార్థము దీక్షనుబూనుట
అత్యవసరమని: యతివరుడు కోరె

వారి మాటలను నరహరి విని తా
శాస్త్ర విహితముగ సన్యాసంబును
స్వీకరించెనట లోకహితార్థము
ధర్మస్థాపన ధర నెరపుటకై

నరహరి నామము నరసింహసర
స్వతిగా మారెను । సంతోషించిరి
పురజనులందరు పూజలు సలిపిరి
వారణాశిలో నరసింహసర
స్వతి సద్గురువుగ సన్నుతి గాంచెను
పండితు లెందరో పరమభక్తితో
పుణ్యపురుషుడని పూజించి రతని
శిష్యులెందరో చేరిరి దగ్గర

నరసింహసరస్వతి తీర్థాటనము

శిష్యసహితముగ చేరెను బదరిక
గంగా సాగర సంగమ మాపై
తీర్థరాజమగు త్రివేణి చేరెను

మాధవుడు దీక్షను గ్రహించుట

అచట మాధవుడను బ్రాహ్మణుడు
సామిని వేడెను సన్యాసాశ్రమ
దీక్షను ప్రసాదించవలె ననుచు

సాష్టాంగ నమస్కారము చేసెను
దయామయుడు నరసింహాసరస్వతి
మహావాక్యములు మననము చేయుట
బోధించె నప్పుడె మాధవునిలోని
తాపత్రయములు [illegible]
వాసన లన్నియు నశించిపోయెను
ఆనందాంభుది యాతడు మునిగెను

మాధవునిపైన మక్కువ సామికి
అర్హత గలిగిన వారందరకును
సన్యాస దీక్ష సామి యొసంగెను

ప్రసిద్ధి గాంచిన శిష్యులేడ్గురే!

1 బాలసరస్వతి 2 కృష్ణసరస్వతి 3 ఉపేంద్రసరస్వతి
4 మాధవసరస్వతి 5 సదానంద సరస్వతి
6 జ్ఞానజ్యోతి సరస్వతి 7 సిద్ధ సరస్వతి

ఉత్తర యాత్రలు పూర్తి చేసికొని
దక్షిణ యాత్రలు తా సాగించెను
యతివరుడు శిష్యులనుసరింపగా
మార్గమధ్యమున కరంజ నగరము
చేరిరి - పౌరులు గుర్తించినారు
స్వామి జన్మస్థల మిదియే కద

నరసింహా సరస్వతి - కరంజ నగరములో

తల్లియు తండ్రియు పౌరులందరును
సగౌరవంబుగ సలిపిరి పూజలు
సద్గురుమూర్తులు సర్వసమర్థులు
భక్తులు కోరిన కాదనరెప్పుడు
పలువురు భక్తులు పరివారముతో
భిక్షకు రావలె మా గృహమునకని
సామిని కోరిరి సాష్టాంగపడుచు

సరి వచ్చెదననె సామివారితో
అందరి గృహముల కదే రూపమున
ఒకే సమయమున భిక్షను చేసిరి
అబ్బుర పరచిరి అచట గృహస్థుల

మహావిష్ణువే మహి జన్మించెను
మానవుడే యని మదిలో తలచిన
భగవదపరాధమగునని పలికిరి
పండితులందరు పౌరజనులతో

దత్తాత్రేయుడె ధర్మము నెరపగ
ఇల జన్మించెను ఇదియె రహస్యము
అని తలితండ్రులు అర్చన చేసిరి
పదములు కడిగిరి పరమ భక్తితో
ముందటి జన్మపు స్మృతి గలుగుటకై
దర్శన మిచ్చెను తా శ్రీపాద
శ్రీ వల్లభునిగ । శిరములు వంచిరి
నమస్కరించిరి । మము దాటింపుము
సంసరణాంబుధి యెసగుము ముక్తిని"

నరసింహ సరస్వతి - తలితండ్రులకు అభయ మొసంగుట

"ఏ కులమందున ఒక్కడైననూ
సన్యసించినచో, సద్గతి కల్గును
నలుబదియు రెండు తరముల వరకును
నరకభయంబది వారి కుండదిక
నరకమున నున్న వారును ముక్తులె
మీకేభయమును లేదిక నిజమిది
బ్రహ్మలోకమును, బడయుదురు మీరు
సిరిసంపదలతో తులతూగుచుంద్రు
పుత్రులు పౌత్రులు శతాయుష్కులై
వర్ధిలుచుందురు మీరలు కాశీ
కేగుడు అచటనె కాయము విడువుడు

ముక్తిని చేకొను మార్గంబిదియే
అని బోధించెను అపార కరుణను

పూర్వాశ్రమమున చెల్లెలు రత్నా
యతివరుని చేరి నతశీర్షముతో
నమస్కరించెను. నెమ్మదిగ బల్కె
తాపత్రయములు దహింపుచున్నవి
తప మాచరించి తరింప దలచితి
ఉపదేశింపుడు ఉత్తమ మార్గము
తరింప జేసెడి తారక మంత్రము.

సాదరంబుగా సామి యనె నిట్లు
పతిని ప్రేమగ మది పరికించిన
స్త్రీలకు చేకురు సర్వసుఖంబులు
సులభము సుకరము సూక్ష్మమార్గమిది
అన విని ఆయమ అడిగెను యతివరు
సర్వజ్ఞులుగద సామీ తెలుపుడు
భాగ్య మెట్టిదో బావికాలమున

రత్న పూర్వజన్మ కథ

నీ ప్రారబ్ధము నే పరికించితి
మంచిది కాదది యెంచి చూడగా
ఆవును తన్నిన పాపము భార్యా
భర్తల మనసులు కలుషము చేసిన
పాపము విడువక వెంబడి యున్నవి

ఆవును తన్నిన పాప ఫలితముగ
కుష్ఠ వ్యాధి నిను కాలియపెట్టును
దంపతులను నెడ బాపుట వలననె
నీ భర్త నిన్ను విడనాడి చనును
నిన్నొల్ల డతడు సన్యాసి యగును

సరస్వతి రత్నకు ఇచ్చిన సలహా

భావి తెలియగా భయమున కుంగెను
యతివరు పదములపై పడి ఏడ్చెను
సామి జాలితో ఆమెతో ననెను

[illegible] తరి భర్త విడిపోవు
అప్పుడే కుష్టువు ఆరంభమగును
భీమానది తీరమ్మున గాణ్గా
పురక్షేత్రమున దర్శింపుము నను
తీరము పొడవున దివ్య తీర్థములు
ఎన్నో యున్నవి వాటిలోనిదే
పాపనాశ మను పవిత్ర తీర్థము
స్నానము చేసిన సర్వపాపములు
నశించిపోవును అచ్చట నుండుము

రత్న నోదార్చి యతివరుడేగెను
శిష్యగణముతో నాశికాత్రియం
[illegible]మునకు. పరమ పావన మయ్యిది
[illegible] గోదావరి నది
[illegible]
ఘోర [illegible]
తీరము నందలి తీర్థ క్షేత్రముల
దర్శించుచు మంజరీక మను నొక
గ్రామము చేరెను! గలడా పల్లెను

నరసింహోపాసకుడు-మాధవుడు

మాధవుడను ముని! ఆతడు నిత్యము
నరసింహదేవు నారాధించును
ఆదిన మతనికి అగుపడె మదిలో
నరసింహ యతి తన ఇష్టదేవత
స్థానము నందున తా జనె తడయక

యతివరు వద్దకు అమలినభక్తిని
సాష్టాంగ నమస్కారము చేసెను
జన్మ తరించెను శరణము మీరే
ఆనందముతో అశ్రులు రాల్చెను

స్వామి అతనితో

నీ యీ జన్మము సార్థకమైనది
దర్శించినావు ధన్యుడ వైతివి
సంసార బాధ సడలిపోయినది
తన నిజరూపము అతనికి జూపెను
మాధవు డదిగని మరచెను సర్వము
కొద్ది క్షణములు కదలక యుండెను

ఆదిగురుమూర్తి అవతరించె నిల
ధర్మస్థాపన ధర నెరపుటకై
దత్తాత్రేయుల దర్శన మాయెను
జన్మ తరించెను జయ జయ దత్తా
ఆత్మజ్ఞానము అలవడజేయుము
శరణము ఇక మీ చరణకమలములె

మాధవారణ్య! మంత్రసిద్ధి నీ
కాయెను కలుగును, ఆత్మజ్ఞానము
నరసింహదేవు నారాధించిన
ఫలితమె నా యీ దర్శనము నీకు
ఆశీశుల నిడి అరిగె సరస్వతి
శిష్యగణముతో చేరెను వాసర.
(బ్రహ్మేశ్వరి యను పావనక్షేత్రము)
తానును శిష్యులు తానమాడుటకు
నది కేగిరచట నగుపడె విప్రుడు

ఉదరశూలతో బాధపడు విప్రుని సరస్వతి అనుగ్రహించుట

ఇసుక నేలపై నిటునటు దొర్లుచు

రోదించుచుండె రోగమేమిటో
"నదిలో పడి నే నసువుల బాసెద
బాధను నేనిక భరింప జాలను
పాపాత్ముడ నే బ్రతుకుట వ్యర్థము
ఒక మెతుకైనను ఉదరము చేరిన
ఉదర శూల నను బాధించును గద
పూర్వజన్మలో నేరికి అన్నము
పెట్టక పోతినో! విప్రుని ముందరి
అన్నము బలమున అపహరించితినో?

తరిమి వైచితినో మెల్లగ మేసెడి
కపిల గోవు నొక కట్టె విదల్చుచు
ఈశ్వరుని పూజ ఇచ్ఛగింపనో
సద్గురు వరులను నిందించితినో
అతిథుల నభ్యాగతులను దుడుకుగ
నిందించితినో! తరిమి వైచితినో
భార్య మాట విని తల్లితండ్రులను
చెట్లను దగ్ధము చేసితి నేమో
ఏ పాపఫలంబో ఈ కష్టమిపుడు
ప్రాణము పోయిన బాధయు తొలగును"
అని తనలో తానను కొనుచుండెను
నీట దూకుటకు వెడలుచుండగా

ఆ విప్రుని గని ఆ యతివర్యులు
శిష్యులతోననె! ఎవడో నదిలో
చచ్చుట మేలని చనుచున్నాడటు
వారించి ఇటకు వానిని తేవలె
గురుని వద్ద కా విప్రుని తెచ్చిరి
ఏమి కష్టమని ఈ నీ ఏడుపు
ఆత్మహత్యకై ఈ తలపెందుకు

విప్రుడు

పక్షమునకైన మాసమునకైన
పొరపడితినినచో శూలబాధతో
గిలగిల లాడెద । మరణ బాధయది
ఈ బ్రతుకెందుకు ఈ బాధ ఏల
చనిపోయినచో సమయును బాధలు
అన్నమయము గద తనువు లన్నియును
మిత్రుడదేమో శత్రువుగ మారె
బ్రతుకుటలో గల భాగ్యమిదేనా?

కరుణామయుడై గురుమూర్తి యనెను
భయమును వీడుము భద్రము నీకగు
నీ వ్యధలన్నియు నేటితో తొలగును
తగిన ఔషధము తడయక నొసగెద
నిర్భయంబుగా మెలగుము నికపై
మృష్టాన్నంబులు తృప్తిగ తినెదవు

అదే సమయమున కటకేతెంచెను
గ్రామాధికారి నిమజ్జనమునకు

గ్రామాధికారి-సాయందేవుడు

సామిని జూచెను సాష్టాంగపడెను
ఆపస్తంభీయుడ విప్రుడ కౌండి
న్యస గోత్రుండను నామము సాయం
దేవుడు కటకంచి నా నివాసము
ఉదరపోషణకు ఉద్యోగినైతి
యవనరాజు కడ నా యుద్యోగము
వత్సరకాలము గతించె నెటులో
సద్గురువుల దర్శన మిట లభించె
ధన్యుడ నైతిని జన్మ తరించెను
దోషము లన్నియు నశించి పోయెను
భవసాగరంబు పారము చేరగ
అనుగ్రహింపుడు అపార కరుణను

అప్రయత్నముగ నరసితి యతీశు
పాపము గంగయు తాపము చంద్రుడు
దైన్యమును కల్పతరువు హరించును
మీ దర్శనమో మా దైన్యంబును
పాపతాపముల బాపును సామీ

సాయందేవుడు సాష్టాంగపడెను
సామి పాదముల కమితభక్తితో

సద్గురు మూర్తులు సాయందేవుని
దయతో చూచిరి దగ్గరకు పిల్చి
ఈ విప్రుని మీ యింటికి చేర్చుము
మృష్టాన్నంబును కడుపార నిడుము

సాయందేవుడు సంశయ మందుచు
నిన్నటి దినమున నెల కొకసారిగ
భుజించె నీతడు భయము తోడనే
భరింపజాలక బాధను నదిలో
పడి చచ్చుటకై వడివడి వచ్చెను
ఇతనికి అన్నము నే పెట్టినచో
బ్రాహ్మణ హత్యా పాపము చుట్టును
చేయవలసినది శలవీయుండన

ఈరోజున కిది ఇతని కౌషధము
మృష్టాన్నమిడుము సంశయము వలదు
గారెలు బూరెలు పరమాన్నముతో.
సాయందేవుడు సరియని సామీ

సాయందేవుడు నరసింహ సరస్వతిని భిక్షకు పిలుచుట

మీరును, శిష్యులు భిక్షకు రావలె
అంజలి పట్టెను ఆహ్వానించెను
అంగీకారము సామి తెలుపగా

అవధులు దాటిన ఆనందముతో
గృహమునకేగెను గృహిణికి చెప్పెను
ఆతని భార్యయు సంతోషముతో
పాకము చేసెను భక్ష్యభోజ్యములు
చోష్యలేహ్యములు రుచ్యములైనవి

సామి

భిక్షకు వచ్చెను శిష్యగణముతో
విప్రుడు వచ్చెను వారి తోడనే
రంగవల్లులను రాణగ దిద్దిరి
అలంకరించిరి ఆ స్థల మంతయు
పద్మము రచించి మధ్యగ వైచిరి
చిత్రాసనమును, అద్దాన యతిని
కూర్చుండబెట్టి పూజలు చేసెను
సాయందేవుడు సతీసహితముగ
పరమభక్తితో పదునారుపచా
రంబుల, పంచామృతముల పదములు
కడిగి రుద్రసూక్తంబుల నభిషే
కించిరి తీర్థము వేరొక పాత్రను
భద్రముగ నుంచి పలు విధంబులగు
నీరాజనములు గురుమూర్తి కొసగి
నమస్కరించిరి నతశీర్షముతో
శిష్యులందరిని పూజించినారు

స్వామితో ననిరి నమ్రత మీరగ
దంపతు లిద్దరు, దయ సేయవలెను
భిక్షకు మీరును శిష్యులందరును

విప్రుని ఉదరశూల హరించుట

విస్తరి వైచిరి విప్రున కప్పుడు
స్వామి ప్రక్కనే, సంతోషముతో
భుజించె విప్రుడు భక్ష్యభోజ్యములు
శూలవ్యాధిని పూర్తిగ మరచెను

కడుపారగతిని కడు సంబరపడె
ఆనాటి నుండి అన్నద్వేషము
అంతరించగా హాయిగ నిత్యము
భుజించుచుండెను. అచ్చరువందిరి
ఆ గ్రామస్థులు అద్భుత మిదియని
సద్గురుమూర్తిని శరణము జొచ్చిరి
గురుమూర్తి దృష్టిమాత్రము చేతనె
నిరోగి అయ్యెను విప్రుడు తృటిలో

అరుణ కాంతులవి ఆకసమందున
తోచిన తోడనె తొలగును చీకటి
పసిడిగ మారును పరసువేదితో
తాకిన లోహము తద్వత్తుగనే
గురువీక్షణంబు ఏరిపై బడునో
వారి దోషములు హరించు నపుడే.
శాంతి సుఖంబులు సరగున చేకురు

నరసింహ సరస్వతి సాయందేవుని అనుగ్రహించుట

సాయందేవుని సాధు శీలమును
సజ్జనత్వమును సామి తిలకించి
సంతోషించెను పొందెను తృప్తిని
దీవించె నతని అపార కరుణను
మీ వంశీయులు నా భక్తులగుచు
ఐశ్వర్యంబుల ననుభవింతురన
పులకాంకితుడై పొగడెను సామిని
సాయందేవుడు సర్వము మీరని

సాయందేవుడు స్వామితో

త్రిమూర్తిరూపులు అమృత సమానులు
సామీ జయ జయ మీ మహిమ లెన్న
తరమే ఏరికి పరమేశ్వరుడే
జనించె నిలలో శాంతిని ధర్మము
స్థాపించుటకై సంశయము లేదు

శరణము జొచ్చిన సర్వదుఃఖములు
హరించి పోవును ఆ క్షణముననే
నను రక్షింపుడు నా పరిస్థితిని
విన్నవించెదను భీతిని బాపుడు
ఒక యవనుని కడ యూడిగము నాది
పరమ కిరాతుడు, విప్రులపై పగ
వత్సరాంతమున ఏదో నెపమున
బ్రాహ్మణునొక్కని బలిచేయుచుండు
నా వంతు నేడు. రావలెనని
కబురంపినాడు కలగెను చిత్తము
గురుచరణములే శరణము నాకిక

కరుణామయుడై గురుమూర్తియపుడు
సాయందేవుని శిరమున నుంచెను
అభయ హస్తమును ఆత్రుత వడకము
భయపడ వలదిక భద్రము చేకురు
నీకే యపకృతి చేయంజాలడు
సన్మానించుచు నమస్కరించును
ఇట నేనుందును నీ వచ్చు దనుక
భక్తరక్షణము నా కర్తవ్యము
అభీష్ట సిద్ధిని అందుకొనెద వనె
సంతోషముతో సాయందేవుడు
యవనుని గృహమున కరిగెను మదిలో
నరసింహ యతి స్మరణము చేయుచు

దుష్టుడు యవనుడు భీతిలి సాయందేవుని సన్మానించుట

యవనుడు చూచెను సాయందేవుడు
తన వైపునకేనని వచ్చుచుండె
అచ్చోటు వీడి యవనుడు లోనికి
పరుగిడి భయమున। బలహీనుండై
నేలపై కొరిగె మరుక్షణంబున
స్మృతి గోల్పోయెను కత్తులతో నను

పొడుచుచున్నారు కడు దారుణముగ
విల విల నేడ్చెను వేదన పొందెను
తెలివి యొకించుక కలిగినంతనే
పరుగిడి వచ్చెను పాదము పట్టెను
సాయందేవుని సత్కరించి యనె
మిమ్ముల నిచటకు రమ్మనలేదే
వస్త్రము లిచ్చెను భూషణము లొసగె
సాగనంపె నా సాయందేవుని
ఉద్యోగులలో ఉత్తముడ వనుచు
నిప్పుని చెదలవి ఎప్పగిది చేరు?
గరుడుని సర్పము కరచుట సాధ్యమె?
గురుకటాక్ష మది కలిగినవారికి
కాలమృత్యువే। దరి చేరలేదు

సాయందేవుడు తనను శిష్యునిగ స్వీకరింపుమని కోరుట

గోదావరి తటి గురుమూర్తిని గని
జరిగిన దంతయు తెలిపెను సామీ
మీ దయ వలననె నే జీవించితి
నిరంతరము మీ చరణ కమలములు
స్మరించు చుందును మరువకుండగా
అనుగ్రహింపుడు ఆపద్బాంధవ

అని వేడగా

సద్గురు మూర్తులు సాయందేవుని
కాశీశులిడిరి ఆదరమొప్పగ.
దక్షిణ యాత్రకు తరలుచుండగా
సాయందేవుడు సాష్టాంగపడెను
మీతో వచ్చెద యాత్రకు నేనును
సేవలు చేయుచు నే జీవింతును
శిష్యునిగ నను స్వీకరించవలె
సాయందేవుడు సామి చరణముల
తన శిరముంచెను తన్మయు డగుచును

సామి ఇట్లనెను । సాయందేవా
సమయము కాదిది. సంపూర్ణముగా
దక్షిణ దేశపు తీర్థములన్నియు
పర్యటించి నే పదునేడేడుల
తరువాత నిటకు తిరిగి వచ్చెదను
ఈ గ్రామమునకు దగ్గరలోనే
నివాసముందును నీవును సతియును
సుతులును రావలె నా దర్శనమునకు
అరిష్టము లన్ని తొలగెను, నీవిక
సుఖముగ నుందువు శుభములు చేకురు

వైద్యనాధము

క్షేత్రపర్యటన చేయుచు
శిష్యులు సామియు, క్షేత్రరాజమని
వాసిని గాంచిన వైద్యనాధమును
చేరిరి. దివ్యస్థలమది అచ్చటి
జ్యోతిర్లింగము జగత్ప్రసిద్ధము

నరసింహ సరస్వతి కొద్దికాల మేకాంతముగా నచట నుండదలచుట

శిష్యులను బిల్చి చెప్పెను వారికి
కొద్దికాల మిట గుప్తముగ నుందు
మీరందరు యాత్రల కేగవలెను
శిష్యులు వంచిరి శిరములు భక్తిని
క్షేత్రములన్నియు తీర్థము లన్నియు
మీరే స్వామీ । వేరొక చోటికి
వెడలు టెందులకు నిటనే యుందుము
గురుచరణములే సర్వతీర్థములు
అని ఉద్ఘోషించును వేదములన్నియు
కల్పకము వదలి కంటకవృక్షము
నాశ్రయింతురా? నగుబాటు కదా?
కట్టెల కొరకై అడవిని వెతకుట
అపహాస్యమగును అరసి చూడగా

సన్యాస విధులు శిష్యులకు తెలుపుట

సన్యాస విధులు చక్కగ నెరపుడు
తీర్థాటనము చేయుట కర్జము
చిత్తము నిలకడ చెందిన మీదట
స్థిరముగ నొకచో స్వరూప ధ్యానము
చక్కగ జేయుచు అఖండానంద
ఆత్మజ్యోతిగ నలరుచుండవలె
స్వర్ణ జ్యోతిగ శోభిల్లవలెను
తీర్థాటనమును పుర్తి చేసికొని
బహుధాన్యంబున పావన మగునా
శ్రీశైలమునకు రావలెను మీరు

గురువుల వాక్యము అనుసరింపవలె
తిరస్కరించిన నరకమె గతి యని
తీర్థయాత్రలను చేయు విధానము
తెలుపుడు మాకని శిష్యులు వేడిరి

యాత్రావిధులను అవగతమగునటు
వారికి తెల్పిరి గురుమూర్తులపుడు

వాసిని గాంచిన వైద్యనాధమున
గురుమూర్తి యుండె ఏరికి తెలియక
సిద్ధుడనువాడు సేవలు చేయుచు
గురుమూర్తి వద్ద గుప్తముగ నుండె

ఆ క్షేత్రంబున ఆరాధింతురు
అంబను భక్తులు ఆరోగ్యమునకు
పురజనులందరు పూజలు చేతురు
(కామితదాయిని) కన్నతల్లి యని కామధేనువని

ఆ కాలంబున అచ్చట జరిగిన
చిత్రము చెప్పెద భక్తిని వినవలె
సిద్ధుడు నామధారకునితో చెప్పెను

గురువు పరమేశ్వరుడే

గురుమూర్తి కడకు విప్రుడు వచ్చెను
నమస్కరించెను నతశీర్షముతో
మోహాంబుధిలో మునిగియున్నాను
తరింప చేయుడు దయతో యతివర
ఎన్నో దినములు ఏకాగ్రతతో
చేసితి తపమును చిత్తము నిలువదు
ఉపదేశ మొసగి ఉత్తమ గతులను
ప్రసాదింపుడని పరి పరి వేడెను

స్వామి

ఎంతో తపస్సు చేసితి నంటివి
గురూపదేశము జరుగనెలేదా!
అన విని విప్రుడు తానిట్లనియెను
కడు దుఃఖముతో కన్నీరొలుకగ
నా కిదివరలో నొక గురువుండెను
హృదయము కఠినము నిర్దయు డాతడు
విద్యను చెప్పడు అతి కష్టములగు
పనులను చెప్పను నేనా పనులను
నిరాకరించితి వారికి నాపై
హెచ్చెను కోపము, వచ్చితి నిచటకు.

స్వామి

ఓరీ ముఢుడ గురుద్రోహమును
చేసిన వాడవు నీకెటు లబ్బును
ఆత్మజ్ఞానము - భక్తిని గురువును
సేవించినచో సర్వము చేకురు
అప్రయత్నముగ! గురుకృప యట్టిది
విప్రుడు వినెనిది వివేకమబ్బెను
పశ్చాత్తాపము పడి దీనుండై
మాటాడలేక మదిలో కుందెను

జయజయ గురువర జడుడనై నేను
గురు స్వరూపము గుర్తింప నైతి
గురు డెట్టివాడు గురు ధర్మమేది
వివరింపవలెను అపరాధిని నను
ఉద్ధరింప వలె సద్గురుమూర్తీ

స్వామి చెప్పెను-గురువుల క్రమము

తలితండ్రులు తొలి గురువులు
అధ్యాపకులును, ఆప్తులు గురువులె
ఆత్మజ్ఞానము అలవడ జేసెడి
సద్గురుమూర్తిని, సాక్షాత్ దత్తాత్రేయుడె
అని మది నెంచిన అమృతము చేకురు
సద్గురువరులను చక్కగ గొలిచిన
అలవడు తడయక ఆత్మానాత్మల
వివేకమ్మునూ వేదవిద్యయును
(ఉపమన్యునికధ ఉదాహరణముగా చెప్లవలెను)

భిల్ల వాటిక

ఆపై నరసింహ యతీంద్రు లరిగిరి
భిల్లవాటికకు । క్షేత్రరాజ మది
భువనేశ్వరి అట నివాసముండును
కృష్ణ ఒడ్డునే కలదా గ్రామము
మేడిచెట్టొకటి ఆవలి ఒడ్డున
ఆకసమంటుచు నలరారుచుండె
చెట్టు నీడలో గుట్టుగ నుండిరి
బీదల ఇండ్లను భిక్ష చేయుచును

కస్తూరి మూట కట్టినను దాని
వాసన దాగదు దిశలు వ్యాపించు
ఆ విధముగనే గురుమూర్తి మహిమ
వెల్లడి ఆయెను నలుదిక్కులకు

భిల్ల వాటిలో జరిగిన యొక కధ
వీనుల విందుగ వినవలె నందరు.
కరవీరమను నగరమున కలడొక
స్వకర్మ నిరతుడు సద్బ్రాహ్మనుండు
ఆతని కొకడే పుత్రుడు కలిగెను
ఆ బాలుడు కడు అమాయకుండును
మందబుద్ధియును। మదిలో కుందిరి
తల్లియు తండ్రియు తమ కర్మయనుచు
విధి నిర్ణయమని విలపింతు రెపుడు
కడు దుఃఖముతో తండ్రి మరణించె.
ప్రాయము వచ్చెను వాని కుపనయన
సంస్కారంబును జరిపిరి పెద్దలు
ఏమి పాపమో ఏమో గానీ
గాయత్రీ మంత్ర మా యర్భకుడు
పలుకజాలక పొరపడుచుండెను
ఐదక్షరముల నైన నొకసారి
అనజాలకుండె। అచటి పండితులు
ఆ బాలుని గని ఆక్షేపించిరి
ఓరీ మూఢుఢ। ఎరుగుదువా నీ
తండ్రి పేరుగల పండితవర్యుడు
మతిమాలిన యీ బ్రతుకుట ఎందుకు
విద్యలేదు కద. వింతపశువుగా
ఎంతకాలమిట నేడ్చుచుండెదవు
బండ కట్టుకొని నీటిలో మునిగి
అసువులు బాయుము అదే యుపాయము
అని యా బాలుని అపహసింపగా
వారితో ననెను బాలుడు మెల్లగ

మీరు చెప్పినది పరమ సత్యమే
విద్యాబుద్ధులు వివేక సంపద
కలుగు విధంబును సెలవీయు డనిన
రాదురా నీకు విద్య ఏదియును
విసిగింపకు మము ఏగు మెటకైన

బాలుడు భువనేశ్వరిని ఆరాధించుట

నే జీవించిన లేదుపయోగము
మరణము మేలని మది నిశ్చయించి
అడవి బాటలో నతడేగుచుండె
చేరెను బాలుడు భిల్లవాటికకు
భువనేశ్వరీ దేవాళయమున
నాశీనుండై అన్నపానములు
ముట్టక యుండెను మూడు దినంబులు
స్నానము లేకనె । సర్వము మరచెను
అటనే యుండెను అంబను తలచుచు

అమ్మా బాపుము అజ్ఞానంబును
వరదాయినివని కొలుతు రందరును
భక్తుల బాధలు బాపెడి తల్లివి
జయము నొసంగెడి జగదంబ వీవు
విద్యవు నీవే । విద్యావంతుని
చేయుము నీ పాదయుగమె శరణము
అని ప్రార్థించుచు నటనే యుండెను
(దేవి) కలలోనైనను కనబడదాయెను

బాలుడు

తల్లివి నీవని తలచి వచ్చితిని
కనికరము లేదు । కరుణించలేదు
ఉపేక్షించితివి ఉలుకవు పలుకవు
అనుచు
పదునైన కత్తి పట్టుకు నాలిక (తన)

ఛేదించి ముక్క ఈశ్వరి పదముల
వద్ద నుంచి దేవీ దయ చూపుము
రేపి పాటికి నాపై దయచూ
పనిచో నా శిరమును ఖండించెద
నీ పదసన్నిధి నేనుంచెదనని
శపధము చేసెను చలించకుండెను

కలలో భువనేశ్వరి సలహా ఇచ్చుట

ఆ నిశి కలలో అంబ కనబడెను
కృష్ణానది పశ్చిమ తీరంబున
మేడిచెట్టు కడకేగుము తడయక
అచ్చట వశించు యతివరుడొక్కడు
సేవింపుమతని చిత్తశుద్ధితో
తీరును కోరిక తృప్తియు కలుగును
అని పల్కి అంబ అదృశ్యమయ్యెను

బాలుడు కన్నులు తెరచెను ముదమున
కృష్ణను దాటెను కాంచెను చెట్టును
చెట్టు నీడలో చిద్ఘనమూర్తిని
సామిని జూచెను సాష్టాంగపడెను

నరసింహ సరస్వతి బాలుని అనుగ్రహించుట

కరుణామయుడై బాలుని శిరమున
హస్తము నుంచెను ఆ క్షణముననే
బాలుని నాలిక సరిగా నయ్యెను
శాస్త్రపురాణాది సకల విద్యలు
ప్రతిధ్వనించెను బాలుని మదిలో
పండితుడయ్యెను కడు ముదమందెను

పరమేశ్వరుడే నిల నవతరించె
శరణము జొచ్చిన సర్వశుభంబులు
విద్యాబుద్ధులు వివేక మలవడు
సద్గురువుల దయ భద్రకవచమది
కాకి హంస యగు కరుణించినచో

స్వగ్రామమునకు బాలుండేగెను

పండితులు

అబ్బురమందిరి అతని ప్రతిభకు
(బాలుడు) మన్నన లందుచు మిన్నగ యుండెను
ఐహిక సుఖములు ఆముష్మికములు
ఆత్మజ్ఞానము అలవడె నతనికి

అమరపురము

అనంతరము నరసింహసరస్వతి
అమరపురమను గ్రామము నందున
పండ్రెండేడులు వశించె గుట్టుగ
భగవతి, కుంభ, భద్ర, సరస్వతి,
శివ యను నదులట చేరును కృష్ణను
వారణాశివలె పావనమైనది
దక్షిణప్రయాగ క్షేత్రముగా
గణుతినిగాంచిన పుణ్యభూమి యది
అతి మనోహరములా పరిసరములు
సంగమము వద్ద చక్కని అమరే
శ్వర దేవాళయ మలరుచునున్నది

సమీపమున గల శక్తితీర్థమున
గలరు యోగినులు అరువది నల్గురు
అమరేశ్వరు నేకాగ్రతతో వా
రారాధింతురు అనుపమ భక్తిని
కృష్ణానది యట దక్షిణవాహిని
శుభముల గూర్చెడి శుక్ల తీర్థమును
పాపము హరించు పావనతీర్థము
కామవరదయను కామ్యక్షేత్రము
ఉన్నవి ఇచ్చట సన్నుతి గన్నవి
ప్రయాగ యందున నియమముతోడను
మాఘస్నానము నాచరింపగా

కలిగెడు పుణ్యము కలుగు నిచ్చటను
స్నానము చేసిన సజ్జనవరులకు
సిద్ధిని కూర్చెడి సిద్ధక్షేత్రము
అమరపురంబని అరుదెంతురటకు
తీర్థ స్నానము చేయుట కొరకై

నరసింహసరస్వతి బీద బ్రాహ్మణుని అనుగ్రహించుట

అరుగును భిక్షకు అమరపురమునకు
మధ్యాహ్న సమయ మందున నిత్యము.
ఆ గ్రామంబున నొక వేదవిదుడు
విప్రుండుండెను విరాగి యాతడు
యాచక వృత్తిని అవలంభించెను
ఉదర పోషణకు బీదయగుటచే
వారింట గలదు వారికి నచ్చిన
తుమ్మ పాదొకటి । తుమ్మకాయలే
ఆహారముగా గ్రహింపుచుందురు
యాచన సరిగా అందని రోజున
కాయలు మెండుగ కాయు నా పాదు

ఒక దినమున

దంపతు లిద్దరు ఉపచారంబులు
చేసిరి సామికి భిక్ష నొసంగిరి
తుమ్మకాయ శాఖముగా వండిరి
సామివారు కడు సంతృప్తి నంది
పలికిరి దయతో వారిని చూచుచు
ఈ దినము నుండి మీ దారిద్ర్యము
హరించి పోవును హాయిగ నుందురు
అని తా నరుగుచు నా తుమ్మపాదు
మొదటికి విరిచెను ముందుకు సాగెను
అది గని సతియును సుతులును ఏడ్చిరి
ఆహా ఏమిది ఏ అపరాధము

చేసితిమని యతి ఈ మా జీవన
మున కాధారము దీనిని విరిచెను
ప్రారబ్ధకర్మ బలమైనది కద
దానిని దాటుట తరమే జనులకు
సంపద లిత్తురు సద్గురుమూర్తులు
(మన) మంచికేననుచు మది భావింతము
సమాధానపడి శాంతి వహించిరి

విరిగిన పాదును విసిరి వైచుటకు
పాదు మొదలంట పలుగు వేయగా
లంకె బిందెలట నగుపడె వారికి
ఇంత ధనంబిది ఇటనే యున్నది
నిర్భాగ్యుల వలె నివశించినాము
గురుమూర్తి కరుణ జూపెను మనపై
ఇచ్చిరి మనకీ నిధులన్నిటినీ
పరికింపగ నా పరమేశ్వరుడే
అతిథిగ వచ్చెను ఐశ్వర్య మొసగె
దైన్యము బాపెను ధైర్యమొసంగెను

సామి దగ్గరకు సరగున నేగిరి
గురుపాదములకు పరమ భక్తితో
ప్రణతు లొనర్చిరి పరమాత్మా యని
జరిగిన విషయము సామికి చెప్పిరి

స్వామి:

ఈ విషయము మీ రేరికి తెలుపక
హాయిగ నుండుడు బైటకు చెప్పిన
ధనము హరించును దరిద్రులగుదురు.
వంశము అలరును ఐశ్వర్యముతో
అని దీవెన లిడి అనిపెను వారిని
మేడి నీడలో గుట్టుగ నుండెను

యోగినులు స్వామిని నిత్యము భిక్షకు తీసికొనిపోవుట

గురుమూర్తి యునికి తెలియ దెవ్వరికి
యోగినులు ఇతడు యోగీశ్వరుడని
మదిని భావించిరి చిత్తము లలరెను

ఆనందముతో అచటకు చేరిరి
నమస్కరించిరి నతశీర్షముతో
స్వామిని భిక్షకు తమతో తోడ్కొని
పోయిరి । సామికి పూజలు చేసిరి
భిక్షానంతరము చెట్టు వద్దకు
తోడ్కొని వచ్చిరి కడు నమ్రతతో
ఇదే విధముగా నిత్యము జరిగెను

అమరపురమందు తమలో విప్రులు తర్కించుకొనుట

అడవి మధ్యలో మేడి నీడలో
వసించు యతిపుర వాసుల ఇండ్లకు
ఒక దినమైనను భిక్షకు రాడే
ఎట కేగుచుండె ఈ రహస్యమును
కనుగొనవలెనని కాంక్ష హెచ్చగా
చాటుగ నుంచిరి అట నొక కాపును

మధ్యాహ్నసమయమయ్యెను । కాపరి
భీతావహుడై పరుగిడిపోయెను
గ్రామములోనికి గజగజ వడకుచు

యతివరుల చర్య మతిమాలి జనులు
పరీక్ష చేయ ప్రయత్నించినచో
పరాభవంబగు పతన హేతువది

పొలము కాపరి కథ

గంగానుజనుడు కాపరి యొక్కడు
పరిసరములందు తిరుగాడుచుండు.
సామిని భిక్షకు సాదరంబుగా

యోగినులు లావలి ఒడ్డుకు నిత్యము
గొనిపోవునపుడు ఆ నదిజలములు
చీలి రెండుగా మార్గము నిడుటను
కనులార గాంచి అనుకొనె మదిలో
ఇతడు మహాత్ముడు ఇందువలననే
సగౌరవంబుగ తాగొనిపోదురు
యోగినులందరు ఉత్సాహముతో
తమ గృహంబులకు అమలిన భక్తిని

ధన్యుడ నైతిని దర్శనమయ్యెను
అదృష్ట మియ్యది అపూర్వమైనది

ఆ మరునాడా మధ్యాహ్నంబున
సామితో కలసి సంతోషముతో
యోగిని లందరు సాగుచుండగా
చిత్రముగా నది చీలెను రెండుగ
వారి వెంటనే యరిగెను వాడును
నక్కుచు వారికి అగుపడ కుండగ

ఆ నది ఒడ్డున నగుపడె నతనికి
దివ్యసౌధములు దేవాలయములు

యోగినులు

రమణీయంబగు రత్నపీఠమున
కూర్చుండబెట్టి పరమ భక్తితో
షడ్రసములతో చక్కని భిక్షను
సామికి చేసిరి నమస్కరించిరి

యతివరుడు చూచె నా కాపరినట
ఏల వచ్చితివి నీ పని తెల్పుము

కాపరి

గడగడలాడుచు మోడ్చెను చేతులు
మీ దర్శనార్థ మిటకేతెంచితి
పరమేశ్వరులను భావము కలిగెను

కరుణింపుడు నను శరణము మీరే
తరింప జేసెడి తారకమూర్తులు
నా తప్పిదమును నను క్షమింపుడు

స్వామి

నేనిట నుండుట ఏరికి తెలుపకు
వచ్చిన దారిని వడిగా పొమ్మిక

ఆనాటి నుండి కాపరి సామికి
సపర్య చేసెను సామిని విడువడు
(సామి) పరమేశ్వరుడని పరి పరి మొక్కును

ఒక పూర్ణిమనాడు కాపరి స్వామితో

మాఘ మాసమున మాఘ స్నానము
పుణ్యప్రదమని గణుతిని గాంచెను
సామీ ఈ మాసము ప్రయాగను
స్నానము చేసిన అనంత ఫలమట
ఎరుగను కాశీ ఎరుగ ప్రయాగ
అల్పుడను నేను అల్పజ్ఞుండను
తెలియ చెప్పవలె తేటతెల్లముగ
మాఘ మహోత్మ్యము మజ్జన ఫలమును

స్వామి

ఈ సంగమమే ఇదియే ప్రయాగ
కొల్హాపురమే గయ మన కిచ్చట
సర్వార్థంబులు సమకూర్చుచుండు
పరమ పావన క్షేత్రము లియ్యవి
శ్రద్ధకు భక్తికి సంతసించితిని.

కాపరికి సరస్వతి కాశీ గయలను చూపుట

ప్రయాగ కాశీ గయలను చూపెద
పట్టుకొనుము నా పాదము విడువకు
సామి కూర్చొనెను పద్మాసనమున
యోగసమాధిని మునిగె క్షణమున

కను తెరచి మూయు కాలములోపున
ప్రయాగ చేరిరి పవిత్ర సంగమ
స్నానము చేసిరి సామియు కాపరి
కాశి విశ్వేశ్వరు సేవించిరి
ఆపై వారలు గయను చేరుకొని
స్వస్థానమునకు చనుదెంచినారు
సూర్యాస్థమయము జరుగుచుండగా

గురుమూర్తి అమరపురమున పాదుకలు అన్నపూర్ణను ప్రతిష్టచేయుట

సామి తలంచెను సామాన్యజనులు
గుర్తించిరి నను కోర్కెలతో నను
వేధించెద రిక వీడెదనీ స్థలి
అనుమతి గైకొనె అమరేశ్వరు కడ
యోగిను లిదిగని యో వరదాయక
మీ దర్శనమున మా తాపమడిగె
ఇచ్చోటు విడిచి ఏగుట తగునా
భక్తవత్సలాభ వభయనాశక
మము కరుణింపుము మాతో నుండుము
అని ప్రార్థించిరి అవనతముఖులై

స్వామి వారితో

ఇటనే నుందును ఏరికి గోచర
ముగాను దర్శన మొసగెద భక్తిని
తలచిన। తీర్చెద కోర్కెలు తడయక
ప్రతిష్ట చేసెద పాదుకల నిచట
ఔదుంబరమును పాదుకల నర్చ
న చేసిన కలుగు ననేక శుభములు
ప్రతిష్ట చేసెద వేదవిహితముగ
అన్నపూర్ణ నిట। అన్నదానములు
నిరంతరంబును జరుపుదు రిచ్చట
నిరాటంకముగ నిరుపమానముగ,

ఇచ్చట నున్నవి తీర్థములు మూడు
నిమజ్జనంబును నియతిని జేయుచు
ఉదుంబరమునకు ఉదకము నిత్యము
ఏడు కలశములు ఏర్పడ పోసిన
శతాయుష్కుడగు పుత్రుడు కలుగును
స్నానమాత్రమున సర్వపాపములు
నశించిపోవును నిశ్శేషముగా
గ్రహణకాల సంక్రాంతి పుణ్యదిన
ముల నిమజ్జనము ఫలప్రదమగు
యజ్ఞ మొనర్చిన అనంత ఫలములు
కలుగును వారికి అప్రయత్నముగ
(మేడి) వృక్షమూలమున చేసిన జపములు
సిద్ధించు పరమ శాంతిని గూర్చును
నా పాదుకలకు నను స్మరించుచు
ఏకరుద్రాభిషేకము చేసిన
అతిరుద్రమొసగు అద్భుత ఫలమును
పొందుట తథ్యము । అతులిత ఫలమది
ఉదుంబరమునకు । పాదుకలకునూ
ప్రదక్షిణంబులు భక్తిని చేసిన
హరించు కుష్టువు । అంగవైకల్య
మగుపడదించుక । అబ్బుర పరచును

గాణ్గాపురము

యోగినులతో!

కలదొక నగరము గాణ్గాపురమది
అచ్చట కలియును అమరజ భీమా
నదు లచటకు నే నరిగెద నిప్పుడు
సుఖముగ నుండుడు శుభములు కలుగును
అని పలికి సామి అదృశ్యు డయ్యెను

నామధారకుడు సిద్ధుని అడిగెను

అమరపురంబున ఆపై జరిగిన
గురులీల నాకు తెలుపుడు రయతో

శిరోజ గ్రామము - గంగాధరుడు

విచిత్రమైనది వినవలె నా కథ
శిరోజ యనునది చిన్న గ్రామము
వేదశాస్త్రములు విద్యలు నేర్చిన
విప్రుడు గంగాధరుడట కాపుర
ముండెను పౌరులు ఉత్తము డందురు
ఆతని సతి తన పతి ననుసరించు

ఆ దంపతులకు

పుత్రులైదుగురు పుట్టిరి చచ్చిరి
చేసిరి పూజలు చేసిరి యాత్రలు
సంతతి కొరకై। ఎంత చేసినను
కోరిక తీరదు దారి కనబడదు

కర్మ విపాకము మర్మము తెలిసిన
విప్రుని యడిగిరి వివరింప వలెను
ఈ దుఃఖమునకు ఏది కారణము?

సంతతి నశించుటకు కారణము

అశ్వము, గోవును హింసించినచో
పరద్రవ్యమును అపహరించినను
మరు జన్మంబున పుత్రులు పుట్టియు
మరణింతు రనుచు తెలుపును శాస్త్రము
పూర్వజన్మమున మీరొక విప్రుడు
ఇచ్చిన అప్పును తీర్చక యుండిరి
(ఆతడు) ఎంత అడిగినను మీరీయరైరి

విసిగి వేసారి విప్రుడు తను తా
హత్య చేసికొని అసువుల బాసెను
పిశాచమయ్యెను కసిగా బిడ్డల
చంపుచున్నాడు చల్లారదు కసి
విడువడు గృహమును వేధించు మిమ్ము
ప్రారబ్ధంబిది బలీయమైనది
అనుభవించ వలె అంతము వరకును
ఈ మాటలు విని ఏడ్చెను సుశీల
అమిత దుఃఖమున ఆయమ కుందెను

అనుభవించితిమి అపార దుఃఖము
తరించు మార్గము తెలుపుడు మీరే
దీనవదనయై విప్రుని వేడెను

పిశాచ బాధ తొలగు ఉపాయము

పండితుడు చెప్పెను

పిశాచ మయ్యెను విప్రుడు మీ కత
మున నే కుటుంబము లేదు వంశీ
యులును లేరైరి మరణసమయమున
శవసంస్కారము జరుగనేలేదు
చేయు డతనికి ప్రేతకర్మలను
అతని సగోత్రున కాధన మీయుడు
తాపము తీరును పాపము హరించు
శాంతి చేకూరు వర్ధిలు వంశము

నే కడు బీదను నే తేజాలను
నూరు రూప్యములు తెలుపుడు మార్గము
అన దైవజ్ఞుడు ఆ యమతో ననె

దైవజ్ఞుని సలహా

సంగమము వద్ద సద్గురు పాదుక
లారాధింపుము అనన్య భక్తిని

ఒక నెల దినములు ఏకాగ్రతతో
శ్రీనరసింహసరస్వతి అనుగ్ర
హించిన నశించు దోషములన్నిము
పూర్ణాయుష్కుడు పుత్రుడు పుట్టును

సుశీల ఉదుంబరమును పాదుకలను పూజించుట

సంగమమున తా స్నానము చేసెను
కలశము లేడిట జలమును తెచ్చెను
ఉదుంబర తరువు మూలమున పోసె
గురుపాదుకలకు పరమభక్తితో
ప్రదక్షిణలను పూజలు సల్పెను
మూడు దినంబులు ఉపవాసముండె
స్మరించుచుండెను గురుమూర్తిని మది

కలలో పిశాచి కనబడి పల్కెను
నా రూప్యంబులు నా కీయనిచో
నీ సంతతి భువి నిలచుట కలయే
నిను చంపుదు నేనిపుడే। అరచుచు
మీదికి రాగా మది భీతిల్లెను
వడిగా పరుగిడి మేడి దాపునకు.
అచట గురుమూర్తి అగుపడె నామెకు
వారి చాటునకు చేరెను భీతిని

గురుమూర్తితో పిశాచము తన గోడు చెప్పుకొనుట

ముందుకు వచ్చిన ముప్ప వాటిలును
ఎందుల కీమెను హింసించుదువన

పిశాచము

మీరు యతీశులు కరుణామూర్తులు
ఉచితము కాదీ పక్షపాతమనె
నే చనిపోవుట ఈమె వలననే
అపహరించె నా అల్పధనంబును

తిండికి లేకనె తిరుగాడియాడి
అసువులు బాసితి పిశాచ మైతిని

స్వామి

శరణము జొచ్చిన వారి రక్షణము
నా కర్తవ్యము నా మాట నీవు
పాటించినచో బాధాకరమగు
పిశాచ రూపము అచిరకాలమున
హరించిపోవును ఆపద తొలగును

పిశాచికి :-

యతి దర్శనము శాంతిని గూర్చెను
సామి చెప్పినది సమ్మత మనియెను

సుశీలకు స్వామి సలహా

వాని పేర పది దినములు కర్మను,
ధనము సమకూర్చి దానము, చేయుము.
దోషము తొలగును పూర్ణాయుష్కులు
పుత్రుడు పుత్రిక పుట్టెదరు నీకు.
స్నానము చేసి శ్రద్ధగ నిత్యము
ఏడు కలశముల నీటిని గైకొని
మేడిచెట్టునకు మెల్లగ పోయుము
పాదుకల నీవు భక్తిని కొలువుము
అని చెప్పి సామి అదృశ్యుడయ్యెను
గురుమూర్తి. యాజ్ఞ శిరసావహించి
వ్రత మాచరించె చిత్తశుద్ధితో

సుశీల

పిశాచి పేరున చేసెను కర్మను
పది దినములు, ఆపై దానములును.
హత్యాదోషము హరించిపోయెను

తొలగెను దైన్యము కలిగెను ధైర్యము
సమసెను బాధలు శాంతి లభించెను

ఆమె

స్వప్నమునందున సామిని కాంచెను
గురుమూర్తి రెండు ఫలములు యొడిలో
నుంచెను వీనిని భక్షించినచో
సంతతి కలుగును సత్వరముగనే
మెలుకువ వచ్చెను కల కరిగిపోయె

సుశీలకు సంతానము కలుగుట

గర్భము దాల్చెను కవలల కన్నది
అతి సుందరులా బాలులిద్దరును
ముద్దుగ పెరిగిరి ముదమును గూర్చుచు
బాలులిద్దరుకు తలపెట్టినారు
చౌలోపనయన సంస్కారంబులు
ఆనందముతో నలంకరించిరి
గృహమంతటినీ గృహ పరిసరముల
ముహూర్తంబునకు ముందు రోజునే

పెద్ద బాలుడు మరణించుట - సుశీల దుఃఖము

పెద్ద బాలునకు వ్యాధి సోకగా
బిగుసుకు పోయెను । భిషగ్వరు లనిరి
ధనుర్వాత మిది దారి కనబడదు
మూడు దినంబులు గడిచె నట్టులే
బాలుడా రాత్రి మరణించినాడు
భరింపజాలక తల్లి నేలపై
బడి దొరలుచు తా నేడ్చె బిగ్గరగ
ఇదివరలో నా కెందరొ పుట్టిరి
చచ్చిరి. బాధ మరచితిని పూర్తిగ
గర్భమున నీవు పెరుగుచుండగా
గురుమూర్తి నాకు వరము నొసంగెను

దీర్ఘాయుష్కులు కలుగుదు రనుచును
విశ్వశించితిని। ఆశలు ఎన్నో
మదిలో మెదలెను వృద్ధుల మైతిమి
కనిపెట్టుదురని కలలను కంటిమి
అనాథలజేసి అరగుట తగునా
అని రోదించుచు ఆ బాలుని కడ
పడి యుండగ నా ప్రక్కవారనిరి

దైవము నెవ్వరు తప్పింప గలరు
లలాట లిఖితము చెరుపుట తరమా
అవతారములే అస్థిరములుగద
తప్పదు మరణము జీవులందరకు
దుఃఖము మాని ప్రక్కకు జరుగుము
శవమును విడువుము ఈవలకు రమ్ము

సుశీల

ఆరాధించితి అమరపురంబున
నారసింహ యతివరుని శ్రద్ధగ
ఫలములు రెండిచ్చిరి తినుటకునై
పుత్రులు దీర్ఘాయుష్కులు పుట్టెద
రని వరమొసగిరి యా గురుమూర్తులు
వ్యర్థంబగునా వారి వాక్యములు
బాలునితోనే ప్రాణము విడిచెద

స్వామిని మదిలో స్మరించె నంతట
ఇంతటి దుఃఖము ఎందుకు కలిగెను
నిశ్చల మతితో పూజించుచుంటి
మీ మాటలు నే విశ్వసించితిని
నిర్భయంబుగా నే నింతదనుక
హాయిగ నుంటిని ఆనందముతో
వ్యాఘ్రమును చూచి పరుగిడిపోయిన

ఆవు కసాయి గృహము చేరినటులు
గుడిలో వేల్పును గొలువగ నేగిన
శిరమున కూలిన శిఖరము రీతిని
నే నుంటి నిపుడు నను కరుణింపుము

తరువాత

శవము ప్రక్కన చతికిల పడినది
ఆ రాత్రి కాల మంతయు నేడ్చుచు.
తెల తెల వారెను ఇరుగు పొరుగువా
రొచ్చిరి శవమును దాచుట తగదని
పరిపరి చెప్పిరి శాస్త్రము చెప్పిన
సంస్కారంబును జరుపవలె ననిరి
ఆలసింపకుము మూర్ఖత మానుము

సుశీల

పైట కొంగుతో బాలుని గట్టిగ
తనకు కట్టుకొని నే నీ బాలుని
మీ కీయను నను వీనితో కలిపి
దహింపవచ్చును సహింపజాలను
వీని వియోగము అని యూరకుండె

అపరాహ్ణకాల మాసన్నమయ్యె
మాట్లాడలేక మౌనము వహించి
బ్రాహ్మణు లందరు అయోమయంబుగ
నిలబడి యుండిరి నిశ్చేష్టులగుచు

బ్రహ్మచారి సుశీలకు జీవితము క్షణభంగురమని బోధించుట

ఆ సమయమున అచటికి వచ్చిన
బ్రహ్మచారి యనె । అమ్మా తెలిసియు
మూర్ఖురాలవై దుఃఖించు టేల
క్షణభంగురమీ జీవితముగద
పుట్టిన వన్నియు గిట్టుట సహజము

శరీరంబు లివి జల బుద్బుదములు
మాయకు లోనై మనుజులు తలతురు
సుతుడని సతియని సోదరుడనుచును
సత్వగుణము దేవత్వము గూర్చును
గూర్చును రజస్సు నరజన్మంబును
కూర్చును తమస్సు పశుజన్మంబును
పుట్టుట గిట్టుట పూర్వము చేసిన
కర్మఫలంబని తెలిసినదానవు
నిత్యము లనుకొనరాదీ తనువులు
వివేకవంతుడు విజ్ఞత మెరయగ
సుఖదుఃఖముల చూచును సమముగ
బాల్యమునందునె మరణించు నొకడు
యవ్వనమందున వేరొకడు చచ్చు
వృద్ధాప్యంబున కొందరు చత్తురు
సత్యము పలికితి శాంతి వహింపుము
మలమూత్రంబుల మలినదేహమిది
ఆలోచింపుము ఆవేశ పడకు
స్వప్నమునగన్న సంపదలన్నియు
మెలకువ గలిగిన ఏమగును చెపుము?
ఎన్నో జన్మలు గణుతింప తరమె
తల్లిగ నుంటివో। తనయు లెందరో
ఎరుగుదువె నీవు వారిని తలతువె
ఈ బాలునిపై నీ మమకారము
విడువుము శవమును తడయక నొసగుము
సంస్కరించవలె జాగు చేయకుము

సుశీల బ్రహ్మచారిని ప్రశ్నించుట

స్వామిని జూచుచు సుశీల పలికెను
ప్రారబ్ధము కడు బలీయమైనది
అని సెలవిచ్చిరి అది నిజమైనచో
భగవత్పూజలు పనికిమాలినవ?

వైద్యుడు రోగికి వైద్యము చేయుట
నిరర్థకంబా? మీరే తెలుపుడు
ఆపద వచ్చిన ఆర్తిని చెందిన
సమర్థవంతుని శరణము జొచ్చిన
ఆపద తొలగుట నరయుట లేదే?

పూర్వము నేనొక దరిద్రురాలను
పొందితి శ్రీగురు దత్తాత్రేయుని
అనుగ్రహంబును । ఆ నరసింహయ
తీంద్రులు సాక్షాత్ దత్తమూర్తులే
వారి వలననే వరమును పొందితి
అప్పటి నుండియు హాయిగ నుంటిమి
విశ్వశించితిని నృసింహయతివరు
వారిని మదిలో స్మరింతు నెప్పుడు
గురుమూర్తిదె నిక భారమంతయును
అని పలికి యామె మిన్నక యుండెను

బ్రహ్మచారి సుశీల కిచ్చిన సలహా

ఇంత దృఢంబగు భక్తియు విశ్వా
సము గలదానివి సంగమమునకే
ఏగుము అచ్చట నిన్ను గురుమూర్తి
అనుగ్రహించెను అభయ మొసంగెను
ఇటనీవేడ్చుట నిష్ప్రయోజనము
ఉదుంబర వృక్షము వద్ద నేడ్వుము
ఆ మహనీయుడు ఆ చోటు వీడె

సుశీల బాలుని శవముతో ఉదుంబరము వద్దకు పోవుట

పైట కొంగులో బాలుని కట్టెను
పతి అనుసరింప బాలుని శవమును
గైకొని చేరెను వృక్షము వద్దకు
కడు దుఃఖముతో కనలుచు నుండెను

పాదుకపై తల పరిపరి కొట్టెను
నెత్తురు చిమ్మెను పాదుక తడిసెను

బంధువులు శవసంస్కారము ఆలసింపవలదనుట

సూర్యాస్తమయమగుటకు ముందుగ
శవసంస్కారము జరుపుట కర్జము

బంధువులందరు పరుగున వచ్చిరి
శవమును విడువుము సంస్కరింపవలె
రాత్రిపూట నిట రాక్షసులుందురు
మనుష్య మాత్రులు మసజాలరిచట
క్రూరమృగంబులు చరించు నిచ్చట

ఎంత చెప్పినా ఏడుపు మానదు
విడువదు శవమును విడువదు మోహము
పెద్దల మాటలు పెడచెవిని పెట్టె

బంధువులు విసిగి ఇండ్లకు పోవుట

వెడలుద మిప్పుడు ఇండ్లకు రేపుద
యంబున వత్తము ఆ శవము కంపు
భరింపజాలక బైటకు నెట్టును
ఈసడించుచూ ఇండ్లకు పోయిరి

బాలుడు బ్రతుకుట

ఆ రాత్రి మూడు జాములు గడిచెను
కలలో నామెకు కనబడె నొక యతి
వ్యాఘ్రచర్మ పరిధానుండాతడు
భస్మోద్ధూలిత భవ్య విగ్రహుడు
జటాధారియై జ్వలించుచుండెను

అమ్మా తగునా అపనింద మోప
నీ సుతున కిపుడు చికిత్స చేసెద

బాలుని నోటిని తెరువు ప్రాణము
పోసెద నని తా భూతిని చల్లెను
శరీరంబుపై । మెలకువ వచ్చెను
భ్రాంతిని చెందెను భయమావహించె

సుశీల సంశయము - తీరుట

మరణించె నితడు మరల బ్రతుకుట
సాధ్యమె । అంతయు వింతగ నున్నది
మెలకువ వేళను ఏమి తలంతుమొ
కలలో నదియే కనబడును గదా !
అజ్ఞానము నను అలముకొనుటచే
యతీశ్వరునినే నిందించినాను
పరి పరి విధముల ఆలోచించుచు
ప్రక్కకు తోసెను బాలుని శవమును
శవమున నగుపడె చైతన్యమపుడు
కాలును చేతులు కదలుట మొదలిడె
భూతచర్యయని మదిలో తలచెను
కూర్చుని బాలుడు కోరె అన్నమును
అమ్మా ఆకలి యని వా డరచెను

సుశీలకు

స్తనముల నుండి స్రవించె దుగ్ధము
సంశయముడిగె స్తన్యము నిచ్చెను
బాలునెత్తుకొని పరమప్రీతిని
భర్తకు తెలిపెను జరిగిన విషయము

సుశీల దంపతులు గురుమూర్తిని స్తుతించుట

ప్రదక్షిణ చేసి ఉదుంబరమునకు
నమస్కరించిరి అచటి పాదుకలకు

కరుణామూర్తికి వరదాయకునకు
నమోవాకములు నమోవాకములు
మీ మహిమాదులు మీ దివ్యత్వము

వర్ణింప తరమె పరిపూర్ణముగా
మూఢులము మేము మోహవశంబున
కనలేమయితిమి కరుణామయు లని
మీరే శరణము - మీ చరణములే
స్మరించు చుందుము నిరంతరంబును
అని ప్రార్థించిరి ఆ సతీపతులు

స్నానము చేసిరి కృష్ణవేణిలో
కలశముల తోడ జలములు తెచ్చిరి
పాదుకలు కడిగి పరమ భక్తితో
పూజలు సలిపిరి పులకితు లయ్యిరి
దీపమాలికలు దంపతులిద్దరు
మేడిచెట్టునకు చుట్టును పెట్టిరి
ఎంతో శోభగ వెలిగె దీపములు
పరిమళ మొసగెడి పూలమాలికల
పాదుకలు కప్పి పరవశమందిరి
నీరాజనమిడి నిలబడి యుండిరి
మౌనము వహించి మదిలో సద్గురు
స్మరించు చుండిరి సంతోషముతో

తెలతెలవారెను పరుగిడి వచ్చిరి
బంధువులందరు బాలుని శవమును
సంస్కరింపగా। జాలి హెచ్చగా
దుర్గంధము తా భరింపజాలక
శవము నొసంగును సంశయము లేదు

ఆటల నాడుచు పాటలు పాడుచు
బాలుడుండుటను పరికించినారు
అపూర్వమిదియని అబ్బురమందిరి
గురుస్థానమిది పరమ పావనము
విశ్వాసముతో నిశ్చల భక్తిని

కొలుచువారలను కరుణామయుడై
కష్టకాలమున కాపాడు గురువు
ప్రాణము నొసగిన పరమేశ్వరుడే
శ్రీనరసింహ సరస్వతి యతివరు
పాదుకలకు పరి పరి ప్రదక్షిణ
చేసిరి, పూజలు చేసిరి బంధువు
లందరు ఇది యొక అద్భుత కథ యని,
(మేడి) చెట్టు నీడలో గుట్టుగ నుండును
గురుమూర్తి ఇచట వరదాయకుడై

ఆ వృక్షము -(మేడిచెట్టు)- నదీస్నాన మహిమ

కామధేనువది కల్పవృక్షమది
భక్తులను కాచు భద్రకవచమది
దారిద్ర్యంబను దావానలముకు
కాలమేఘమది పరికించినచో
రోగము లన్నియు వేగమె హరించు
అంగహీనులగు అభాగ్యు లందరు
సుందరాంగులై శోభిల్లుదురిట
దుష్ట రోగమగు కుష్టువు సహితము
అచిరకాలమున నశించిపోవును
అచ్చటి నదిలో అనన్యభక్తిని
స్నానమును చేసి సద్గురు సన్నిధి
సాష్టాంగ పడిన కుష్టు హరించును
అచిరకాలమున అతని శరీరము
పసిడి వన్నెతో మిస మిసలాడును

సిద్ధుడు చెప్పెను శిష్యునికీ కథ

గంధర్వ నగరము - నేటి గాణ్గాపురము

గాణ్గాపురంబు గణుతిని గాంచిన
అగ్రహారమిది విప్రగృహంబులు
సంఖ్య శతాధిక । సజ్జనులందరు

పురపరిసరమున కలియును అమరజ
భీమానదిలో - భీమా ఇచ్చట
ఉత్తర వాహిని । తీర్థము లెన్మిది
గలవు తీరమున గణుతిని గన్నవి
కృంకు విడినచో కోర్కెలు తీరును
సంగమము వద్ద సామి గుప్తముగ
వశించుచుండెను । పురజను లెరుగరు
అశ్వత్థ మొకటి అలరుచున్నదట
కల్పవృక్షమును పోలిన తరువది

అగ్రహారమున అందరి కంటెను
బీద బ్రాహ్మణుని ఇంటికి భిక్షకు
యతివరు-డేగును ఇతరుల గృహముల
కేగడు భిక్షకు - ఒక దినమైనను

గొడ్డు బర్రె పాలిచ్చుట

విప్రుని ఇంటను కలదు బర్రె కడు
ముసలి గొడ్డుబోతై అదియుండుట
వలననె దానిని బాడుగ కిత్తురు
బరువు లాగుటకు పొలము దున్నుటకు
యుపయోగింతురు వ్యవసాయములో
బిచ్చము నెత్తును బీద బ్రాహ్మణుడు
అదియె జీవనోపాధి వారలకు
బాడుగ తెచ్చెడి పైకముతోడను
సజ్జను లొసగెడి సహకారముతో

కాలము గడుపును విప్రుడు తృప్తిగ
ఆతని భార్యకు పతియే దైవము
సామి భిక్షకై చనుదెంచుటయన
పూర్వజన్మకృత పుణ్యఫలమె యని
సతియును పతియును సంతోషింతురు

అది వైశాఖము అపరాహ్ణమాయె
బ్రాహ్మణి యొక్కతె గృహమున నుండెను
భిక్ష మెత్తుటకు వెడలెను విప్రుడు
రాలేదింటికి ఆలస్యమాయె
ఇంటి ముందటను కట్టిరి బర్రెను
దాని బాడుగకు కొని పోకుండిరి
ఆ దిన మెవ్వరు । విధి విలాసమది

ఆమె

భిక్షకు స్వామి వచ్చుట చూచెను
లోనికి రమ్మనె వినయముట్టిపడ
ఆసన మిదిగో అనుష్టానమునకు,
ఆయవారమున కరిగెను నా పతి
ఇపుడే వచ్చెద రింటికి అనగా

స్వామి

వేచి యుండుటకు వీలులేదిపుడు
పాలు నా కిమ్ము చాలునీ దినము
ఆ బర్రెపాలు । ఆలసింపకుము
అన విని యా సతి అనెను సామితో

సామీ

ఈ బర్రె పుట్టి ఇటనే పెరిగెను
గొడ్డుబోతుగా గడచెను కాలము
ముసలిది అయ్యెను ఓ దున్నను వలె

దీనిని బాడుగ కిచ్చెదము, రాలే
దీదిన మెవ్వరు, ఇది ఇటనున్నది

దరహాసముతో గురుమూర్తి పల్కె
అబద్ధమాడకు అది పాలిచ్చును
పితుకుము పాలను మది కలతలేక
అన విని ఆ సతి ఆశ్చర్య పడుచు
పాత్రను గైకొని గేదె దగ్గరకు
మెల్లగ నేగెను । బర్రె రూపమే
మారిపోయినది పాలు ధారగా
కారుట మొదలిడె పాత్రలు నిండెను

తనలో

అతి విచిత్రమిది అనుసమమిది
ఎంచి చూడగా ఈశ్వరులు వీరు
అని మది తలచెను ఆనందించెను
పాలను కాచెను గురుమూర్తి కిచ్చె

గురుమూర్తి

పాలారగించె పరమ ప్రీతిని
ఆశీర్వదించి అభయ మొసంగెను
సిరి సంపదలతో తులతూగుదురిక
పుత్రపౌత్రాభివృద్ధి కలుగునిక

అని

సంగమ స్థలికి చనెను గురుమూర్తి
ఇంటికి రాగా చెప్పెను పతితో
జరిగిన దంతయు - గురుమూర్తి మహిమ

విపుడు

ఫలించె పుణ్యము. గురుకృప మనపై
వర్షించె నిపుడు పాపము నశించె

పతియును సతియును సంగమము చేరి

స్వామికి

సాష్టాంగ నమస్కారము చేసిరి
గురుచరణములే శరణము మాకిక
కరుణామూర్తి దరిచేర్చుము మము
అని ప్రార్థించిరి అర్చన చేసిరి
ఆశీశులు గొని అరిగిరి ఇంటికి

ఆ మరుసటి దిన మా బర్రె యొసగె
క్షీరము కుండెడు చిత్తము లలరగ

బాడుగకుగాను బర్రెను గొనిపో
వచ్చిన వారికి పాలనిచ్చు నీ
బర్రెను మేమిక బాడుగ కీయము
క్షమించవలెనని నమస్కరించిరి

గ్రామాధికారి రాజునకు బర్రె పాలిచ్చుట తెలుపుట

ప్రాకె నీ వార్త నగరములోనికి
విప్రుని ఇంటికి వింతను జూడగ
గ్రామాధికారి రయమున నేగెను
విప్రుడు విషయము తెలిపె వివరముగ
గ్రామాధికారి రాజునకు తెల్పె
నీ ఉదంతమును అబ్బుర మిదియని

రాజు యతి దర్శనమునకు సపరివారముగ వెడలుట

ఆ పృథ్వీశుడు సామి దర్శనము
శుభదాయక మని సపరివారముగ
సంగమము చేరి సామిని చూచుచు
చేతులు ముడిచెను భక్తిభావమున

జగద్గురువులకు జయంబు జయంబు
విశ్వతారకులు విజ్ఞాన ఘనులు
మోహజాలమున మునిగిన వారము
ఉద్ధరింపవలె సదయహృదయమున

సాక్షాత్ భగవత్స్వరూపులు మీరు
(మీ) చరణ కమలములు శరణము మాకిక !

స్వామి :-

ఆ రాజు భక్తి కానందించిరి

అడవుల వశించు యతులము రాజా
దారాపుత్రులు మిత్రుల తోడ్కొని
ససైన్యముగా సంరంభముతో
ఏల వచ్చితివి తెలియజెప్పుమన

సత్యమూర్తులని సద్గురువరులని
మహనీయులనుచు మదిలో నమ్మితి
అడవిని యుండుట కవసరమేటికి
మా గ్రామములో మీకొక చక్కని
వసతిని గూర్చెద వశింపు డచ్చట
మా పురజనులకు మార్గము తెలుపుడు
సర్వవేళలను సేవల తనుపుచు
మేముండెద మట మీ కనుచూపుల
మెలగుచు. అంగీకారము దయతో
తెల్పుడు అన విని గురుమూర్తి యనెను

సజ్జనులు మీరు సంతసించితిని
మీ కోర్కె మా మది కంగీకారమె

నరసింహ సరస్వతి మఠమునకు వచ్చుట

రాజాజ్ఞతో పురజనులు

చక్కని శిబికను సరగున దెచ్చిరి
గురుమూర్తి నందు కూర్చొన జేసిరి
వేదము చదువుచు విప్రులు నడచిరి
బహు విధంబులగు వాయిద్యంబుల
మధుర స్వనములు మది హాయి గొలిపె
పురజనులందరు ఎదురుగ వచ్చిరి

ఆహ్వానించిరి అమలిన భక్తిని
సతీమణులెల్ల సామికి నీరా
జనము నొసంగిరి జయ యతివరయని

బ్రహ్మరాక్షసి - ముక్తి పొందుట

పట్టణ పశ్చిమభాగంబున నొక
అశ్వత్థముపై వశించుచుండెను
బ్రహ్మరాక్షసుడు బహు దుర్మార్గుడు
వాని భయముచే వశింప రెవ్వరు
ఆ ప్రదేశమున । అచ్చటి గృహములు
పాడుపడియుండె కడు శిథిలములై

సామితో శిబిక సమీపించగనె
గ్రక్కున రక్కసి వృక్షము తా దిగె
నమస్కరించెను నతశీర్షముతో

రాక్షసి స్వామితో

అంధకారమున అలమటించుచూ
ఉంటిని నే నిట । కంటి నిపుడు నే
సద్గురుమూర్తిని । సమసిపోయె నా
దోషము లన్నియు । దుర్మార్గుని నను
నుద్ధరింపవలె । ఆదరింపవలె
అని మోకరిల్లె యతివరు నెదుటను

గురుమూర్తి తాకె నా రక్కసి తల

వానికి

మనుష్య రూపము మానుగ వచ్చెను
సామి పాదముల సాష్టాంగ పడెను

స్వామివానితో

సంగమమందు స్నానము చేయుము
శాంతిని పొందుము సజ్జనుడ వగుము
ఆశీశుల నిడి యాతని పంపెను

అక్కజ మందిరి ఆ గ్రామస్థులు
పరమేశ్వరుడే గురుమూర్తి యనిరి
మన అదృష్టమని మది నుప్పొంగిరి

రాజు నరసింహ సరస్వతిని సేవించుట

చక్కని మఠమును సామి యుండుటకు
నిర్మించె రాజు నిశ్చల భక్తిని
అశ్వత్థ వృక్ష మచటికి దాపున
కల్పవృక్షమై వర్ధిలుచుండెను

సామికి నిత్యము హారతు లిచ్చును
పూజలు చేయును రాజు భక్తితో
వన విహారమున కని గురుమూర్తిని
తోడ్కొనిపోవును తోటల లోనికి

గురుమూర్తి మహిమ పలువురకు తెలిసి
సామి దర్శనము చరితార్థ మనుచు
జనులచ్చోటికి అను నిత్యంబును
అసంఖ్యాకముగ అరుదెంచినారు
ప్రతి దినమచ్చట పర్వదినంబే
సంతర్పణలు నిత్యము జరుగును

కుమసి గ్రామము - త్రివిక్రమభారతి దూషణ

గాణ్గాపురమున కనతి దూరమున
కుమసి యను గ్రామము గల దచ్చట
త్రివిక్రమభారతి యను యతివరుడు
వేదశాస్త్రములు విద్యల నెన్నో
నేర్చిన ఘనుండు నివశించుచుండె
నరసింహమూర్తి నర్చన చేయును
వేరొక దేవుని స్మరించ డెప్పుడు
స్వామిని గూర్చిన సమాచారమును

వారి మహిమలను తెలియచెప్పగా
అంతయు దంభము యతిధర్మమునకు

విరుద్ధంబులవి వినవలదు కధలు
పరి పరి పల్కును పరుషవాక్యముల
శ్రీనరసింహ సరస్వతి యతివరు
నిందించుట యతని నిత్యకృత్యము
గురుమూర్తి వినిరి భారతి విమర్శ

గురుమూర్తి కుమసికి పరివారముతో పోవుట

నింద్యములట నా పద్ధతులన్నియు
పలువురతో నసె భారతి కుమసిని
ఏగుద మచటికి ఎందుకు నిందను
నాపై వైచెనో అడుగుద మాతని

మరునాడుదయము మహోత్సాహమున
రధ గజ తురగ పదాదులతోడను
పరివారముతో వాద్యముల మధుర
స్వనములు దిక్కుల నన్నిటి నింపెను
చక్కని శిబికను సామి కూర్చుండె
కుమసికి సాగెను ఆ మహోత్సవము

త్రివిక్రమభారతి గురుమూర్తిని శరణు జొచ్చుట

కుమసిలో ఆదినమున
త్రివిక్రమభారతి మనసు చలించెను
ధ్యానము కుదరక తడబడుచుండెను

తనలో

నృహరీ ఏమది ఏ అపరాధము
చేసితి । ఉపేక్ష చేయుట తగునా
నా తప మంతయు వ్యర్థంబయ్యెను
అని మది గుందెడి ఆ సమయంబున
అగుపడె నతనికి హృదయఫలకమున
యతివరుడొక్కడు అధిక తేజస్వి

చర్చకు తనతో వచ్చుచున్నట్లు
త్రివిక్రమ భారతి పూజ మానెను
త్వరిత గతిని తా నరిగెను ముందుకు
ధ్యానములో తా గనిన మహాత్ముని
శిబికమున గాంచి అబ్బుర మందెను

సామికి చేసెను నమస్కారమును
త్రిమూర్తి రూపా! తెలియని వాడను
అపరాధిని నను అనుగ్రహింపుము
అనంతములు మీ అద్భుత లీలలు
అవతరించె నిల ఆ పరమేశుడె
ధర్మస్థాపన ధరలో నెరపగ
చర్మచక్షువులు మర్మము తెలియవు
చూపుడు తమ నిజరూపము దయతో
విశ్వతారకులు విశ్వేశ్వరులును
మీరే సామీ శరణము నా కిక

నరసింహ సరస్వతి త్రివిక్రమభారతిని అనుగ్రహించుట

దత్తరూపమున దర్శన మిచ్చెను
నను నిందించిన నిను జూచుటకై
వచ్చితి నిచటకు పరివారముతో
నరహరిని నీవు పరమ భక్తితో
స్మరించుచుండుము నిరంతరంబును
ఆత్మజ్ఞానము అలవడ జేయును
వాసన లన్నియు నశింపజేయును

నే నపరాధము చేసితి సామీ
మాయను మునిగితి మోహమున బడిత్
సూర్యుని వెలుగును గుడ్లగూబ కన
నేరదు అటు వలె నేనును మీ మహి
మాతిశయంబులు మది కన నైతిని
క్షమింపవలె నను సదయ హృదయమున

పరమేశ్వరు మిము శరణము జొచ్చిన
దోషరహితులై విషయదూరులై
కలిని జయింతురు పరము చేరుదురు
పూర్వము కృష్ణుడు విరాడ్రూపమును
చూపె నర్జునకు। చూపితిరి నాకు
విరాడ్రూపమును కరుణామయులై
తరించె జన్మము తరించె వంశము

సామి

చిత్తశాంతి గని ముక్తిని పొందుము
అని దీవించిరి అరిగిరి మఠముకు
దరహాసముతో పరివారముతో
త్రివిక్రమభారతి నుద్ధరించుట
కే సామి కుమసి కేగెనని జనులు
తలచిరి భారతి అదృష్టవంతుడు
ఎన్నో జన్మల పుణ్యఫలిత మిది

వైఢూర్య నగరము - యవనరాజు బ్రాహ్మణద్వేషి

వైఢూర్యంబను బడా నగరమది
అధిపతి దానికి యవనుం డొక్కడు
క్రూరుడు మూఢుడు నరుల హింసించు
బ్రాహ్మణద్వేషి, వారల ననయము
పరాభవించును పరిపరి విధముల

వాడు

వేదములు మాకు వినిపింపవలెను
కోరిన ధనమును కూర్చెద మీ కను
అర్థము చెప్పిన అధిక ధనంబను

వేదము రాదని కొందరు చెప్పిరి
ధనము నాశించి ధర్మమును మరచి

వేదము చదివిరి కొందరు మూఢులు

యవనుడు

మీరు యజ్ఞమున బలుల నొసగుదురు
హింసాకృత్యము దాచనేమిటికి
మీరును మాంసాహారము మావలె
ఆరగించెదరు ఆప్యాయముతో
గొప్పలు చెప్పుచు గోడగించెదరు
విప్రుల నీ విధి పరిహాసమాడు

అహంకారపూరితులు - ఇద్దరు వేదపండితులు

ఒకనాడు

యవనిని కడ కరుదెంచినారు
ఇద్దరు విప్రులు వేద పండితులు
వేదము లన్నియు సొంతము చదివిన
వారము మా సరి వారుండ రెచట
వారలున్నచో పిలువ పంపుడని
వేదము చదివిరి వేదార్థంబును
చెప్పిరి యవనుని మెప్పును పొందిరి

వీరతిదుష్టులు వేదబాహ్యులని
వాదన వలదని వేద పండితులు
జయపత్ర మిదిగో జయంబు మీదే
ఓటమి దెల్పిరి యూరక నుండిరి

అని

సంశయము లేదు అజేయు లిద్దరు
సాగనంపవలె సగౌరవంబుగ
అని మది తలంచి యవనుడు పలికెను

యవనుడు

రాజును జనులకు, రాజులు మీరే
బ్రాహ్మణుల కెల్ల. బహుమతులిచ్చెను
ఊరేగించెను వారణములపై

ఉద్యోగమొసగె నాస్థానంబున
విప్రులు విచ్చల విడిగా సభలో
వేదము చదువుచు నైతిక విలువలు
పరిపాటింపక పండితుల నెల్ల
పరాభవించుచు కాలము గడపిరి

దుష్ట పండితుల దేశాటనము - జయపత్రములకు
వారు

ఒక దినమున రాజు దగ్గరకు జని
వేదము సొంతము చదివిన వారము
ఇటనే యుండిన ఏమి లాభమగు
దేశాటనంబు చేసెద మిటపై
వేద పండితుల వివాద మందున
జయించి గొనెదము జయపత్రికలను
అనుజ్ఞ నొసగుడు అత్యవసరమిది.
యవనరాజు విని ఆనందించెను
పర్యటించుటకు పరివారముతో
సాగనంపె కడు సంతోషముతో

దేశము లెన్నియొ తిరిగిరి విప్రులు
జయపత్రంబులు సమకూర్చుకొనిరి
త్రివిక్రమ భారతి వశించు కుమసి
గ్రామము చేరిరి । చేసిరి సవాలు
శాస్త్రకోవిదులు యతివరులు మీరు
మాతో సలుపుడు శాస్త్ర చర్చలను
అనుమానమున్న ఆలసింపకనె
జయించినామని జయపత్రు మిడుడు

భారతి పల్కె బ్రాహ్మణులారా
వేదము తెలియదు తెలిసినచోనే
రాజ సభలలో రాణింపును గని
సిరి సంపదలను చేకొని యుందును

సర్వము విడిచిన సన్యాసి నేను
నన్ను జయించిన ఇనుము డించునే
మీ కీర్తి యనిన । వారని రప్పుడు
లేరీ జగమున వేదపండితులు
చర్చలలో మము జయించు వారలు
వేదము తెలిసిన విద్వాంసు లెందు
గలరో తెల్పుము తరలెద మచటికి

ఆ దంభోక్తులు అహంకారమును
అడంచ దలచెను యతివరు డప్పుడు

త్రివిక్రమభారతి పండితులను గాణ్గాపురము గొంపోవుట

గాణ్గాపురమున గలడు యతివరుడు
నృసింహ సరస్వతి సకల విద్యా
కోవిదు డాతనితో వాదింపుడు

అంగీకరించి రాతని సలహా
త్రివిక్రమ భారతి యనుసరింపగా
గాణ్గాపురమున కేగిరి వారలు
పల్లకిని వారు పయనము సలుపగ
పాదచారియై భారతి వెడలెను
(ఆ క్షణముననే ఆయువు మూడెను
తెలియ లేరైరి గర్వాంధు లగుచు)

త్రివిక్రమ భారతి గురుమూర్తితో
సద్గురుమూర్తీ సంసారార్ణవ
పారము చేర్చెడి కరుణామూర్తీ
భక్తరక్షకా భద్రము గూర్చుము

అనుచు

పాదము పట్టెను భక్తి యుప్పొంగ

స్వామి

కౌగిలించుకొని కరుణామయు డనె
ఏమి కారణము ఎందుకీ రాక
సర్వము తెలుపుము సంశయింపకుము

భారతి పండితుల విషయము సరస్వతికి తెలుపుట

మదోన్మత్తులీ యిద్దరు విప్రులు
వేదములు నాల్గు చదివిన వారము
వాదములో మమ్మధిక్షేపించు
వారెవ్వరు లే రిలలో యనెదరు
జయపత్రమిచ్చి సన్మానింపుము
అని వేధించిరి అహంకారమున (నను విడువరైరి)
ఇచటకు వీరిని తెచ్చితి గురువర
భంగపరతురని పొగరడంతురని

నరసింహ సరస్వతి హితబోధ - పండితులకు

గురుమూర్తి నగుచు విప్రుల పిలిచెను
విప్ర వరులార మీరిట కెందుకు
వచ్చిరి? వాదన వలని ప్రయోజ
నమేమి నితరుల నపహసించుటే
విద్యకు ఫలమా? వ్యర్థము కాదా!

అనగా వారు

పండితుల మొండి పట్టుదల

ఓ సన్యాసీ భూమండలమును
పర్యటించితిమి వాదనలో మము
జయింప జాలక జయపత్ర మిచ్చి
సన్మానించిరి సపర్య జేసిరి
ఇచటకు తోడ్కొని వచ్చెను భారతి
వాదనలో మము పరాభవింపుము
వెనుకకు పంపుము వేచియుందు మిట

గర్వము విడువుడు గర్వ (పడుటచే) ము వలెనే
బాణుడు రావణుడును మృతి చెందిరి
అనంతమైనవి ఆ వేదంబులు
బ్రహ్మాదులకే పట్టుపడలేదు
కన్నులు తెరువుడు కనుడు సత్యమును
ఒక వేదమైన సాంగోపాంగము
తెలియుట కష్టము మీకెటు తెలియును
నాల్గు వేదములు! గర్వము మానుడు
నిజము తెలిసికొని ఇకపై మెలగుడు
గురుమూర్తి బోధ విప్రులు పెడచెవి
పెట్టిరి వాదము చేయుడు లేనిచొ
జయపత్ర మిండు । జాగు చేయకనె

గురుమూర్తి యనెను ఊరక గొప్పలు
పలుకుట తెచ్చును పలు పాట్లు మీకు

వేదములన్నియు సొంతము చదువగ
తలచినాడు ఋషి భరధ్వాజుండు
తపమాచరించె దర్శనమిచ్చెను
విధాత । ఓ ఋషి అదిగో చూడుము
వెలుగులు చిమ్మెడి పర్వతరాసులు
అవే వేదములు అనంతమైనవి
పూర్తిగ నాకును తెలియవు - చూడుము !
వానిని జూచెను ముని భీతిల్లెను
నా కవగతమగు భాగమె చాలును
దయతో నొసగుడు ధన్యుని చేయుడు

భరధ్వాజునకు నలువ యొసంగెను
మూడు పిడికెలు ముచ్చట తీరగ
అప్పటి నుండియు ఇప్పటి వరకును

సమగ్రంబుగా చదువలేదాయె
బ్రహ్మవరిష్టుడు భరద్వాజుండు

అన విని విప్రులు ఆ కధలెందుకు
వాదనకు రండు అది కాదన్నచో
జయపత్ర మొసగి చయ్యన పంపుడు
పత్రము లేకనె కదల మిట నుండి

స్వామి విప్రులను శిక్షింప సంకల్పించుట

అర్హులు శిక్షకు ఆలసింపకనె
దండింపవలెను ధర్మచ్యుతులను
నిశ్చయించి మది శిష్యునితో ననె

ఎలుకలు తెలియక సర్పము నుంచిన
బుట్టలో దూరి గిట్టు విధంబున
అగ్నిజ్వాలను ఆహారంబని
మిడుతలు దానను మడియు విధంబున
తమస్సులో పడి తమ తప్పెరుగరు
తమ మరణంబును తా తెచ్చుకొనిరి

మాతంగుని కథ - స్వామి లీల

అదే సమయమున ఆ వీధిగుండ
హరిజనుడొక్కడు అరుగుచుండగా
సామి చెప్పగా శిష్యుడు పిలిచెను
హరిజను డొచ్చెను వెలుపల నిలబడె
నీ జాతి ఏది నీ వెవ్వడవన

మాలపల్లిలో మనుగడ, నామము
'మాతంగుడు' కడ జాతి వాడ ననె
స్వామి

ఇచ్చెను ఒండము శిష్యున కప్పుడు
మాతంగుడున్న ఆ స్థలము నుండి
ఏడు గీతలను గీయుము పై పై
శిష్యుడు గీచెను చెప్పిన రీతిని

మైందుడ నేనని మొదటి గీటుపై (నిలబడి)
కిరాతుండ నని రెండవ గీటున
మూడవ గీటున ముచ్చటగ నిల్చి
గంగాపుత్రుడ కాపును నేనని
నాల్గవ గీటున నిలబడి యాతడు
శూద్రుడ నేనని ముందుకు పోయెను
ఐదవ గీటున ఆతడు నిలబడి
సోమదత్తుడను వైశ్యుడ నేనని
ఆరవ గీటున నిలబడి పల్కెను
క్షత్రియుడ నేను గోదావరి నా
నామము పెద్దగ నను భావించిరి
ఏడవ గీటున నీటుగ నిలబడి
వేదశాస్త్రముల విధ్యుక్తముగా
నేర్చిన వాడను పేరెన్నికగల
పండిత వర్యుడ గడించినాడను
యశమును సంపద ఆచార్యుడనై

కొంచెము భస్మము గురుమూర్తి యతని
శిరమున జల్లెను చెప్పినది నిజమె?

చదివితి నంటివి శాస్త్రము లెన్నియు
వీరితో నీవు సలుపుము వాదన
పరాభవింపుము వీరిద్దరినీ

అతడు వేదమును అనర్గళముగా
పలింపసాగెను పరికించి దీని

విప్రులు భయవిహ్వాలు లగుట - క్షమాపణ

వచ్చిన విప్రులు భయపడసాగిరి
మాట్లాడలేక మౌనము వహించి
గడగడ వణికిరి సడలెను ధైర్యము

సామి పాదముల సాష్టాంగ పడిరి
గురుద్రోహులము పరమ నీచులము

గర్విష్ఠులమై కనుమిను గానక
సంచరించితిమి సద్గురుమూర్తీ
కరుణామూర్తులు పరమ పావనులు
త్రిమూర్తి రూపులు విశ్వాతీతులు
మా అపరాధము మన్నింప వలెను

స్వామి దుష్ట పండితులను శపించుట

మీ రెందరినో పరాభవించిరి
ఆర్జిత పాపము ననుభవింపవలె
బ్రహ్మరాక్షసి బ్రతుకులు మీకిక
పండ్రెండేడులు పడియుండవలెను

అనంతరము

సద్బ్రాహ్మణుండు చదివెడి నారా
యణ సూక్తము విని నంతనె పిశాచ
రూపము నశించి పోవును అశాంతి
తొలగును భయరహితులరై మనెదరు

విప్రులు వెనుకకు మరలిరి సిగ్గున
చేరిరా నగర పరిసరంబులను
హృదయశూలతో మతులు చలించెను
అసువులు బాసిరి ఆ క్షణమందున
వికృతరూపులై రక్కసు లయ్యిరి
శాపసమాప్తిని సద్గతి నందిరి

మాతంగుడు నరసింహ సరస్వతిని ప్రశ్నించుట

వేదములన్నియు మదిలో మెదిలిన
మాతంగుడనియె । వేదము చదివిన
వాడనుగద ఈ పాడు జన్మ నా
కేల గలిగెనని గురుమూర్తి నడిగె

స్వామి

కర్మవిపాకము కారణము జనన
మరణంబులకని శాస్త్రము తెలుపును

కర్మకు జన్మకు గల సంబంధము
అవినాభావము అతి రహస్యమది

మాతంగునకు స్వామి సలహా

క్రిందటి జన్మలో మాతాపితరుల
తూలనాడితివి ఫలితముగా నీ
ఛండాలజన్మ సమకూరె నీకు
స్నానము చేయుము సంగమమునందు
పాపము నశించు వాసనలుడుగును
జన్మాంతరమున జన్మింతు వీవు
విప్రుని ఇంటను వేదవిదుడవై
ప్రసిద్ధి గాంతువు పూజింతురు నిను

మాతంగుని మొండితనము

సామీ నా పాపము నశించి పోయెను
మిము దర్శించిన మరుక్షణంబున
వేరొక జన్మను కోరుట ఏలను?
విప్రుని వలెనే నిపుడుంటిని కద
కరుణింపుడు నను, విప్రుని వలెనే
గడిపెద కాలము కాదన వలదనె
పరసువేదితో పసిడిగ మార్చిన
లోహము పొందునె ముందటి రూపము
ధనరాశి గనిన దరిద్రుని వలె
పచ్చని గరికెను స్వేచ్ఛగ మేసెడి
గోవు చందమున అపురూపంబగు
బ్రాహ్మణ రూపము బాయుట తగునా?
పట్టును వీడడు పరి పరి కోరును
అనుగ్రహింపుడు అనుగ్రహింపుడు

ఆ సమయంబున

అటకేతెంచిరి యాతని భార్యయు
సుతులును। నీ విటకేతెంచు టేల

నీ మతి సరిగా లేనటులున్నది
ఇంటికి పోదము ఇక బయలుదేరు

ఆ మాటలు విని ఆ మాతంగుడు
తరిమెను వారిని దూరము పొమ్మని

మాతంగుని భార్య వేడుకోలు

స్వామీ మీరే సరిదిద్దు డితని
మతిపోయినట్లు మాటాడుచుండె
ఇందరి బిడ్డల నే నెటు పోషణ
చేతును మరణమె గతి నాకిప్పుడు
అని మొరపెట్టెను ఆక్రోశించెను

స్వామి

దారాపుత్రులు నీ రాక కొరకు
వేచియున్నారు వేదన చెందుచు
సతీ సుతులతో సంతోషముతో
సంసారంబును సరిదిద్దుకొనుము
వారితో పొమ్ము ఆలసింపకుము

మాతంగుడు

సామి కరుణతో సజ్జనుడ నైతి
అధోగతిని బడి, అట నేనుండను
శరణము మీరే కరుణ జూడుడన

మాతంగుని శరీరమున జల్లిన భస్మము తొలగించుట

భస్మము చల్లిన ఫలమిది ఇంతటి
వివేక మలవడె వీనికి. భస్మము
తొలగించినచో మరచును సర్వము
భార్యాబిడ్డలు తలపునకు వచ్చి
ఇంటికి పోవును ఇది కల యనుకొని

వివేకహీనుడు పిసినారియైన

విప్రుని గొనిరావలెనని చెప్పిన
శిష్యుడు లుబ్ధుని తెచ్చెను తడయక
కలశములతోడ జలమును లుబ్ధుడు
గుమ్మరించగా గోరంతైనను
మిగులక తొలగెను విభూతి అంతయు
అచటి వారెల్ల అబ్బురమందగ

మాతంగుని
శరీర వర్ణము తొలిదశకు వచ్చె
మరుక్షణంబున మాతంగు డనియె
భ్రాంతిని జెందితి మతిపోయె నాకు
భార్యాసుతులను మఱచిన చెనటిని
మరలెద నింటికి ఆలసింపకనె
పరుగిడిపోయెను సడతిని చేరెను

విభూతి మహిమ

పరమ పవిత్రము భస్మము దానిని
శివుడు ధరించును చిన్మయ మిదియని
విభూతి మహిమను విడమరి చెప్పుట
సాధ్యము కాదది శేషున కైనను
ఐశ్వర్యప్రద అపమృత్యుహారి

విభూతి మహిమను గూర్చి గాయకుడు.
చెప్పవలెను - (అనుబంధము చూడుము)

నలువైపులకును గురుమూర్తి మహిమ
వ్యాపించెను జను లపరిమితముగా
వచ్చిరి సామిని దర్శించుటకై
కష్టముల నుండి కాపాడుడనుచు
సాష్టాంగ నమస్కారము చేతురు
ఆశీశులు గొని ఆనందింతురు
దరిద్రులెందరొ ధనవంతులైరి

సంతతి కలిగెను వంధ్య లెందరికో
అంధుడు చూపును పొందెను తృటిలో
సామిని జూచిన సజ్జనుల కెల్ల
సర్వార్ధంబులు సమకూరుచుండె

గోపీనాధుని కధ

బాల్యము - వివాహము

విప్రుడు ధనికుడు గోపీనాధుడు
వశించు చుండెను వంశీయులతో
మాహురపురమున మన్నన లందుచు
పుట్టిన బిడ్డలు గిట్టిన రందరును
దత్తాత్రేయుని దంపతు లిద్దరు
ఆరాధించిరి అహర్నిశంబులు
చక్కని పుత్రుని మాకొసగుమయ్య
భక్తవత్సలా! వరదాయక యని
పూజలు చేసిరి నిశ్చల భక్తిని

పుత్రుడు కలిగెను సంతోషించిరి
జరిపిరి ముచ్చటతీరగ నతనికి
ఉపనయనంబును వైభవంబుగా
శాస్త్రకోవిదుల ఆశీశులతో
పెండ్లిని చేసిరి బాల్యము నందే

బాల దంపతులు అరక్షణమైన
ఒకరి నొకరు విడువక యుండుట గని
మాతాపితరులు సంతోషించిరి

కాలము హాయిగ గడచు చుండగా

బాలుడు వ్యాధి పీడితుడగుట

విధి వక్రించెను వ్యాధికి లోనై
బలహీనుండై బాలుడు పరుండె
పేరుగు వైద్యులు చేసిరి చికిత్స
వ్యాధి శమించక అధికంబయ్యెను

ఆహార మన్న అసహ్యమాయెను
బ్రతిమాలినచో కొద్దిగ ముట్టును
ఆతని సతియును అన్నము ముట్టదు
తానును పతి వలె తినునతి కొద్దిగ

సావిత్రి సపర్యలు భర్తకు

తన పతి సపర్య తానే చేయును
నిద్రపోదామె పతికడ నుండును
ఆభరణంబుల నామె ధరింపదు
పాటింపదామె బంధువుల మాట
పతితో పాటుగ సతి నీరసపడె
జపహోమంబులు జరిపిరి పెక్కులు
వ్యాధి నివృత్తికి ఫలితమే లేదు
బాలుని దేహము భరింపజాలని
వాసన కొట్టెను ఆశలు విడిచిరి

తలి తండ్రు లపుడు దత్తుని తలచిరి
సామీ ఏమీ । సంకటము మాకు
మీ కరుణ వలన ఈతడు పుట్టెను
అసువులు బాసిన నశించు వంశము
భయమును బాపుము భద్రము కూర్చుము
పరి పరి విధముల ప్రార్థించినారు

బాలుడు తలితండ్రులను భార్యను ఊరడించుట

మదిలో నాకై వేదన మానుడు
ఋణానుబంధము మనకిక చెల్లెను
భగవంతు నెపుడు భజించుచుండుడు
వరదుడు దత్తుడు రక్షణ యొసగును

కష్టము లెన్నియొ కలిగె నావలన
క్రిందటి జన్మను శత్రు డనేమో
కొద్ది దినములే బ్రతికి యుండెదను

నీ కిష్టమైన నిటనే యుండుము
నా తలితండ్రులు పుత్రుని వలెనే
ఆదరించెదరు వాత్సల్యముతో
ఇష్టము లేనిచొ ఏగుము పుట్టిన
ఇంటికి సుఖముగ నుందుము నీవట
జరిగినదంతయు కలగా నెంచుము
నీ సౌందర్యము నీ సౌభాగ్యము
నశించె నన్నియు నా కారణమున

సావిత్రి - పతివ్రతా ధర్మము

ఆ మాటలు విని ఆ యమ మూర్ఛిలె
కొద్దిగ తేర్కొని పడి పాదముపై
తన శిరము నుంచి తాననె మెల్లగ
భార్యను పాడియె పరిత్యజించుట
సతులకు పతియే సర్వస్వంబును
పరమ ధర్మమది శాస్త్రచోదితము
మీ దేహము కడ నా దేహముండు
నే పో నెచటికి మీతో నుందును

కోడలు పల్కిన మాటలు విని యా
అత్తయు మామయు అధిక దుఃఖమున
నేలపై కొరిగి విలవిల లాడిరి
వారితో ననెను మెల్లగ కోడలు

సావిత్రి గాణ్గాపుర ప్రయాణము

చింతను మానుడు జీవించును పతి
అనుజ్ఞ నొసగుడు అరిగెద గాణ్గా
పురమునకు నేను భర్తతో కూడి
నరసింహయతిని గురువరుని నేను
శరణము జొచ్చెద సర్వరోగములు
వారి దర్శనము హరింపజేయును
ఆ గురుమూర్తిని ఆశ్రయించెదను
అనుజ్ఞ నొసగుడు ఆలసింపకుడు

అత్తయు మామయు అనుజ్ఞ నొసగిరి
కోడలు నమ్మిక దృఢమైనదనుచు
సంశయము వీడి సమ్మతి తెలిపిరి

అత్త మామలు

సావిత్రికి వలె జయంబు కలుగును
నీ రాకకు మే మెదురు చూచుచూ
నిటనే యుందుము । నిరంతరంబును
చిత్తము నందున దత్తుని తలచుచు
చిరంజీవ యని దీవించి రపుడు
ఆందోళికలో వ్యాధిగ్రస్తుని
కూర్చుండబెట్టి కొద్ది పరిజనుల
వెంబడింపగా వెడలిరి గాణ్గా
పురమున యతివరు నాశ్రయింపగా

పల్లెలు అడవులు పట్టణంబులును
దాటిరి భీమా తటమును చేరిరి
ఆందోళిక నట క్రిందికి దింపిరి
తెరలను మెల్లగ తొలగించి చూడ
అంతిమ దశలో పతిని తా గాంచె
మరుక్షణంబున మరణించె నతడు

సావిత్రి భర్త మరణము

హాహారవములు ఆకస మంటెను
ఆత్మహత్యకై కత్తిని గైకొని
సిద్ధము కాగా ఇది తగదు నీకు
అని అచటి వారు అడ్డుపెట్టగా
విలపించె నామె భోరున । ఆహా
గుడిలో పూజకు అడుగిడి నంతనె
గుడి కూలి వారు మడయు విధంబున
ఎండకు భయపడి నీడకు చేరిన
పాంథుడు వృక్షము పడి సమసినట్లు

నీటిని కుడుచగ నేటికి ఏగిన
మొసలికి చిక్కిన ముద్దరాలి వలె
నా బ్రతుకున్నది నా కర్మఫలము
పరమ పాతకిని తల్లి బిడ్డలను
దూరము చేసిన దోషం బేమో
అని దుఃఖించుచు ఆమె యుండగా

గ్రామవాసులు సావిత్రిని ఊరడించుట

గ్రామవాసు లట కరుదెంచినారు
మెల్లగ బలికిరి తరుణీమణితో
విచారము మాని వివేకమతివై
ధైర్యము బూనుము దైన్యము విడువుము
మరణ కారణము కర్మఫలంబని
చెప్పను శాస్త్రము తప్పదు మరణము
దాని నివారణ మనకు సాధ్యమా?

సావిత్రి గ్రామవాసులతో తన కథ చెప్పుట

నా కథ చెప్పెద నాకర్ణింపుడు
చిన్నతనంబున మిన్నగ జేసితి
శివ పార్వతులకు సేవ లెన్నియో
వివాహ మాయెను విడువక చేసితి
గౌరీపూజలు గణనీయముగా
వ్రతములు చేసితి యాత్ర లొనర్చితి
అన్నియు నిష్ఫల మయ్యెను గదరా
మిగిలిన దీ గతి ఇక జీవింపను
నా భర్తయె గద నా సర్వస్వము

అని

భర్త శవముపై పరుండె నా సతి
తలి తండ్రులకా దూరము చేసితి
సుతు డొకడే యని ఎంతో ముద్దుగ
ఈతని పెంచిరి ఇతడే గతి యని
వృద్ధాప్యంబున ఆదుకొందు డని.

ఈ వార్త వారు వినిన క్షణమున
ప్రాణము విడుతురు వారి చావునకు
నేనే కారణ మని నిందింతురు
బాల విధవనై బ్రతుకుట కంటెను
చచ్చుట మేలది । చిచ్చున పడెదను

ఆరోగ్యము సరియగునను ఆశతో
వచ్చితి నిచటకు విధి వక్రించెను
అని రోదించెను అమిత దుఃఖమున

యోగి సావిత్రికి తత్త్వము బోధించుట

అదే సమయమున నటకేదెంచెను
భస్మరుద్రాక్ష భూషితు డొక్కడు
శూలము ధరించి చిత్రముగ నుండె
దరహాసముతో దగ్గరగ నిల్చి
మూర్ఖురాలి వలె దుఃఖింప వలదు
ఎన్ని దినంబులు నీవేడ్చిననూ
బ్రతుకుట సాధ్యమె? మదిలో నెంచుము
ఎంత వానికిని మృత్యువు తప్పదు
తెలియును నీకిది విలపింప నేల
కట్టెలు నదిలో కలియు నట్టులే
పక్షులు వృక్షముపై చేరు నటులు
కలియుదు మిచ్చట మరుక్షణంబున
వేరగుచుందుము మీ కథ ఇట్టిదె

కర్మఫలంబున కలుగును దేహము
పంచభూతముల పరిణామంబిది
పుట్టును గిట్టును మట్టిని కలియును
భ్రమలకు లోనై పలు విధములుగా
పతియని సతియని సుతులని దలచుచు
మమకారముతో మాయకు లోనై
జనులు చరింతురు సంసారంబున

సత్వరజస్తమసంబులు మూడును

మాయాగుణములు మదిలో గనవలె
వాటిని దాటిన వాని చిత్తమున
భ్రాంతులు తొలగును శాంతి నెలకొనును
బ్రహ్మాదులకే ప్రళయము తప్పదు
మానవ మాత్రుల మనమొక లెక్కయె
వివేకవంతులు చావు పుట్టుకలు
సమముగ జూతురు విజ్ఞత మెరయగ
బాల్యము నందునె మరణించు నొకడు
యవ్వనమున నొక డసువులు బాయును
వార్ధక్యంబున మరణించు నొకడు
దీనికి కారణ మేమై యుండును
నీ గత జన్మలు ఎన్నో ఎరుగవు
ఎందరి భర్తల నెందరి సుతులను
బడసియుంటివో బాధలవెన్నో
జ్ఞాపక మున్నవె? ఇప్పటి దుఃఖము
కర్మఫలంబని పరికించి చూడు

సావిత్రి యోగీశ్వరుని ముందు మార్గము తెలుప వేడుట-శరణు జొచ్చుట

వివేకమబ్బెను వీడెను మోహము
నమస్కరించెను అమ్మహనీయుని
తరింపు మార్గము తెలుపుము నాకన
సదయ హృదయుడా సామి ఇట్లనెను

స్థిర చిత్తముతో విధవా ధర్మము
నాచరింపవలె నమిత దీక్షతో
అని తన హస్తము ఆమె శిరంబున
హత్తెను మెల్లగ ఆ మహనీయుడు

తల్లియు తండ్రియు మీరే నాకిక
మీరే బంధువు మీరే గురువులు
విధవా ధర్మపు విధు లతి కష్టము
బాల వితంతువు బాధలు పెక్కులు

నిందల పాలై కుందును మదిలో
సహగమనంబే సమ్మతము నాకు

గురుమూర్తిని గని భర్తరోగమును
కుదుర్చు కొనుటకు కొనివచ్చినాను (భర్తను)

యోగివరుడు సావిత్రికి చెప్పిన సలహా

కాలము జయింప గల ప్రభావము
గురుమూర్తులకే కలదని తెలియుము
వారిని ముందుగ దర్శనము చేసి
సహగమనంబును శాస్త్ర విహితముగ
చేయుము నిశ్చల చిత్తము తోడను
రుద్రాక్ష లివిగో నాలుగు, రెంటిని
శవము చేతులకు, రెంటిని మెడలో
కట్టుము, గురువుల కటాక్ష వీక్షణ
పొందుటకు వారిని దర్శింపవలె

నీవు

గురు దర్శనమున కలిగిన వేళను
గురుపాదములకు రుద్రముతో నభి
షేకము జరుగును, కైకొని తీర్థము
కొద్దిగ నీపై కొద్దిగ శవమున
జల్లుము.ఆపై శాస్త్రవిహితముగ
వాయనము లొసగి దానములు చేసి
సద్విజవరులను సంతోష పరచి
సహగమనంబును శాంతిగ జేయుము
ఏ యుద్వేగము నీ కుండరాదు
తరించు మార్గము తగిన విదేయని
అచ్చోటు వీడె నా యోగివరుడు

సావిత్రి సహగమనమునకు ఏర్పాట్లు చేసికొనుట

పిలిపించె నామె పేరెన్నిక గల
సద్బ్రాహ్మణుని విషయము వివరించె

స్నానము చేసెను ఆభరణంబుల
ధరించి అగ్నిని తా పట్టుకొనెను
ముందుగ కడచెను పతి మృతదేహము
గొనిపోయి రామె వెనుక నెమ్మదిగ

నదీ తీరమున సిద్ధము చేసిరి
సహగమనమునకు శాస్త్రవిహితముగ
సర్వము । వేనకు వేలుగ నచ్చట
జనులు గుమిగూడి చర్చించుకొనిరి

సావిత్రిని చూచి జనులు

కారుణ్యముతో తనరారుచుండె
కఠోర దీక్షను కాంత బూనినది
అనితర సాధ్యము । అబ్బురము గొల్పు
సౌందర్యంబును మదిలో నెంచక
సహగమనమునకు సంసిద్ధమాయె
అగ్నికి అసువులు అర్పించుట వృధ
ఇంటికి పొమ్మని చెప్పుట మంచిది

నదీతీరమున చితి పేర్చినారు
శవమును తెచ్చిరి సంస్కరించుటకు
మూసివాయనము లొసగెను ఆ సతి
ద్రవ్యము విరివిగ దానము చేసెను
తండ్రి శంకరుడు గౌరి నా తల్లి
ఇంటి కేగెదను ఈప్సిత సిద్ధికి

తనతో వచ్చిన జనులతో ననెను
ఉన్నామిచ్చట సుఖముగ మేమని
అత్తమామలకు చిత్తము లలరగ
తెల్పుడు తడయక, చెప్పకున్నచో
వారిని చంపిన పాపము వచ్చును

సహగమనమునకు ముందు సావిత్రి గురుమూర్తిని దర్శించుట-

గురుమూర్తిని గని త్వరగా వచ్చెద
అనుజ్ఞ యిండన, ఆ బ్రాహ్మణు డనె
త్వరగా రావలె నాలసింపకుము

గురు దర్శనమునకు పరుగున పోయెను
సర్వము మీరే సద్గురువర్యా
అని మది దలచుచు సర్వము మరచెను
వనిత లెందరో వచ్చి రామెతో

సావిత్రి తనలో

మహిమాన్వితు లని మదిలో నమ్మితి
పరమేశ్వరులని భావించినాను
రోగము లన్నియు వేగమె బాపెడి
భద్రమూర్తులని భావన చేసితి
ఇచటకు వచ్చితి । ఇరువది పల్లెలు
దాటి వచ్చితిమి దర్శనము కొరకు
శరణము వేడితి కరుణ జూడమని
భక్తవత్సలా భవభయహారీ
నా ప్రారబ్ధము నను వెంటాడెను
సంగమము జేరె । సామి యుండె నట
ఆశీనుండై అశ్వత్థము కడ
నమస్కరించెను నతశీర్షముతో
సౌభాగ్యవతీ యని దీవించెను
ఎనిమిది సుతులను కనెదవు నీవసె

ప్రక్కవారపుడు పక్కున నవ్విరి

స్వామితో జనులు సహగమనమును గూర్చి చెప్పుట

పతి మరణించెను నదీ తీరమున
శవమును దింపిరి, సహగమనమునకు

సంసిద్ధంబై నిచటికేతెంచె
తమ దర్శనమును తా జేయుటకై
స్థిర సౌభాగ్యము కలిగియుండగా
యీ రమణి భర్త మరణించు వేల

స్వామి శవమును సంగమము వద్ధకు తెమ్మనుట

సత్యమె పలికితి శవమిపు డిచటకు
తీసుకు రావలె చూచెద దానిని
తెచ్చిరి శవమును ఆ క్షణముననే

అదే సమయమున అభిషేకించిరి
విప్రులు ముగ్గురు గురునిపాదములు
రుద్రము చెప్పచు విధి విహితముగా
పాదతీర్థమది పరమ పావనము
సకల పాపముల శమింప జేయును

బంధముల విప్పి వస్త్రము తీసిరి
శవమంతటిపై జల్లిరి తీర్థము
స్వామి చూచె నా శవమును కృపతో

సావిత్రి భర్త బ్రతుకుట

శవమున కలిగెను చలనము తృటిలో
నిద్ర నుండి తా మేల్కొని నటులే
ఎట నుంటిని, నే కట్టిన యుడుపులు
ఎటు మాయమయ్యె ఏమీ చిత్రము
ఆతని కిచ్చెను వస్త్ర మతని సతి
దాని ధరించెను తడయక పల్కెను

ఈ యతివర్యుడు ఎవరై యుండును
ఈ గాఢ నిద్ర ఎట్లు కల్గినది
ఎందులకు నన్ను మేల్కొలుప లేదు

సావిత్రి

జరిగిన దంతయు సవిస్తరంబుగ
భర్తకు చెప్పెను । గురుకృప వలనవె

వ్యాధి హరించెను భయంబు తొలగెను
మన మిద్దరమును ధన్యుల మైతిమి
సద్గురు మూర్తులు చల్లగ చూచిరి
వీరే మనకిక శరణంబనుచును
సామి పాదముల శిరములు వంచిరి
ఆనందాశ్రుల నాపాదములను
తడిపిరి దయతో దరిచేర్చినారు

జనులు - దంపతులు స్వామిని స్తుతించుట

జయము జయము హే సద్గురుమూర్తీ
సచ్చిదానంద సర్వవ్యాపక
త్రిమూర్తి రూపులు మము కరుణించిరి
శివ స్వరూపులు చిన్మయరూపులు
ధర్మము నిలలో నెలకొల్పుటకై
అవతరించినా రమృతసమానులు
సర్వభూతాంతరవర్తులు మీరు
మిము సేవించుచు మీ కడ నుందుము
అనుగ్రహింపుడు అరయుడు దయతో
కాపాడుడు మము కన్నతల్లి వలె
అని గురుమూర్తిని అపార భక్తిని
ప్రార్థన చేసిరి పరవశ మందిరి

స్వామి

దోషము లన్నియు నశించె నిప్పుడు
ఎనిమిది సుతులను కనెదవు భావిని
శుభంబు మీకగు సుఖింతురికపై

జయము జయము నరసింహ సరస్వతి
జయ జయ మహాత్మ సద్గురువర్యా

జయధ్వానములు చేయుచు నరిగిరి
అచటకు వచ్చిన అశేష జనములు

పరమేశ్వరుడే గురుమూర్తి యనుచు
బ్రతికించినారు మృతుడైన వాని
అత్యద్భుతమిది అపూర్వ మియ్యది

గడసరి అడిగిన ప్రశ్న

అతడొక గడసరి, అడిగెను సామిని
లలాట లిఖితము అలంఘ్య మందురు
కాలమృత్యువే కలిగె నీతనికి
అపమృత్యువు కాదైన బ్రతికెను
దీని రహస్యము తెలుపుడు దయతో

స్వామి చెప్పిన వివరణ - మృత్యువుని గూర్చి

ఇతనికి ముప్పది వత్సరంబులే
బ్రహ్మలిఖించిన ఆయువు. మరుసటి
జన్మను లిఖించె శతవత్సరములు.
శతాయుష్కుడై చరించు నిప్పుడు
మరుజన్మంబున మరణించు నితడు
ముప్పది వత్సరముల వయస్సునవే
శాస్త్రము మార్చను సమ్మతించునని
గురుమూర్తి తెల్పె, పరమ రహస్యము

సద్గురుమూర్తులు సర్వసమర్థులు
పరబ్రహ్మమే నిల నవతరించె
స్మరించి నంతనె సర్వ కార్యములు
ఫలించు తృటిలో పరమ సత్యమిది

దంపతులు స్వామితో మఠమునకు వచ్చుట

సంగమ మందు స్నానము చేసిరి
పరమ భక్తితో గురుమూర్తి కపుడు
సాష్టాంగ నమస్కారము చేసిరి
పూజలు చేసిరి। కూర్చుండి రచట

సూర్యాస్తమ మగుచుండగ వారును
సామితో పాటు సాగిరి మఠముకు

దయాసాగరుడు తమపై చూపిన
అపార కరుణను అనుగ్రహంబును
తమ మది తలచుచు తన్మయులగుచును

మరునా డుదయము గురుమూర్తి వద్ద
చేతులు మోడ్చిరి। మదిలో మాకొక
సంశయమున్నది సామి తీర్చవలె
సావిత్రి యడిగె సవినయంబుగా

సావిత్రిని సంశయము స్వామి తీర్చుట

దుఃఖించు నపుడు నాకడకు వచ్చె
యతివరు డొక్కడు హితము బోధించె
రుద్రాక్ష లొసగె। యతివరు లెవ్వరు
పాదాభిషేక, పవిత్ర జలమును
శవముపై జల్లి శాంతి పొందుమనె

స్వామి

ఆ రూపము నే ధరించి వచ్చితి
నీ భక్తిని ధృడదీక్షను మెచ్చితి

రుద్రాక్ష మహిమ

రుద్రాక్ష మహిమ అద్భుతమైనది
ఆ కథ చెప్పెద ఆకర్ణింపుము
(గాయకుడు రుద్రాక్ష మహిమను గూర్చిన కథను
చెప్పవలెను - అనుబంధము చూడుము)

సోమవారవ్రత మహిమను తెలిపెను
సత్సంతానము సౌభాగ్యంబును
ఐశ్వర్యంబును అనుభవింతు రిక
ఆశీర్వదించి అభయ మొసంగెను

సావిత్రి అత్తమామలు రాక - స్వామిని పూజించుట

అదే సమయమున అచటకు వచ్చిరి
పుత్రుని జూడగ తల్లియు తండ్రియు

ఆతృత పడుచును జరిగిన దంతయు
విని వారాశ్చర్య నిమగ్నులైరి
సలిపిరి పూజలు సద్గురువరునకు
అనన్య భక్తిని అభిషేకించిరి
రుద్ర సూక్తముల యతివరు పదములు,
సమారాధనలు చక్కగ నెరపిరి
దక్షిణ లొసగిరి దానము చేసిరి
అనుజ్ఞ గైకొని అరిగిరి యూరికి
ఓం గురు జయగురు ఓం గురు జయగురు
మంత్రమును మదిని మననము చేయుచు

ఎనిమిది సుతులను కనెను సావిత్రి
సద్గురు కృపయే సర్వంబనుచును
విశ్వాసముతో వశించుచుండిరి
గాణ్గా పురమేను కాశిగ తలచిరి
గురుదర్శనమును మరువరు చేయుట
ప్రతి వత్సరమును పరమ భక్తితో

యాయవారము జీవనముగా గల విప్రుని కథ

గాణ్గా పురమున గల డొక విప్రుడు
పరిగ్రహింపడు పరుల దానమును
ఆరగింప డాహారాదు లెపుడు
ఇతరుల ఇండ్లను। నియతిని తప్పడు
బహు శాస్త్ర విదుడు పరమ విరాగియు
యాయవారమే అతని జీవనము
నిత్య సంతోషి నిర్మల హృదయుడు

అతని భార్య

అతని చర్యలను అభిమానింపదు
ముఖము ముడుచుకొని మూల కూర్చుండు
కోపముతోతా కుతకుత లాడును
తీరని కోర్కెలు కలవరపెట్టును

ఆ గ్రామంబున అనునిత్యంబును
సమారాధనలు చక్కగ జరుగును
దక్షిణ లిత్తురు దానమొసగెదరు
పక్వాన్నంబులు భక్ష్యభోజ్యముల
రుచులను విప్రులు మెచ్చుట విని తా
కోరును విందుకు పోవలె ననుచును

బిచ్చమెత్తి పతి తెచ్చిన బియ్యము
వండుకుని తిని బ్రతుకుట వ్యర్థము
దురదృష్టము నను వరించె నేమో
సుఖమన నేమో సుంతయు నెరుగను
భర్త దరిద్రుడు అతని పెండ్లాడి
దారిద్ర్యంబును వరించితిని నే
పురజను లందరు ఉత్సాహముతో
సతీ సుతులతో సమారాధనల
తృప్తిగ భుజించి దక్షిణ గైకొని
హాయిగ నుందురు నా యీబ్రతుకో
అని ఏడ్చునామె అనయము తనలో

దంపతులకు సమారాధన ఏర్పాటు

ధనికుడు విప్రుడు తలపెట్టినాడు
సమారాధనము చాటించినాడు
సతీసుతులతో సమారాధనకు
అందరు రావలె తృప్తిగ భుజించి
దక్షిణ గైకొని ధన్యుని చేయుడు

ఈ పిలుపుని విని ఎంతో ముదమున
మానిని పతితో మన మిద్దరమును
భుజింప పోదము భూరిదక్షిణలు
గైకొని వత్తము రాక తప్పదనె
కొర్కె తీర్చుమని పరిపరి వేడెను

సతి కోరికలను పతి తీర్చుటయే
పరమ ధర్మమని పండితులందురు
ఇష్టము లేనిచో నేపోయెద ననె
సరి నీ ఇష్టము అరుగుము నీవనె

సమారాధన చేయు విప్రునితో

నా భర్త రారు నే వచ్చెద నన
రావలదు నీవు రమ్ము భర్తతో
అనగా నా యమ అతి దుఃఖముతో
నరసింహ సరస్వతి వద్దకు జని
స్వామీ నా పతి నా మాట వినడు
సమారాధనము జరుగుచున్నదిట
వస్త్రము లిత్తురు దక్షిణ లిత్తురు
దంపతులు కలిసి రావలె విందుకు
అని ప్రకటించెను ఆ ధనవంతుడు
కోరిక యున్నది ఆరగింపగా
విందు భోజనము సద్గురు మూర్తీ!
నా సతి నాజ్ఞాపింపుము "విందుకు
సతితో నేగుము ఎదురాడ వలదు'

స్వామి విప్రుని భార్య కోరిక తీర్చుమనుట

భార్య కోరికను తీర్చుట ధర్మము
విందారగింప సతితో నేగుము
గుర్వాజ్ఞ దీని గౌరవింపవలె
అన విని సామీ వినవలె మనవిని
పరాన్నమును నే కోరనెన్నడును
ఈ నియమంబును నే పాటింతును
గుర్వాజ్ఞ నెపుడు గౌరవింపవలె
నియమోల్లంఘున భయముండ దనుచు
శాస్త్రము చెప్పను । సామీ ఇపుడే
విందుకు నేగెద సతికోరినటులు

భార్యయు భర్తయు అరిగిరి విందుకు
సత్కారమంది సంతోషముతో
ఆశీనులైరి భోజన పంక్తిని
వడ్డన లయ్యెను వరుస క్రమమున
భుజింప గడగిరి వచ్చిన విప్రులు
ప్రక్కకు చూచెను బ్రాహ్మణి, కాంచెను
పందులు కుక్కలు పంక్తిని యుండుట
ఛీ అని అరచుచు ఛంగున నిలబడె

విప్రుని భార్య పంక్తిలో పందులు కుక్కలు భుజించుట చూచుట

కుక్కలు పందులు పంక్తిని యున్నవి
ఉచ్ఛిష్టము తినకూడదు పోవుద
మింటికి ఇట మీరుండుట తగదని
భర్తతో నామె పరుగిడి పోయెను
గురుమూర్తి కడకు భోరున ఏడ్చుచు

గురుమూర్తి

నీ మనోరథము నెరవేరినదా!
అని సామి యడుగ మిన్నక యుండెను
విప్రుని సతి కడు విషాదమందుచు

స్వామి విప్రుని ఊరడించుట

అనయము నా సతి అనుచిత వాంఛలు
మదిలో పరిపరి మననము చేయును
దుర్మార్గురాలు దుష్టబుద్ధిలే
నియమము లన్నియు నేడు భంగపడె
కరుణింపుడు నను చల్లని చూపుల

స్వామి

నీ సతి కోర్కెను నెరవేర్చినావు
నీకే దోషము ఈ కారణమున
వాటిల్లదు నీ మాటనె నీ సతి
అనుసరించు నిక అనుమానింపకు

గురుమూర్తి తెలిపె విప్రుని కప్పుడు
గృహస్థ విధులను గృహిణి ధర్మమును
ధర్మసూక్ష్మముల మర్మము లెన్నియొ
ఎవరింట భుజింపవచ్చునో ఎచట
భుజింప రాదో బోధించె నపుడు

భాస్కరుని కథ

భాస్కరుడు స్వామికి భిక్ష తలపెట్టుట

గాణ్గాపురమున అన్నదానములు
తెరపి లేకనే జరుగుట చూచెను
భాస్కరుడను నొక బ్రాహ్మణ భక్తుడు
భిక్షను సామికి చేయ దలంచెను
సంభారంబులు సరిపడు ముగురకు
మూట కట్టుకొని యటకేతెంచెను
సామి పదములకు సాష్టాంగపడెను
మఠమున వశించె మనసులోని తన
కోర్కె నడచుకొని కాలము గడిపెను

తనలో

కొద్దిపాటి సరకుల నే తెచ్చితి
సామి భిక్షకవి సరిపడవు గదా!
సామికి భిక్షను చక్కగ చేసెడి
భాగ్యము లేదని పరిహాసమునకు
లోనైతి ననుచు పరి పరి విధముల
చింతలు చుండును చేయునది లేక
ఎన్నో దినములు మిన్నక యుండెను
నిద్రరాక తా నిటు నటు తిరుగును
రాత్రి సమయమున మది దుఃఖించుచు

స్వామి భాస్కరుని కోర్కె తీర్చదలచుట

సర్వజ్ఞులు గురుమూర్తులు భాస్కరు
కోరిక తీర్పగ దలచిరి। ఓయీ

రేపటి దినమున చేయుము భిక్షను
అన విని భాస్కరు డానందించెను
మరునాడుదయము త్వరగా మేల్కొని
స్నానము చేసెను సంగమము నందు
పక్వము చేసెను పదార్థంబులను

ఆ దినముననే సద్గురు మూర్తిని
భిక్షకు రమ్మని పిలిచె వేరొకరు

స్వామి

భాస్కరుడు పిలిచె భిక్ష కీనాడు
వీలుపడ దనుచు వారిని పంపెను
విషయము తెలిసెను శిష్యు లందరకు
భాస్కరుని భిక్ష। భళిరా తినుటకు
మెతుకైన రాదు ఈ దినమున మన
కుపవాసంబే తప్పని సరిఇది
పరిహసించిరా భాస్కరు నందరు
సామి గ్రహించెను సర్వజ్ఞు డతడు

స్వామి శిష్యులతో

ఎప్పటి వలెనే ఈ దినము కూడ
సకుటుంబముగా సరగున రావలె
నాతో బాటుగ విందారగింప

శిష్యులు తమలో

సామివారి కడ సంభారంబులు
ఉన్నవి దండిగ వాని వండించి
భోజనము పెట్టు భుజింప వచ్చును
అని మది తలచిరి ఆనందించిరి

స్వామి భాస్కరునితో

నదీ తీరమున నుండు విప్రులను
స్వామి మాటగా సగౌరవంబుగా

"మీరు రావలెను ఆలసింపకుడు
విస్తరులు వేసి వేచియున్నారు"
అని వారందరి నాహ్వానింపుము

భాస్కరుని జూచి పకపక నవ్విరి
నీ పాకముతో భిక్షను చేయుము
పిలువకు మితరుల. మా రాకకు
వేచి యుండకుము. వచ్చిన దారిని
వెడలుము నీవన కడు దుఃఖముతో
భాస్కరుడు వచ్చి పలికె సామితో

స్వామీ వారు గృహములకు పోయెద
మచటనె భుజింతుమని బల్కినారు
నిరాశతో నే నిటకేతెంచితి
అని మిన్నకుండె అవనత ముఖుడై

స్వామి కబురంపగా బ్రాహ్మణులు భోజనమునకు వచ్చుట

బ్రాహ్మణులందరు పంక్తిని గూర్చుని
నాతో బాటుగ నారగింపవలె
ఒంటరిగ నేను భుజింప నెప్పుడు

సామి వారపుడు శిష్యుని పంపిరి
నా సహపంక్తిని భుజింపరావలె
రమ్మను వడిగా సామి చెప్పెనని

బ్రాహ్మణు లందరు భక్తిభావమున
స్నానము ముగించి సరగున వచ్చిరి

భాస్కరుడు

స్వామి చెప్పగా నాహ్వానించెను
చేతులు మొగుడ్చి । భుజింప రావలె
సతీ సుతులతో. అంతయు సిద్ధము
వచ్చిన వెంటనె వడ్డన జరుగును

ఈ మాటలు విని ఎకసకియమాడి
సిగ్గు లేక పిలిచితి వేలను మము
ఈ వంటకములు ఎట్లు సరిపోవు
ఇందరి జనులకు ఎందుకీ పిలుపు

కొందరు

సద్గురు మూర్తులు సర్వ సమర్థులు
పరిహసింపకుడు భాస్కరు నిప్పుడు
వరుస వరుసలుగ కూర్చుండి రపుడు
బ్రాహ్మణు లందరు భార్యాసుతులతో
పూజించె గురుని భాస్కరు డప్పుడు
సర్వోపచారముల కడు భక్తిని
భారము మీదని హారతి నిచ్చెను

గురుమూర్తి లీల - ముగ్గురకు సరిపోవు వంటకములు నాలుగు వేలమందికి సరిపోవుట

పాకములన్నియు పాత్రలతో సహ
తెమ్మించుటకు నా సమక్షంబునకు
భాస్కరుడు తెచ్చి పాత్రల నుంచెను

స్వామి యొసంగెను శాటిక యతనికి
పాత్రలపై నిది పరచుము పూర్తిగ
పాత్ర లన్నిటిని భాస్కరుడు కప్పె
చల్లిరి స్వామి జలము వాటిపై
అటుపై బరపిరి అమృతదృక్కులను
వస్త్రము తీయక వడ్డింపు మనిరి

ప్రారంభించిరి వడ్డన తదుపరి
ఎంత తీసినా ఎప్పటి కపుడే
పాత్రలు నిండుట కొందరు చూచిరి
పరుగిడి వచ్చిరి వడ్డన చేయగ

యథేష్టంబుగా నారగింపవలె
బిడియము మానుడు అడిగి వడ్డించు
కొనుడని భాస్కరు డన విని విప్రులు
కడుపార తిని బడలితిమయ్యా
తృప్తిని గంటిమి అపురూపంబీ
సమారాధనము సద్గురుని లీల
అని వారరిగిరి ఆనందముతో

గ్రామము నందలి బ్రాహ్మణులందరు
స్త్రీలును బాలురు పిలుపు నందుకొని
భుజించి వెడలిరి ముచ్చట పడుచును

ఇతరులందరును ఇటకే వచ్చిరి
కడుపారగ తిని ఇండ్లకు వెడలిరి

స్వామి చెప్పగా భాస్కరు డప్పుడు
ఆరగించె తా స్వామి ప్రసాదము

డప్పును కొట్టిరి రావలె నందరు
భోజనంబునకు వేచియుంటిమిట
రాలేదొకరును ఆరగించి నా
రదివరకే యని ఆరూఢమయ్యె

భాస్కరుడు

సామి చెప్పగా శాటిక తీసెను
పక్వము చేసిన పదార్థమంతయు
అటులే యుండెను । పడవేయు మిపుడు
భీమా నదిలో ఈ వంటకములు
జలచరంబులును ఆరగించుటకు

ఆ గ్రామస్థులు ఆ గురులీలను
అపూర్వమిదియని అభివర్ణించిరి
స్వల్ప పదార్థము, సరిపడు ముగురకు,

సరిపడె నెట్టులు నాలుగు వేలకు
ఈశ్వరుడే నిట దర్శన మిచ్చెను
సద్గురు మూర్తిగ, ఇదియే సత్యము
అక్షయ మయ్యెను భక్ష్యభోజ్యములు
అన్నపూర్ణమ్మ అరుదెంచె నిటకు

ముని దూర్వాసునకును శిష్యులకును
మెతుకు తిని శ్రీకృష్ణుడపుడు తా
హరింప జేసెను ఆకలి నంతయు
సంతృప్తి పడిరి వారందరునూ
గురుమూర్తు లిపుడు కరుణించినారు
భాస్కరు భక్తికి వశులై ఇప్పుడు.
మన సామివారు మనుష్య మాత్రులె?
త్రిమూర్తి రూపులు దివ్య లీలలను
ప్రదర్శించెదరు భక్తరక్షణకు

సోమనాధుని కథ - భార్య గంగ - గురుభక్తి

గాణ్గాపురమున శౌనక గోత్రుడు
సోమనాధుడను బ్రాహ్మణు డుండెను
అతని సతి గంగ। పతి దైవమనుచు
అభిమానించును అన్ని వేళలను
అరువది వత్సరముల వయ సామెది
గొడ్రా లనుచును గౌరవ మియ్యరు
సంతతి లేదని చింతులు చుండును
నృసింహ యతి వరు నిత్యము దర్శన
ము చేసి సపర్యలు చేయు భక్తిగా
హారతి యొసంగి అరుగు గృహమునకు
సామి ఆ యమ శ్రద్ధకు భక్తికి
సంతస మందెను మదిలో దలచిరి
అనుగ్రహింపగ। ఆమెతో ననిరి

గంగాబాయీ గమనించుచుంటి
నిత్యము పూజయు నీరాజనమును
ఒసగుచున్నావు ఓర్పు మీరగా
తీర్చెద కోరిక దాచక చెప్పుము

గురుమూర్తికి గంగ తన కథ చెప్పుట

గొడ్డు రాలునని గొడవ చేయుదురు
ఇరుగు పొరుగు వారీసడించెదరు
అరువది వత్సరములు నా కిప్పుడు.
నదిలో నీటికి సుదతు లందరను
పిల్లల నెత్తుకు పరదెంచుట గని
మదిలో కుందెద. సుతులు లేకున్న
పితరులు తృప్తిని పొందరట గదా
ఈ జన్మంబున కింతే యని నే
సరిపెట్టుకొంటి మరుజన్మంబున
సంతానముతో సంతోషముగా
బ్రతుకుట కొరకై భగవన్మూర్తుల
మిము సేవించుచు నేనున్నదాన
అనుగ్రహింపుడు అభయ మొసంగుడు

స్వామి- సంతతి అనుగ్రహించుట

మరు జన్మంబది మనకెందుకులే
ఏవరు చెప్పగలరేమి జరుగునో
ఈ జన్మస్మృతి ఆ జన్మంబున
కలుగుట జరుగదు కనుక ఈ జన్మ
యందే సుతుని సుదతిని కనెదవు

గంగ

కడు వినయముతో గంగ తాననెను
స్వామి వారెపుడు సత్యమె పలుకును
అరువది ఏడులు ఆసన్నమాయె

సంతతి బడయుట సాధ్యంబగునా
వ్రతములు తపములు యాత్రలు చేసితి
అశ్వత్థమునకు చేసితి నియతిని
ప్రదక్షిణంబులు పరమ భక్తితో
సద్గురుమూర్తులు ఎదుట నుండగా
తరువును గొల్చితి వరదుని గొల్వక

స్వామి

నిందింపకు మశ్వత్థ వృక్షమును
పవిత్రమైనది పాపహారి యది
అశ్వత్థ సేవ ఆచరించ వలె
సంతతి కల్గును శాంతి లభించును
నారాయణు చిన్మయ రూపంబది

జన్మవంధ్యనని జనులందరు నను
గురు వాక్యంబులు పరమ సత్యములు
అనుగ్రహింపుడు నను దరి చేర్చుడు

సంగమమున తా స్నానము చేసెను
పరమ భక్తితో ప్రదక్షిణ చేసె
అశ్వత్థమునకు నా గురుమూర్తికి.
మూడవ దినమున ముచ్చట గొలిపెడి

గంగ కల

కలగనె నా యమ. విప్రుడు కనబడె
గాణ్గాపురముకు చనుము దయము నసె
మఠమున కేగి నమస్కరింపు మా
సద్గురుమూర్తిని సచ్చిదానందు
ఆతడిచ్చునది ఆరగింపవలె

విప్రుడు కలలో చెప్పిన రీతిని
అరిగె గంగమ్మ గురుమూర్తి కడకు

గురుమూర్తి

ఫలములు రెంటిని ఆరగింపుమని

ఫలముల నిచ్చెను కలిగెదరు నీకు
పుత్రుడు పుత్రిక ముదమును గూర్తురు

గంగ

ఫలములు తిని తా పులకిత యాయెను
ఋతుమతి కాగా మది ముదమొందెను

ఐదవ దినమున ఆమె భర్తతో
మఠమున కేగెను అట వారుభయులు
సద్గురుమూర్తిని । సన్నుతి చేసిరి
పూజించినారు పురుషోత్తముడని

స్వామి దీవించుట - గంగకు వేడుకలు

సంతానము గని సన్నుతి నందుము
అందము చిందెడి ఆయుష్మంతుల
విద్యామూర్తుల వినయవంతులను.

అచిరకాలమున ఆమె ధరించెను
గర్భము-శరీర కాంతియు హెచ్చెను
అబ్బుర మందిరి ఆ గ్రామస్థులు
సద్గురు మూర్తుల చలువ ఇదియనుచు

చేసిరి గంగకు సీమంతంబును
ముత్తైదువులకు మురియుచు నాయమ
వాయన మిచ్చెను వందన మిడుచును

బంధువులు -

అదృష్టశాలివి ఆ గురుమూర్తులు
అనుగ్రహంబును అపార కరుణయు
పొందగలిగితివి పుణ్యము ఫలించె

గంగ

జయము జయము నరసింహయతీశ్వర
అనాథరక్షక ఆపద్బాంధవ
నీవే శరణము నిన్నే నమ్మితి

నిరంతరంబును నిను స్మరించెద
ఆపదల బాపి అనుగ్రహింపుము
అని ప్రార్థించును అనవరతంబును

గంగకు పుత్రిక పుట్టుట

నెలలు నిండగా పుత్రిక పుట్టెను
దంపతు లిద్దరు తమ శిశువును గొని
పరమభక్తితో గురుమూర్తి ముందు
పాదము చెంతను పరుండ బెట్టిరి
సాష్టాంగ నమస్కారము చేసిరి
గురుదేవా నే కోరెదను సుతు నన

సంశయ మేలను చక్కని పుత్రుడు
మురిపించు నిన్ను ముదమును గూర్చును

స్వామి శిశువు భావిని తెలుపుట

శిశువు నందుకొని అచటి వారితో
వేదము శాస్త్రము చదివిన విజ్ఞుడు
భర్త లభించును సరిరా రీమెకు
సౌశీల్యమునను సౌజన్యంబున

గంగ - కోరిన పుత్రుడు

గంగా పుత్రుని కావలెనంటివి
యోగ్యుడు అల్పాయుష్కని కోరెదో
మూఢుని దీర్ఘాయుష్కని కోరెదో?
తెల్పుమన యామె కోరెద యోగ్యుని
అతని కైదుగురు పుత్రులుండవలె
కోరిక తీర్చుడు కరుణ వహింపుడు
గురు ననుమతి గొని గృహమున కేగెను

కాలము గడిచెను గంగ సుతుని గనె
పండితు డయ్యెను బాలుడు అతనికి
ఐదుగురు సుతులు సుందరమూర్తులు
కలిగిరి గురుకృప వలననె కుటుంబ
మంతయు సిరిసంపదలతో సుఖించె

శుష్కకాష్టము చిగురించిన కధ

కుష్ఠురోగి నరహరి

గాణ్గాపురమున గార్గ గోత్రజుడు
కలడొక విప్రుడు నరహరి యందురు
కుష్ఠురోగి కడు కష్టపడుచుండె
గురుమూర్తి వద్ద కరుదెంచె నతడు

నష్టజాతకుడ నను కరుణింపుము
వేదము చదివితి విద్యలు నేర్చితి
కుష్టురోగినని ఇష్టపడరు నను
తిండియు సరిగా పెట్టరు గృహమున
నిందల పాలై నిటనే నుంటిని
పూర్వజన్మకృత పాపఫలంబిది
వ్రతము లొనర్చితి యాత్రలు చేసితి
తీర్థసేవనము దేవపూజలను
ఎన్నో నెరపితి ఇంచుకయు బాధ
తగ్గక యున్నది తరించు మార్గము
సామి తెలుపవలె । శమింపజేయుడు
ఈ నా రోగము ఈశ్వరులు మీరు
కరుణింపుడు నను కరుణామూర్తులు

స్వామి చెప్పిన ఉపాయము

కుష్టువు పోవును దుఃఖము తొలగును
చెప్పెద నీ కొక యుపాయ మిప్పుడు
ఆచరింపవలె అనన్యభక్తిని

అదే సమయమున ఆ దారి నొకడు
ఎండియున్న యొక మేడికొమ్మతో
నరుగు చుండగా గురుమూర్తి యనెను
నరహరీ !

ఆతని నడుగుము ఆ కొమ్మ కావలె
అత్యవసరమని ఆతని వేడుము

ఆ కొమ్మను

సంగమము వద్ద సంగమేశ్వరుని
సన్నిది పాతుము। అనుదినము నీవు
సంగమ మందు స్నానము చేయుము
అశ్వత్థ తరువు నర్చన చేయుము
మేడి కొమ్మ కభిషేకము చేయుము
నదీజలముతో అతిభక్తితోడ.
మేడి చిగిర్చిన గడియను రోగము
పోవును దేహము పుష్టిని పొందును
ఆరోగ్యముతో అలరుదు వంతట

నరహరి దీక్ష

నరహరి సంశయము లేక స్వామి
చెప్పినటులనే చిత్తశుద్ధితో
ఆ కాష్టమునే ఆరాధించెను
తినడాహారము దీక్షను విడువడు

చూచిన వారు

కట్టె చిగుర్చునే! కుష్టువు పోవునే!
ఇది జరుగని పని ఎంచి చూడగా
సర్వము తెలిసిన సద్గురుమూర్తులు
నీ తృప్తి కొరకె ఇది చెప్పినారు

నరహరి

శ్రీగురుమూర్తులు చెప్పిన రీతిని
నడచెదను వారి మాటలే నాకు
ప్రమాణము వారి పలుకులు వేదము
ఈ కాష్టమునకు సేవలు చేసెద
చలింప నించుక చావు మూడినను

శిష్యులు గురుమూర్తికి విషయము తెలుపుట

ఒకదినమున గురువులతో పలికిరి
అతిశ్రద్ధతో ఆ కాష్టమునకు

జలమును పోయుసు । ఆరగింపడా
హారంబును ఇది జరుగని పనియని
చెప్పితి మతనికి చెవిని పెట్టడొక
మాటనైననూ పట్టును విడువడు

స్వామి శిష్యులకు చెప్పిన కథ - గురుభక్తి ప్రభావము

భావమునుబట్టి ఫలసిద్ధి యగును
గురువాక్యంబును పరమ వేదమని
నమ్మిన వానికి ఇమ్ముగ కలుగును
కార్యసిద్ధులవి కథ యొకటున్నది
స్కాందమునందున చక్కటి కథయది
(గాయకుడు కథ చెప్పవలెను)

సంసారంబను సంద్రము దాటగ
మార్గ మొక్కటే । గురుభక్తియె యది
గురువిమర్శనము కూడ దెప్పుడును
పరబ్రహ్మ యని గురుని కొలువవలె
గురవు మనుజుడని తలపక మదిలో
సేవించినచో సిద్ధి లభించును
త్రిమూర్తి గురుడని నమ్ముడు మదిలో
వైద్యుడు విప్రుడు దైవజ్ఞుడును
మంత్రము దేవత మదిలో నమ్మిన
కార్యసిద్ధి యగు పరమ సత్యమిది
నమ్మిక లేనిచొ నష్టమె కలుగును
నరహరి నమ్మెను నామాటను యే
సంశయములేక విశ్వాసముతో
శుష్కకాష్టమును శుద్ధభావమున
భజించుచుండెను పరమభక్తితో
కార్యసిద్ధికా గలదతని కిప్పుడు

స్వామి కాష్టముపై ఉదకము జల్లుట-కాష్టము చిగురించుట

దయాసముద్రుడు తడయక నేగెను
సంగమము చేరి తా కాంచె నచట

నరహరి -

ఇటునటు చూడక ఏకాగ్రతతో
శుష్కకాష్టమును, పూజించుచుండె

కరుణామయుడై గురుమూర్తి జల్లె
కాష్టముపై తన కమండు జలమును
చిగిర్చె నపుడే చేతన మయ్యెను
నరహరి కుష్టువు హరించిపోయెను
పసిడి వర్ణమున భాసిలె దేహము

పులకాంకితుడై నరహరి స్తుతించె
అతి మధురముగా అనర్గళముగా
అబ్బురము గొల్పు ఆశువు చెప్పెను
(నరహరి స్తుతిసారము అనుబంధములో చూడుము)
సంతోషముతో సంతర్పణమును
నరహరి చేసెను పురజనుల కెల్ల

స్వామి నరహరిని దీవించుట - మంత్రోపదేశము

ఐహిక సుఖములు ఆముష్మికములు
అనుభవించు మిక ఆనందముతో
అష్టాంగ యోగ మతనికి గరిపెను

పేరిడె నతనికి యోగీశ్వరుడని
నిరోగమైనది నీ దేహ మిపుడు
నీ సతితో నీ విచటనె యుండుము
కలుగును సంతతి కలుగును శుభములు
నీ వంశస్థులు నన్ను భజింతురు

విద్యాసరస్వతీ మంత్రంబును
గురుమూర్తి యతని కుపదేశించెను
నరహరి సతితో అరుదెంచి మఠము
లో నుండె జనుల మన్నన పొందుచు

సాయందేవుడు గురుమూర్తిని దర్శించుట

పలుదేశములకు వ్యాపించె
యతివరు మహిమలు ఆ వార్తలు విని
సాయందేవుడు సరగున వచ్చెను.
యవనుని బాధలు అంతము చేసిన
పావనమూర్తులు పరమ కృపాళులు
గురుమూర్తిని తా దర్శించుటకై

గురుమూర్తిని గని మరచెను సర్వము
సాష్టాంగ నమస్కారము చేసెను
కరములు మోడ్చెను గగుర్పాటుతో
త్రిమూర్తి రూపులు చిన్మయమూర్తులు
ధన్యుడ నైతిని దర్శనమయ్యెను
పాపములన్నియు భస్మము లయ్యెను
సర్వవ్యాపక సచ్చిదానంద
భక్తవత్సలాభవ భయహారీ
కమండలంబున కలదమృతజలము
చరణముల యందు తీర్థములున్నవి
భక్తుల నెల్లను పరిరక్షింతురు
ధర్మోపదేశ నిరతులు వరదులు
చేతులు మొగుడ్చి సాయందేవుడు
గురుమూర్తి యెదుట నిలబడి యుండెను

స్వామి సాయందేవుని తనతో భుజించుటకు రమ్మనుట

నీ వంశస్థులు నా భక్తులె సుమి
ఆరాధింతురు అనన్య భక్తిని
స్నానము చేయుము సంగమము వద్ద
అశ్వత్థమునకు అర్చన చేయుము
భోజనమునకీ విటకే రావలె

సంగమము నుండి సాయందేవుడు
వచ్చెను యతివరు పూజించె హారతి

ఇచ్చెను ఆనందాశ్రుల రాల్చెను.
ప్రియతమ శిష్యుని సాయందేవుని
ప్రేమ మీరగా భిక్ష సమయమున
భుజింప జేసిరి శిష్యులు స్వామి
ప్రక్కనే. మన ముప్పొంగెను సాయం
దేవుడు తన గురుదేవుని కరుణా
మయునిగ కామితదాయిగ మదిలో
తలచుచు పరిపరి తన్మయు డయ్యెను

స్వామి సాయందేవుని కుటుంబమును గూర్చి ప్రశ్నించుట

భోజనమాయెను విశ్రాంతి గొనుచు
స్వామివారనిరి సాయందేవా
కుటుంబ మెచ్చట ఎట ఉద్యోగము
సేమమె మీ కన। సామీ మేమివు
డున్న గ్రామము ఉత్తర కాంచీ.
క్షేమ మందరూ మీ దయ వలననె
సంసారంబును చక్కగ నడపుచు
సుతులున్నారలు సూక్ష్మగ్రాహ్యులు

సాయందేవుని కోరిక - స్వామి అంగీకరించుట

మిము సేవించుచు నిటనే నుందును
మది కోరిక యిది మన్నింప దగును

స్వామి

ఒకచో స్థిరముగ నుండుట జరుగదు
అరణ్యమందునొ పల్లెల యందునొ
చరించుచుందుము సులభము కాదది
మము సేవించుట। ఆ మాటలు విని
సాయందేవుడు భయభక్తులతో
స్వామీ నే మిము శరణు జొచ్చుటకు
సర్వము త్యజించి పరతెంచినాను
ఈ దీనుని మీరుద్ధరింపవలె
గురుసేవ వలన కృతార్థులగుదురు

సుఖప్రదంబది దుఃఖ మెట్లగును
స్వీకరించవలె శిష్యునిగ నను

దృఢమగు భక్తియు దృఢ సంకల్పము
బలమగు కోర్కెయు కలిగి యున్నచో
మా వద్దనుండి మము సేవింపుము
అని గురుమూర్తులు అనుమతి యొసగెను
సాయందేవుడు సంతోషముతో
వారి సేవలో కాలము గడిపెను

ఒకనాడు

సామి తా నరిగె సాయంకాలము
సంగమంబునకు సాయందేవుడు
గురుదేవునితో నరిగె నచ్చటికి
గురు సాన్నిధ్యము కోరుచు మదిలో

సాయందేవుని మనోనిబ్బరము స్వామి పరీక్షించుట

వారిరువురు

అశ్వత్థము కడ నాసీనులైరి
సంభాషణములు సాగుచుండగా
అస్తమించె రవి అలమెను చీకటి
(సంకల్పించెను సామి తన మదిని)
చయ్యన వీచెను ఝుంఝామారుత
మా వేగమునకు అచటి వృక్షముల
పెద్ద కొమ్మలే పెళ పెళ విరిగెను
కుండపోతగా కురిసెను వర్షము
క్రమ్మె నంతటను కారు చీకటులు
జలార్ణవములుగ పరిసరములయ్యె

సాయందేవుడు సామిని కప్పెను
తన వస్త్రముతో తడియ కుండగా
వర్షము వెలిసెను వీచె చలిగాలి
సామి వారనిరి సాయందేవా

చలిగా నున్నది పురమున కేగుము
నిప్పు పట్టుకొని రావలె త్వరగా
చూడకు నిటునటు వెడలు సమయమున
ప్రక్కకు చూడకు వచ్చునప్పుడును

సాయందేవుడు

గురుచరణంబుల నిలిపెను మదిలో
బయలుదేరె తా భయంబు లేకనె
గ్రామము వైపుకు కటికచీకటిని
బురదలో పడిన కలత చెందకనె
పురమును చేరెను సదిలముగ నిప్పు
నొక భాండంబున నుంచెను [illegible]
సాయందేవుడు సద్గురు సేవకు
నడక సాగించె తడబాటు లేక

ఐదు తలల పాములు

సాయందేవుడు

వలదని చెప్పిరి గురువరు లెందుకో
కారణమేమని కనుగొన దలచెను
ప్రక్కకు చూచెను భయమును గొల్పెడి
సర్పము కనబడె కలవైదు తలలు
రెండవ వైపున కూడ నగుపడెను
వేరొక సర్పము గలవైదు తలలు
భయభ్రాంతుడై పరుగిడ జొచ్చెను

దూరము నుండియె దృగ్గోచరమయె
దీపమాలికలు దివ్యస్వనములు
చెవులను దాకెను. చెచ్చెర నడచెను
అదృశ్యమయ్యెను అట చేరు సరికి
దీప మాలికలు దివ్యస్వనములు
ఆ సమయంబున ఆకసమంతయు
అతి నిర్మలమ్మై యలరారుచుండె

దిక్కులు నింపెను వెన్నెల శోభలు
తెచ్చిన నిప్పును జ్వలింప జేసెను
గురువరు దగ్గర నుంచెను భక్తిని
నమస్కరించెను నతశీర్షముతో

సర్పములు రెండు సామి అనుమతితో
కడు వేగముగా నెటకో పోయెను
నీ రక్షణకే నే పంపినాను

గురుకృప కలిగినవారు ధన్యులు

గురుశుశ్రూషను కోరితివి నీవు
కత్తి యంచుపై కదలుట వంటిది
గురుమూర్తుల కృపగలిగిన వారలు
నిర్భయంబుగా నిల జీవింతురు

జపములు తపములు సత్ఫలితంబులు
పొందుట కొరకై ఆచరింపవలె
అనన్య దీక్షను । ఆటంకంబులు
వచ్చును పెక్కులు వాటిని దాటుట
కష్టమైన పని నిష్ఠ కావలెను
గురు కృప యున్నచో సులభము దాటుట
ఏ ఆటంకము వీరికి కలుగదు
సులభము సుకరము సూక్ష్మమార్గమిది

పార్వతికి శివుడు గురుభక్తి మహిమ
వివరించుటకై చెప్పె నొక కథను
సాయందేవునకా కథ తెలిపెను
పులకిత తనుడై గురుపదములపై
తన శిరముంచెను తన్మయు డగుచును
సామీ మీపై అనుపమ భక్తిని
అనుగ్రహింపుడు ధన్యుని చేయుడు

కథలో

కాశీయాత్రా క్రమము వినినపుడు

కాశీయాత్రను కావించినట్లు
అనుభూతి కలిగె నబ్బుర మందితి
శరణము నాకిక మీరే యనుచును
స్తుతించె యతివరు నతిరమ్యముగా

స్వామి సాయందేవుని కుటుంబమును ఆశీర్వదించుట

సాయందేవుని సతీసుతులతో
దగ్గరకు పిల్చి దరహాసముతో,
పాదము పట్టిన పెద్దకుమారుని
మస్తక మందున హస్తము నుంచెను

శతాయుష్కుడగు, సంపదలెన్నో
సమకూర్చుకొనును సన్నుతి గాంచును
నా భక్తుడగును నను పూజించును

సాయందేవా!

నీకును నౌకరి చేయు నవసరము
లేదిక నను సేవించుచు నిటనే
యుండుము నీ సుతుడు వహించును నీ
కుటుంబ భారము కడు జాగ్రతతో

అనంత పద్మనాభ వ్రతము

భాద్రపద శుక్ల చతుర్దశి
తిథి ఆ రోజున భక్తు లందరును
అనంత వ్రతము నాచరించుటకు
వచ్చిరి మఠముకు ఉత్సాహముతో
సాయందేవా చేయుము వ్రతము
అందరి తోడను ఆనందముతో

సామీ మీరే సర్వేశ్వరులరు
అనంతమూర్తులు ఉన్నారెదుటను
వేరే వ్రతమును ఏల చేయవలె

అన విని యతివరు లతనికి తెల్పిరి
అనంత వ్రత ప్రభావ మహిమలు

సాయందేవుడు స్వామిని స్తుతించుట (అనుబంధములో)
(గాయకుడు అనంతవ్రత కధ నిచట చెప్పవలెను)

తంతుకుని కథ

గాణ్గాపురమున గలడు తంతుకుడు
సాలె కులస్థుడు సామికి నిత్యము
సేవలు చేయును చిత్తశుద్ధితో
మఠమును ఊడ్చును కడు జాగ్రతతో
గురుమూర్తిని మది గొలచును భక్తిని

నాడు శివరాత్రి మఠమున కేగెను
సాష్టాంగపడెను సామి పదములకు
సామీ మీరే సదాశివులనుచు
కరములు మొగుడ్చి నిలబడె నెదుటను

తంతుకుని బంధువులు

శ్రీశైల యాత్ర చేయుట కొరకై
బంధువు లందరు పయణం బయ్యిరి
మాతో నీవును కదిలి రావలెను
పర్వదినంబున పరమేశుని గని
పూజలు చేసిన పుణ్యప్రద మన

తంతుకుడు

మన గురుమూర్తులు మల్లికార్జునులె
శ్రీశైల మిదే శివునకు నిలయము

అన విని వారు

మూర్ఖుడు మూఢుడు తెలియదేమియును
అని మది తలచిరి అరిగిరి యాత్రకు

స్వామి

బంధువుల మాట పాటింపక నీ
విటనే యుంటివి ఏమి కారణము
అన విని తంతుకుడనె ఓ స్వామీ
మల్లికార్జునుడు మీరని తెలియురు
తీర్థములన్నియు కలవు మీ చరణ
యుగళమున దీనిని గన జాలకనె
అజ్ఞానంబున అరిగిరి వారలు

(మాఘ బహుళ చతుర్దశి - శివరాత్రి)

ఆ సాలెభక్తు డా దినమున తా
ఉపవాసముండ ఉత్సాహపడెను
సంగమ మందున స్నానము చేసెను
సామి ముందటను చతికిల బడగా

స్వామి

బంధువు లందరు యాత్రకు పోయిరి
నీ విట నుంటివి. ఎపుడైన శ్రీ
శైలము కంటివె శివుని చూచితివె
అని గురుదేవులు అడిగిన తాననె
ఎరుగనేమియును ఎరుగుదు మీపద
పద్మంబులనే వరదాయకములవి

స్వామి తంతుకుని యోగబలముచే శ్రీశైలమునకు గొంపోవుట

శ్రీశైలంబును నీకు చూపెదను
కండ్లు మూసికొని గట్టిగ పట్టుము
నా పాదములను. నా తంతుకు
డటులే చేసెను అరక్షణములో
పాతాళగంగ పరిసరంబులకు
చేరిరి। కన్నులు తెరువుమనె సామి

కన్నులు తెరచెను కనుల పండువుగ
శ్రీగిరి కనబడె చిన్మయ శైలము

స్వామి

ఇదియే శ్రీగిరి ఇట క్షురకర్మ
పూర్తి చేసికొని నదిలో స్నానము
చేయుము శివునకు చిత్తశుద్ధితో
పూజ లొనరించి నిచటకు రావలె
నేనిట నుందును నీ వచ్చు వరకు

తన బంధువులను తంతుకుడు కాంచె
గుడిలో గుర్తించి ఎట్లు వచ్చితివి
రానంటివి గద! అన తంతుకు డనె

స్వామివారితో సరగున వచ్చితి
ప్రయాణమైతిమి పదిగంటలకే

బంధువులు తంతుకుని మాట నమ్మరు

అబద్ధమాడుట అలవాటితనికి
చాటుగ వచ్చెను, అటుగాకున్నను
ఇంతదూరమున కెటు రాగల్గును
ఈతని మాటలు సత్యదూరములు

మల్లికార్జునుని మహాలింగమున
గురుమూర్తియె తనకు గోచరించెను
పులకితు డయ్యెను మరచెను సర్వము
యాత్రికులందరు ఆ గురుమూర్తినె
పూజించుట గని ఆశ్చర్యముతో
సాక్షాత్ శివుడే సద్గురువులనుచు
మది నుప్పొంగెను అదృష్ట మిదియని.
పూజలు ముగించి వచ్చె పరుగిడుచు
గురుమూర్తి కడకు పరమ భక్తితో

స్వామి-

చక్కగ యాత్రను చేసికొంటివా?
కోరిక యున్నదె కొద్ది దినంబులు
నిచట నుండుటకు దాచక చెప్పుము
వచ్చెదవా యన వాడనె మెల్లగ.
స్వామీ కంటిని మిమ్ముల గుడిలో
పూజల నందుచు యున్నారచ్చట.
కండ్లు మూసికొని పట్టెను పదముల
మఠమున కొచ్చిరి మరుక్షణములో

సమీపమందున సాక్షాత్ శివుడే
యుండగ తెలియక మూఢులు ఎటకో
పోయెద రేదో పొందవచ్చునని

స్వామి తంతుకునకు యాత్రల ప్రయోజనము తెల్పుట

ఓయీ తంతుక ఉన్నాడొకడే
విశ్వేశ్వరుండు విశ్వవ్యాపిగ
ఐనను స్థలమహాత్మ్యము లుండును
వేరుగ ఇదియే కారణము యాత్ర
సలుపుటకు తీర్థముల కేగుటకును

స్వామీ మీరలు సర్వజ్ఞులు గద
తెలుపుడు దయతో క్షేత్ర మహాత్మ్యము
(గాయకుడు శ్రీశైలమహాత్మ్యమును గూర్చి చెప్పవలెను)

నంది కథ

నంది తులజా పరమేశ్వరిని చందల పరమేశ్వరిని ఆరాధించుట

బ్రాహ్మణుడు నంది బాధపడుచుండె
కుష్టురోగమున కొలుచును భక్తిని
తులజా పరమేశ్వరి. నామె చెప్పె
కలలో చందల పరమేశ్వరి కడ
కేగుము ఆమెను సేవింపు మిదియే

... నివృత్తికి తగిన మార్గమనె

చందల పరమేశ్వరి సన్నిధిలో
ఏడు మాసములు ఏకాగ్రతతో
తపస్సు చేసెను తన్మయు డగుచును
స్వప్నమున దేవి సాక్షాత్కరించి
గాణ్గాపురమున గలడు యతివ...
ఆతడు రోగము హరింపజేయు...
అచ్చటి కేగుము అభీష్ట సిద్ధికి

అన నంది దేవితో

తులజా, పరమేశ్వరి చెప్పగ నిట
కేతెంచితి నే, చేసితి తపమును
ఏడుమాసములు ఏకాగ్రతతో
ఈ సలహా నా కిపుడా చెప్పుట
కాలము గడిచెను కాంక్ష తీరకనె
ఇట నే నుందును నీ కడ చత్తును
సలహా వలదిక సంరక్షింపుము
మరునాడును ఆ కలయే వచ్చెను
అలక్ష్యము చేసి యటనే యుండెను

కలలో చందల కన్పడి చెప్పెను
పూజారి తోడ పొమ్మని చెప్పుము
నందిని, ఆతడు కదలక నిలచిన
బలవంతముగా బైటకు గెంటుము

పూజారి నందితో

ఇటనుండవలదు ఎటకేని పొమ్ము
అమ్మ ఆజ్ఞ ఇది ఆలసింపకుము

నంది గాణ్గాపురమున కేగుట

దీక్ష విరమించి దీనుడై వెడలె
పరమేశ్వరి తన కలలో చెప్పిన
గురుమూర్తి కడకు । గాణ్గాపురముకు

మఠమును చేరెను మానవమాత్రుడు
స్వామి గదా యని సంశయముతోడ
తత్తర పడుచును ద్వారము వద్దను
నిలబడి యుండెను నిస్పృహతోడను
సామివారపుడు సంగమంబు కడ
ఉన్నారని విని ఉస్సురుమనియెను

మధ్యాహ్నమునకు మఠమున కొచ్చిరి
గురుమూర్తి వెంట పలువురు శిష్యులు (వచ్చిరి)

వారితో నంది గురుదర్శనమునకు
వచ్చితినయ్యా వరదాయకుడని
పరమేశ్వరియే కలలో చెప్పెను

ఇటనే నిలువుము చెప్పి వచ్చెదము
కుష్టురోగి యొక డిటకు మీ దర్శన
మునకై ఉదయంబుననే వచ్చెను

స్వామి నందిని దగ్గరకు రప్పించుట-సంశయగ్రస్తుని కార్యము సిద్ధించదు

తెలియును నా కాతని కథ యంతయు
సంశయంబుతో నిచటకు వచ్చెను
అతనిని తీసుకు రావలె నిచటికి

దూరమున నుండి నేలకు వాలెను
సాష్టాంగ నమస్కారము చేసెను
సందేహముతో సాగి వచ్చితివి
మనుష్యమాత్రుడు మానుపగలడే
కుష్టురోగమును? వచ్చితి వేలను
చందలాదేవి కాదనిన పనిని
నేనెటు చేతును నీమది సంశయ
గ్రస్తము కార్యము సిద్ధించు టెట్లు
సామి మాటలను సాంతముగా విని
తన మనసులోని తలపుల నెరిగిన

నంది స్వామిని తరుణోపాయ మడుగుట

సద్గురుమూర్తికి సాష్టాంగపడెను.
తమసున బడి నే తమ నిజరూపము
ఎరుగలేనైతి అల్పుడను నేను
దర్శనము చేసి ధన్యుఢ నైతిని
పాపములన్నియు భస్మము లయ్యెను
శరణాగతుడను దరి చేర్చుదురని
ధైర్యము కలిగెను తరుణోపాయము
సెలవీయవలెను సర్వజ్ఞులు గద!

దుష్కర్మము లవి దూరము తొలగెను
కనుల పండువుగ కంటిని బ్రహ్మము
కోరికె తీరెను దర్శనమాయెను
త్రిమూర్తి రూపులు త్రిగుణాతీతులు
కల్పవృక్షమును కామధేనువును
సరి రావు మీకు సద్గురుమూర్తీ

నంది తన వ్యధను గురుమూర్తికి తెలుపుట-శరణు వేడుట

వివాహమయ్యెను వ్యాధి యగుపడెను
తాకుటకు వెరచి తన పుట్టింటికి
చేరెను నా సతి తలితండ్రులు నను
విడనాడినారు వేదన హెచ్చెను
సంసారంబున సాగలేకనే
తులజాపురమును చేరితి ముందుగ
పరమేశ్వరి నే నారాధించితి
చందలదేవిని సేవింపు మనెను
ఆమెయె మీకడ కంపెను సామీ
ఈ అంగహీను నెవరు చూచెదరు
మీరే గతి యిక కరుణించవలెను
విడనాడినచో విడిచెద నసువులు
విలపించె నంది గురుమూర్తి యెదుట

స్వామి నందిని అనుగ్రహించుట - చెప్పిన సలహా

దరహాసముతో గురుమూర్తి పలికె
సంగమంబునకు కొనిపొమ్మితని
సంకల్పముతో స్నానమాడించి
అశ్వత్థంబును అర్చింపజేసి
వాని వస్త్రముల పారవైచి యీ
నూతన వస్త్రము లతని కీయవలె
తడయక రావలె, తరించు నీతడు

సోముడు నందిని తోడ్కొనిపోయెను
సంగమంబునకు స్వామి ఆజ్ఞపై
(నంది) స్నానము చేసెను శరీర వర్ణము
చక్కబడినదా క్షణమందుననే
అశ్వత్థమునకు నిశ్చలమతితో
ప్రదక్షిణ చేయ పసిడి వన్నెలో
అలరెను దేహము అబ్బురము గొల్పె
పాతవస్త్రములు పడిన స్థలమది
చవిటి నేలగా క్షణమున మారెను
(నంది,సోముడు) వారు మఠమునకు పరుగున వచ్చిరి

అచ్చట వారలు ఆశ్చర్యముతో
నందిని చూచిరి అతని శరీరము
పసిడి ఛాయితో భాసిలుచుండెను
నంది గురువులకు నమస్కరించెను

నంది కుష్ఠురోగశేషము మిగిలి యుండుట

నీ మనోరథము తీరినదా యనె
శరీరమంతయు చక్కగ యుండెను
కాలిపిక్కలో కలదొక శేషము
అది గని యాతడు అతి భయము తోడ
సామీ కుష్టువు శమించె నంతట

కొద్దిగ శేషము ఉన్నదిచ్చటను
కారణమేమో తెలియ జెప్పవలె
సర్వజ్ఞులు గద సద్గురుమూర్తులు
రోగశేషమును సద్గురుమూర్తీ
చూపుమాపవలె నాపై దయతో

మనుష్యమాత్రుడు మాన్పకల్గునా
అని సంశయించి అరుదెంచినావు
ఇదియె కారణము ఇది తొలగుటకై
చెప్పెద నీకొక యుపాయమిప్పుడు

స్వామి నందికి చెప్పిన ఉపాయము-తనపై కవనము చెప్పమని

నన్ను స్తుతింపుము అనన్య భక్తిని
కవనము చెప్పుము కలుగును ఫలితము

నంది గురుమూర్తి పాదముపై బడి
నిరక్షరాస్యుడ నేను కవిత్వము
చెప్పగ జాలుదె ఆపద్బాంధవ (అన)

స్వామి

నోరు తెరువుమని నాలికపై నిడె
కొద్ది విభూతిని నందికి కలిగెను
ఆ క్షణముననే అనర్గళంబగు
కవితా ధోరణి కావ్యజ్ఞానము
స్తుతించె సామిని అత్యద్భుతమగు
పదజాలముతో పరమ భక్తితో

సంతసించిరా సద్గురుమూర్తులు
బిరుదము నిచ్చిరి పలువురు వినగా
కవీశ్వరుండని కవియైన నంది
మరియొక పరి తన శరీరమంతయు
పరీక్షింపగా ఆ రోగశేష

మగుపడకుండెను సద్గురుమూర్తికి
సాష్టాంగ నమస్కారము చేసెను
వారి వద్దనే వారి సేవలను
చక్కగ చేయుచు సంతోషముతో
కాలము గడిపెను మరచెను బాధలు

విప్పరగలో జరిగిన కధ

విప్పర గ్రామ వాసులు సామిని
ఆహ్వానించిరి అనుపమ భక్తిని
గురుమూర్తి యచట కరిగిరి దయతో
అహర్నిశంబులు మహోత్సాహమున
పూజలు సలిపిరి పురుషోత్తముడని

ఆ యూరిలో శివభక్తుడు నరహరి-వేరొక దేవుని కొలువడు

నరహరి, విప్రుడు పరశివుని గొల్చు
పరమ భక్తితో । పండితు డాతడు
నిత్యము రచించు నైదు పద్యములు
భక్తి భరితములు, పరమేశునిపై

శివుని మాత్రమే సేవించు నతడు
ఏకాగ్రతతో, ఇంకొక దేవుని
కలలో నైనను స్మరింప డెప్పుడు

పెద్దలు నరహరిని పద్యములు చెప్పుమని కోరుట-అతడు నిరాకరించుట

నరహరి వద్దకు అరిగిరి పెద్దలు
సద్గురు మూర్తులు చనుదెంచినారు
మన యూరికిపుడు, మహనీయు డతడు
పద్యములల్లుము హృద్యములైనవి
యతివరుని మీద.యశము చేకొనుము

కళేశ్వరు నే గొలిచెద నెప్పడు
వారిపైననే పద్యము లల్లుట

ఇతర దేవతల నే కొలువ నెపుడు
మనుష్యమాత్రుని మన్నింప గలనె
మీరు కోరునది జరుగని పనియనె

నరహరి పూజ సమయమున నిద్రలోనికి జారుట-కల కనుట

అదే దినంబున ఆ నరహరి తా
శివుని పూజకై చేరె దేవళము
శివధ్యానమును చేయుచుండగా
నిద్రను మునిగెను కలలో నతనికి
సద్గురుమూర్తులు సాక్షాత్కరించె,
స్తుతించె వారిని మధురోక్తులతో
నరులను పొగడవు నన్నేల నీవు
స్తుతించితివన అది గమనింపక
సామికి నరహరి అమిత భక్తితో
చేసెను అర్చన చెప్పె పద్యములు
నిత్యము వలెనే నేర్పు మీరగా
పంచరత్నములు భక్తి భరితములు

కల యది కరిగెను మెలుకువ వచ్చెను
ఆశ్చర్యముతో అతడు తలంచెను
మహాత్ము డతడు మానవుడు కాడు
అవతారమూర్తి - అహంకారినై
కడు మూఢుడనై గ్రహింప కుంటిని

నరహరి స్వామిని శరణు జొచ్చుట

గురుమూర్తి కడకు పరుగిడె వడిగా
సాష్టాంగ నమస్కారము చేసెను
కృపారసంబును నాపై బరుపుడు
శివ స్వరూపులు శిష్ట రక్షకులు
కంటిని మీరే కళ్లేశ్వరుడని
భ్రమరము నేనై భ్రమింతు నిక మీ
చరణ కమలముల సర్వకాలముల

ఎంతకాలమో ఏకాగ్రతతో

తపము చేసితిని తరింపజాలక
నేనుంటి నిటనె, మునిగి మోహమున
గురుమూర్తి పాదములపై నుంచెను
శిరమును నరహరి నిర్మల మతితో

స్వామి

నిత్యము నన్నిట నిందించు చుంటి
వని నిను చూడగ వచ్చితి నిచటకు
ఏల కలిగె నీ కింత భక్తియన
పూర్వజన్మకృత పుణ్యఫలంబిది
అహంకారము మోహమున ముంచె
గుడిలో పూజకు కూర్చొని నిద్రకు
లోనైతిని కలలో మిము చూచితి
కళ్లేశ్వరులే మీరని తలచితి
స్వీకరించవలె శిష్యుని గాన ను
ఆసువుగ చెప్పె నైదుపద్యములు
శ్రీ గురుమూర్తులు చిదానందులని

స్వామి నరహరిని శిష్యునిగ స్వీకరించుట

స్వీకరించె తన శిష్యునిగ నతని
నూతన వస్త్రము లాతని కొసగెను
ఇటనే యుండుము ఈ కళ్లేశ్వరు
పూజించుట నను పూజించుటయే
కండ్ల కెదురుగా కనబడుచున్నది
కళ్లేశ్వరులే కరుణ జూపవలె
మీ కడ నుండెద మిమ్ము సేవింపుచు
సమ్మతి తెల్పెను సామి నరహరికి

దీపావళి పండుగ

పండగ దీపావళి దగ్గరపడె
పలువురు భక్తులు పిలిచిరి భిక్షకు
ఆ రోజున తమ ఆవాసములకు
(వేరు గ్రామములు వారివి స్వామి
నీవారలు నిత్యము దర్శించు వారు)

మఠమున మాతో నుండుట ముఖ్యము
అని శిష్యులనిరి ఆ క్షణముననే

స్వామి
ఎవరికి వారికి చెవిలో చెప్పెను
వచ్చెద నింటికి పండుగ దినమున
ఏరికి చెప్పక ఏగుడింటికనె
అరిగిరి భక్తులు వారి పల్లెలకు

స్వామి యోగబలంబున అందరి ఇండ్లలో భిక్ష చేయుట

పండుగ దినమున తడయక గురువులు
ఎనిమిది రూపము లేర్పడ దాల్చెను
యోగబలంబున ఏగె క్షణమున
అన్ని గ్రామముల కన్ని భిక్షలను
అందుకొని వచ్చె నాశ్రమంబునకు
మరియొక రూపము మఠమున యుండెను

దయతో గురువులు తమ గ్రామమున
కేతెంచి రనుచు సంతోషించిరి
భక్తులందరును పరిపరి విధముల

రూపము లన్నిటి నుపసంహరించి
నిజరూపముతో మఠమున యుండిరి
ఏరికి తెలియదు పరమ రహస్యము

కార్తికమాసపు పూర్ణిమ దినమది
దీపమాలికల నర్పించి సామి
పూజలు సలుపగ వచ్చిరి భక్తులు
అపుడు గమనించినారా పెద్దలు
దీపావళి నాడిచ్చిన శాటిక
లచ్చట చూచిరి ఆశ్చర్యపడిరి
భక్తుల నెల్లను తృప్తిపరచుటకు
సద్గురుమూర్తుల యోగలీల యది

భక్తులు స్వామిని స్తుతించుట

నారాయణుడే నరుని రూపమున
నవతరించె నిల అరసి చూడగా
త్రిమూర్తి రూపులు త్రిగుణాతీతులు
విశ్వతోముఖులు విశ్వపాలకులు

సద్గురుమూర్తి శరణము మీరే
సమారాధనలు చక్కగ నెరపిరి
దానధర్మములు దండిగ చేసిరి

పొలము దున్ని జీవించు శూద్రుని కథ

గాణ్గాపురమున గలడొక శూద్రుడు
కుటుంబ పోషణ కొరకై భూమిని
దున్నును. సామి యనినచో భక్తియ
పారము. సామిని భగవంతుడనును
పోవలె నీతని పొలము గుండనే
సంగమంబునకు జను లెవరైనను
సంగమంబులో స్నానమాడుటకు
ఉదయమున సామి ఆ దారినె జను
మధ్యాహ్నమునకు మఠమును చేరును
స్వామి కెదురుపడి నమస్కరించును
ఏమియు కోరడు పలుకక యుండును
గురుమూర్తి వాని పలుకరించకనె
ముందుకు సాగును మౌనము వహించి

ఒకనాడు స్వామి
కష్టంబని మదినెంచక నిత్యము
నమస్కరింతువు నా మది మెచ్చితి
కోరిక యున్నచొ తెలుపుము తీర్చెద
అన విని వాడనె అనుగ్రహింపుడు
పొలము బాగుగా పండవలెననుచు

స్వామి

పొలమున నీవేపైరు జల్లితివి ?

జొన్నలు జల్లితి చూడుడు ఏపుగ
ఎదిగియున్నవవి కొద్ది దినములకు
కంకెలు వైచును। కలగను చుంటిమి
మంచిపంటయే మాకు దక్కునని

సామీ! దయతో రమ్ము మా పొలము
పాద ధూళితో పావన మొనర్చి
ధన్యుని చేయుడు ధర్మమూర్తులన

అతనితో గూడ నాతని పొలమున
గురుమూర్తి వెడలె, చిరునవ్వొలయగ
నేనొక సలహా నీకు చెప్పెదను
పాటించెదవా యన పరమభక్తితో
చేతులు మొగిడ్చి చిత్తమలరగా
గురువాక్యంబులు పరమ సత్యములు
పాటించెద మీ మాటలు తడయక

రైతు స్వామి మాట పాటించుట

సంగమంబు కడ కేగుచున్నాను
మధ్యాహ్నమునకు మరలి వచ్చెదను
మొక్కలనన్నిటి మొదటికి కోయుము

ఆ రైతు కోసె నపుడే మొక్కలు
మొదలంటగ సంతోషముతో
గురువుల సలహా తలచుచు మదిలో

గ్రామస్తులుఏవగించుట

గ్రామస్తులరసి, ఏమీ పని యని
ఏవగించుకొని ఎందుకు పంటను
చేతులారగా చెరిపితి విప్పుడు
మతిమాలిన పని అతిదారుణమిది

వచ్చినవారిని వచ్చినట్టుగా
తరిమెను వెనుకకు తన వైరులనుచు
యజమానిని గని ఆ గ్రామస్తులు
పైరును చూడుడు నెలలో కోతకు
సిద్ధముగ నున్న చేనును కోసెను
మొదలంట నితడు బుద్ధిహీనుడై

యజమాని వారితో

రెండింతల ధనమిచ్చెదనని తా
వ్రాసెను పత్రము, నే సరి యంటిని
సేవకుని పంపె చేను చూడమని

రైతు యజమానుని భయపడవలదనుట

భయపడవలదను పైకము నిచ్చెద
కావలసినచో, కావలసినన్ని
ధాన్యములున్నవి అని చెప్పుమనె
గురువు లిచ్చిరీ సలహా దయతో
పాటించితి నది పరమ భక్తితో
జబాబు వినిన యజమాని పలుకక
యుండెను తనకే నష్టముండదని

పొలమున మొక్కలు పూర్తిగ కోసెను
గురుని రాకకై నిరీక్షించుచూ
నిలచి యుండెనట నిశ్చల మతితో
సామిని జూచెను నమస్కరించెను
మొక్కల నన్నిటి మొదటికి కోసితి

స్వామి

పరిహాసమునకు సలహా నిచ్చితి
ఎందుకీ పనిని చేసితివనగా
గురువాక్యంబులు శిరోధార్యములు
కామధేనువును కల్పవృక్షమును

సరిరావతనికి సర్వదేవతలు
సద్గురు సన్నిధి వశించుచుందురు

స్వామి రైతున కభయ మొసంగుట

వలదే చింతయు వర్ధిలుపంటయు
ఆశీశు లిడి తా నరిగె మఠమునకు

రైతు

గృహమున కేగెను గురు మది తలచుచు
భార్యనోదార్చె భయమేల మనకు
గురుమూర్తియె మన పాలిట నుండగ
జరుగును సర్వము సక్రమంబుగా
గురుమూర్తి మహిమ గుర్తింపలేని
వివేకశూన్యులు వీరందరునూ
గురు వాక్యంబిది పరమపూజ్యమని
రైతు చెప్పగా మది చింతమాని
భార్యా పుత్రులు బంధుమిత్రులును
భయమును వీడిరి. భవిష్యత్తులో
ఏమి జరుగునో ! వేచి యుండవలె
అని తలపోసిరి హాయిగ నుండిరి

వర్షము-సుడిగాలి పంటను నాశనము చేయుట

గడిచెను కాలము సుడిగాలి వచ్చె
పంటకు వచ్చిన పైరంతయును
నేలకు వాలెను నింగిని నేలను
వర్షము కలిపెను పైరులన్నియును
నీటను మునిగెను అటనే క్రుల్లెను
వర్షము తగ్గెను నేల పదునుగా
సరిపడ యుండెను చక్కగ ఎదిగెను
కొద్దిరోజులకు రైతు పొలములో
క్రిక్కిరిసి డె ఎదిగె మొక్కలన్నియును
కనుల పండువుగ కనబడెను చేను
ఆతని సతియును ఆ పొలము చూచి

మది నుప్పొంగెను. భర్తకు భక్తిని
నమస్కరించెను. నాధా అజ్ఞా
నంబున సత్యము నరయక మిమ్మును
గురుస్వాములను పలువిధములుగా
దూషించినాను దుర్మతిని నన్ను
క్షమించవలెను స్వామియు మీరును

దంపతు లిద్దరు తమ పొలములోని
పైరుని చూచిరి గురుమూర్తిని గన
మఠమునకేగిరి మదిలో నలరుచు

మీరే సామీ మా కులదేవత
కామధేనువును కల్పవృక్షమును
చింతామణియును మీరే సామీ
అమృత సమానము సామి వాక్కులని
మది నెమ్మితిమి మాకు శరణ్యము
మీ పాదములే। మాపైన కరుణ
వహింపు డనుచును ప్రార్థించినారు
అర్చన చేసిరి హారతులిచ్చిరి
ఆశీశులంది అరిగిరి గృహమునకు

నెల రోజులలో పొలము నిండుగా
కంకులు వైచెను కనుల విందుగా
పండెను జొన్నలు మూడు రెట్లుగా

యజమాని అధిక భాగము నిరాకరించుట

పంట అధికముగ పండినదిప్పుడు
కైకొనవలె పైకము అధికముగా

యజమాని

కలిగెను భాగ్యము గురు కృప వలననె
ధర్మహాని యగు దాని గైకొనిన
నీ వనుభవించు నే కోర నేదియు

రైతు -

దానము చేసెను తనకు లభించిన
అధిక లాభమును బీదలెందరికో
గురుమూర్తిని మది స్మరించుచుండును
సతీసుతులతో సలుపును పూజలు

శ్రీపాదస్వామి పూర్వజన్మలో అనుగ్రహించిన రజకుని కథ

రజకుడు పుట్టెను రాచబిడ్డగా
బీడరు నేలెడి యవన వంశమున
ధర్మమార్గమున ధర పాలించెను
దానము చేయును దయతో మెలగును
బ్రోచును బీదల పుణ్యకార్యమని
బ్రాహ్మణులమీద భక్తిని చూపును

రాజునకు తోటి యవనుల బోధ

ఆతని మిత్రులు అతనితో ననిరి
యవనులము మనము ఆదరించకుము
హింసించవలెను హిందువుల నెల్ల
బొమ్మలకు వారు పూజ సలుపుదురు
నీటిని గోవును నిప్పును కూడను
పూజింతురు కడు నీచు లందరును

యవనరాజు తన వారికి ధర్మోపదేశము చేయుట

మీరు చెప్పినది సరికా దనియెను
అందరి యందును అంతరాత్మగా
దేవుడున్నాడు తెలిసికోవలెను
సజ్జన మైత్రియు సాధువుల పూజ
శాంతిని గూర్చును సద్గతి చూపును

కుండలు వేరుగ నుండు రూపమున
మట్టి రూపములు మదిలో నెంచిన
ఒక పరమాత్మనె గొలుతు రందరును
ఆకాశమువలె అనంతు డాతడు

మనసు నిలుపుటకు మార్గంబిది యని
పూజింతురు గోవుల విగ్రహముల
తప్పుకాదిదియు తరచి చూడగా
ద్వేషింపవలదు ఇతర మతస్థుల
ఎవరి మతము వారికి ప్రియంబని
తెలియుడు ఇదియే పరమార్థమనును

సత్కార్యంబులు చక్కగ నెరపును
బ్రాహ్మణుల పూజ భక్తిని చేయును
కాలము గడుపును కపటము లేకనె

యవనరాజు కురుపుతో బాధపడుట-విప్రుల సలహా

తొడపై యతనికి పుట్టె నొక కురుపు
చికిత్స లెన్నియొ చేసిరి వైద్యులు
ఇంచుక తగ్గక ఎదుగుచునుండెను
భరింపజాలని బాధకు భయపడి
విప్రుల పిలిచెను విద్యావంతుల.
బాధ తగ్గుటకు మందును తెలుపుడు
పూర్వజన్మకృత పాపఫలంబిది

విప్రులు

మహాపురుషులను మహిత భక్తితో
దర్శించినచో అరువది జన్మల
అఘము లన్నియును అంతరించు నన

మ్లేచ్ఛుడనని మీరుపేక్షింపకుడు
పూర్వజన్మమున గొలుచితి యతివరు
రాజై నే జన్మించితి నిచ్చట
నను గొనిపోవలె నట్టి మహాత్ముని
దర్శన భాగ్యము కలుగజేయవలె

యవనరాజు స్వామిని దర్శించుట

పాపనాశమను పవిత్ర క్షేత్రము
నగర సమీపమున గల దచటనె

గలడు మహాత్ముడు వారి దర్శనము
చేయుము. తృటిలో చేకురును శాంతి
సద్గురుమూర్తిని శరణు వేడవలె
ఏదో నెపమున ఏరికి చెప్పక
తానొకడే జనె దర్శనము చేయ
సద్గురు మూర్తిని శరణు వేడగా
లేరట గురువులు ఆ ఉదయముననె
గాణ్గాపురమున కలిగె గురుమూర్తి

రాజు

తన బలములతో తడయక నేగెను
గాణ్గాపురముకు । గ్రామపెద్దతో
తాపసి యొక్కడు ఈ పురమందున
ఉన్నారని నే చూడ వచ్చితిని

గ్రామ పెద్ద రాజుతో

సంగమంబునకు నేగినారిపుడు
మఠము చేరెదరు మధ్యాహ్నమునకు

ఆందోళికపై నరిగె నారాజు
సంగమంబునకు సద్గురుని జూడ
దూరము నుండియె గురుమూర్తిని గని
ఆందోళిక దిగి చేతులు మొగిడ్చి
సామిని చేరెను సన్నుతి చేసెను

స్వామి యవనరాజును పలుకరించుట-పూర్వస్మృతి కలుగజేయుట

ఓయీ చాకలి వచ్చినాడవా
ఎంతకాలమో గతించె గదరా
మాటలు చెవిలో పడిన క్షణమున
పూర్వజ్ఞానము కలిగెను రాజుకు
సాష్టాంగ నమస్కారము చేసెను

ఆనందాశ్రుల రాల్చె నా రాజు
పూర్వజన్మలో జరిగినదంతయు
జ్ఞప్తికి రాగా నే పాపాత్ముడ
నే మతిహీనుడ । మీ పదసేవను
మరచి బ్రతికితి । కలవలె నున్నది
నా గతమంతయు నను రక్షింపుడు

స్వామి

కోరిక తీరును కలవర పడకుము
ఆశీశు లిడిరి అప్యాయతతో

రాజు స్వామికి తన బాధ తెలుపుట-స్వామి అనుగ్రహించుట

రాచపుండుతో రాత్రియు పవలును
భరింప జాలని బాధతొ గుందుచు
నేనున్నాడను అనుగ్రహింపుడు
ఉపశమనంబును ఈ భక్తుని కన

స్వామి

చూపుము దానిని చూచెద ననగా
తొడపై కట్టును విడదీసె రాజు
లేదట నేదియు లేదే గుర్తును

రాజు నరసింహ యతిని తన నగమునకు రమ్మని కోరుట

గురువుల పదములు సరగున పట్టెను
రాజునైతి మీ కృపారసంబున
దారాసుతులుకు సిరిసంపదలును
కలవు నాకిపుడు కోర్కె ఫలించెను
నా రాజ్యమునకు నాతో రావలె
మీరొసగిన ఈ సిరిసంపదలను
సామి తిలకించిన సంతసించెద
సామిపాదముల సేవించుచు నే
నుండెద నికపై వీడెద రాజ్యము

స్వామితో కలసి పాదచారియై
రాజును వచ్చెను. ఆశ్చర్యపడిరి
పురజనులందరు చిత్రింబిది యని

స్వామికి

రథగజ తురగ పదాదులు చూపెను
నా రాజధాని చాలా దూరము
అశ్వరాజముల అధిష్టింపు మనె
శిష్యులందరును అశ్వము లెక్కిరి
పల్లకిలో గురుమూర్తి కూర్చొనెను

స్వామి పాపనాశమును శిష్యులతో చేరుట

పిలిచెను రాజును మెల్లగ చెప్పెను
నీతో వచ్చుట మా తాపసులకు
సరికాదు మరియు సాగ దనుష్ఠా
నము, ముందుగనే మేము పాపనా
శన తీర్థమునకు చనెదము నచటకు
రావలె పరివారముతో నని
అదృశ్యమయ్యెను అబ్బురంబుగా

శిష్టులతో సహ చేరె గురుమూర్తి
పాపనాశ మను పవిత్ర తీర్థము

నాగనాథుడు - స్వామికి భిక్ష చేయుట

(వైడూర్యనగర పరిసరమున గలదీ
తీర్థము కడు దివ్యమైన దిది)

అచటకు దగ్గర వశించుచుండెను
నాగ నాథుండు సాయందేవుని
కుమార రత్నము సామికి భిక్షనొ
సంగెను. శిష్యుల సగౌరవంబుగ
నాహ్వానించెను గృహమునకు వారు
స్వామితో కూడ । వచ్చి భుజించిరి

నాగనాధుతో సద్గురువు లనిరి
మ్లేచ్ఛరాజిటకు వచ్చును సాయం
కాలము మీ ఆ। చారము భంగము
చెందును యిపుడే తీర్థము వద్దకు
నేగెద నీ మది చింతింపవలదు

యవనరాజు గురుమూర్తిని పాపనాశనము వద్ద దర్శించుట

శ్రీగురుమూర్తులు శిష్యులతో సహ
అదృశ్య మగుటకు అబ్బురపడుచును
గురుమూర్తి మహిమ నెరుగ రెవ్వరును
ధన్యుడ నైతిని దర్శనము చేసి
వ్రణమను మిషతో వచ్చితి నిచటికి
బాధయు తీరెను వ్రణమును మానెను
పాప నాశనము రావలె నంటిరి
అచటకు నేగెద ససైన్యంబుగా

యవనరాజు స్వామిని రాజధానికి గొంపోవుట

చేరె పాపనాశన తీర్థంబును
సామి దర్శనము చక్కగ జేసెను
నమస్కరించెను నత శీర్షముతో
వేంచేయుడు మా ఇంటికి దయతో
అనుగ్రహింపుడు ఆశీశు లిడుడు
మా సతీసుతుల మా పురజనముల
మా పశ్వాదుల మా పరివారము

అలంకరించిరి పురమంతట నీ
ముత్యపు తోరణములతో పతాక
ములతో పలు రంగుల దీపంబుల
వింత శోభతో వెలిగెను పురంబు

పల్లకిలో గురుమూర్తి కూర్చొనెను
పాదచారియై ప్రక్కన నడచెను

ఊరేగించెను ఉత్సాహముతో
హారతు లిచ్చిరి యా పురవాసులు

తురకలు తమలో

మరచెను జాతిని మరచెను మతమును
భ్రష్టుడయ్యె మన రాజిప్పుడు
బంధువు లందరు కుందుచు నుండిరి
లక్షింప డతడు మ్లేచ్ఛుల మాటలు
గురుకృప వల్లనె కుదిరెను రోగము

హృద్యముగ నుండె వాద్యస్వనములు
వందిమాగదులు వర్ణించినారు
సామి బిరుదములు చక్కని పదముల
పరచిరి చీనాంబరములు నేలను
సౌధము లోనికి సామి నడచుటకు,
నల్గురు శిష్యులు అరిగిరిలోనికి
సిద్ధము చేసిన సింహాసనమున
సామి కూర్చొనెను। సతీ సుతులతో
సామికి హారతు లారాజిచ్చెను
రాకుమారులును రాణులు సామికి
పూజలు చేసిరి పుణ్యపురుషుడని

కుదరదు రోగము ముదిరిపోయినది
వైద్యులు చెప్పిరి ఎందరెందరో
కుదరని రోగము కుదిరెను తృటిలో
సద్గురుమూర్తిని సన్నుతించిరా
రాణివాసమును రాజ్యప్రజలును

స్వామి

తీరెనె కోరిక ? తృప్తి కలిగెనా

యవనరాజు వైరాగ్యము

సంపదల మున్గి సద్గురుని సేవ

మరచిన మూర్ఖుడ మన్నించవలెను
రాజ్య పాలనము ప్రజాక్షేమమును
తనయునిపై నిడి నేనిక కాలము
గడిపెద నికపై గురు సన్నిధిలో

గౌతమిని మున్గి, గాణ్గాపురముకు
వచ్చిరి స్వామి శిష్య సహితముగ
పురవాసులపుడు హారతు లిచ్చిరి
పూజలు సలిపిరి నిశ్చల భక్తిని

నరసింహ సరస్వతి శ్రీశైలయాత్ర సంకల్పించుట

శిష్యుల నందరి చేరగ రమ్మనె
ప్రకటిత మయ్యెను లోకమున కీర్తి
యవనులు సైతము అరుదెంతు రిటకు
వరదుడ నేనని వరములు కోరుచు.
గుప్తముగ నుండ గోరెద నిటపై
శ్రీశైలయాత్ర మిషతో నేగెద
స్థానమిటు విడిచి । నిజముగ నేనిట
అదృశ్య రూపము ధరించి యుందును

స్వామి గాణ్గాపురమున అదృశ్యరూపమున ఉండుట

భక్తి భజించి నభయమును బాపెద
దర్శన మిచ్చెద ధ్యానమగ్నులకు

సంగమమందు స్నానమును చేసి
అశ్వత్థంబును ఆరాధించుచు
నిర్గుణ పాదుక నర్చించినచో
కోరికలన్నియు సరగున తీరును

శ్రీశైలమునకు శిష్యులు నల్గురు
వెంబడింపగా వెడలె గురుమూర్తి
పావనమగు నా పాతాలగంగ

చేరెను । తాననె శిష్యులను జూచి
ఆసనము గూర్చు డరటి ఆకులతో
పుష్పచయముతో । పొందెద నైక్యము
శ్రీశైల మల్లికార్జుని తోడను

నరసింహ సరస్వతి పుష్పాసనమున కృష్ణానదిలోనికి సాగుట

పుష్పాసనమును యుంచిరి నదిలో
ఆశీనుండై శిష్యులతో ననె
గృహముల కరుగుడు గణుతిని గాంచిన
గాణ్గాపురమున నిర్గుణ పాదుక
లున్నవి కోరిక లన్నియు తీర్చెడి
చింతామణులవి. చిన్మయమూర్తిగ
వసింతు నెప్పుడు వరముల నొసగుచు
భక్తుల ఇండ్లను వశించుచుందును
లేమి యుండదట ఏ కోశంబున

పంపెదను మీకు పుష్పములు నాల్గు
ప్రసాదంబుగా పూజింపవలెను

నరసింహ సరస్వతి సిద్ధి పొందుట

కన్యారాశిని గురు డుండె నపుడు
మాఘ మాసమున శుక్రవారమది
బహుధాన్యవత్సర ఉత్తరాయణ
పుణ్యదినంబున తన నిజధామము
చిన్మయధామము చేరె గురుమూర్తి

నదీతీరమున మదిలో కుందుచు
నుండిరి శిష్యులు । యటకేతెంచిన

పల్లెవారు శిష్యులకు తెల్పిన వార్త

పల్లెవాండ్రనిరి పూలతొట్టెపై
నదిలో నరిగెడి సద్గురు వగుపడె

పేరు నరసింహ సరస్వతి యనెను
మీకు చెప్పమనె యా కృపామయుడు
స్థిరముగ గాణ్గాపురమున నుందును
అదృశ్యరూపము అగుపడ దెవరికి
భక్తిని కొలిచిన భద్ర కవచమై
సంరక్షింతును కోర్కెలు తీర్చెద
చింతను మానుడు శాంతి వహింపుడు
నదీ తీరమున నల్గురు శిష్యులు
నిలబడి యుందురు వారికి తెలుపుడు

ఆ సమయంబున అగుపడె వారికి
నాలుగు పువ్వులు నదిలో తేలుచు
తీరము వైపుకు మెల్లగ వచ్చుట

గురుమూర్తి పంపిన పువ్వులు శిష్యులు శిరమున ధరించుట

గురువులు పంపిరి కరుణామూర్తులు
వాటిని గైకొని పరవశ మందుచు
శిరమున దాల్చిరి పరమ భక్తితో

పాతాల గంగ వద్దకు గురుమూర్తితో వచ్చిన శిష్యులు
నందియు నరహరి సిద్ధమునీశుడు
సాధుపుంగవుడు సాయందేవుడు

కృష్ణసరస్వతి, బాలసరస్వతి, ఉపేంద్ర సరస్వతి
ముందుగనే తీర్థ యాత్రలకు జనిరి.

ఓం శాంతిః శాంతిః శాంతిః

అనుబంధము

(బృహజ్జాబాలోపనిషత్తు)

వి భూ తి

ఐదు నామములు కలవు.

1. విభూతి 2. భసితము 3. భస్మము 4. క్షారము 5. రక్ష

ఆధ్యాత్మిక శక్తి నిచ్చునది కనుక - విభూతి

సర్వపాపములను దహించునది గావున - భస్మము

బోధ కలిగించునది కాన - భసితము

ఆపదలను పోగొట్టున దగుటచే - క్షారము

భూత, ప్రేత, పిశాచ, బ్రహ్మరాక్షసుల
నుండియు, అపస్మారము, సంసారము
వీని నుండి రక్షించునది గాన - రక్ష

1. కపిలవర్ణపు గోవు - గోమయము నుండి - విభూతి

2. కృష్ణవర్ణపు గోవు - గోమయము నుండి - భసితము

3. రక్తవర్ణపు గోవు - గోమయము నుండి - భస్మము

4. శ్వేతవర్ణపు గోవు - గోమయము నుండి - క్షారము

5. నీలివర్ణపు గోవు - గోమయము నుండి - రక్ష

తయారు చేయుదురు.

ఈ పై విభూతులన్నియు శివశక్తి స్వరూపములే జాతి, కుల, మత విచక్షణ లేక అందరు విభూతిని ధరించ వచ్చును.

ఉపనిషత్తులలో విభూతి పవిత్రత ఎంతగనో కొనియాడినది.

రుద్రాక్షలు

రుద్రాక్ష మహిమ, ప్రయోజనం, ధారాణా విధానం గురించి మన పురాణాలలోను, ఆయుర్వేద గ్రంధములలోను పేర్కొనబడినది.

రుద్రాక్ష మహిమ

రుద్రాక్ష గాయత్రి

ఓం భర్గో దేవస్య సవితుర్వరేణ్యా మిహ ధీమహి

స భర్గో భగవాన్ శంభుః ధియో యోనః ప్రచోదయాత్

రుద్రాక్షమాలతో ఈ గాయత్రిని జపించినచో బుద్ధి వికాసము, కీర్తి, ఇహపర సుఖములు చేకూరును.

సూర్యకిరణ ప్రభావాన్ని ఎక్కువగా ఇముడ్చుకునేవి జిల్లేడు, రావి, రుద్రాక్షలు. సూర్యశక్తి అనగా ప్రాణశక్తియే.

రుద్రాక్ష ధరించినచో ప్రాణశక్తి సరియగు స్థాయికి చేరును. ఆరోగ్యము, మనోవికాసము కలుగును.

రుద్రాక్ష వృక్షపు వేరు, పండు, గుజ్జు విత్తనం, పువ్వులు వైద్యంలో ఉపయోగించుదురు.

"ముఖాలు" - ఈ రుద్రాక్షపై గాడులును బట్టి వాటి ఫలితము మారుతుంది.

రుద్రాక్ష మహిమ కుమారస్వామికి పరమశివుడు చెప్పినట్లుగా స్కాందపురాణములో నున్నది.

రుద్రాక్ష

ఒక ముఖము గలది	-	సాక్షాత్ శివస్వరూపమే.
రెండు ముఖాలు గలది	-	గోహత్యపాప నివారణ
మూడు ముఖాలు గలది	-	అగ్నిరూపము
నాలుగు ముఖాలు గలది	-	బ్రహ్మ
ఐదు ముఖాలు గలది	-	కాలాగ్ని రుద్ర సమానము
ఆరు ముఖాలు గలది	-	కుమారస్వామి
ఏడు ముఖాలు గలది	-	సర్వపాపహారి
ఎనిమిది ముఖములున్నది	-	వినాయకుడు
తొమ్మిది ముఖములున్నది	-	భైరవ స్వరూపము
పది ముఖములున్నది	-	విష్ణు స్వరూపము
పదకొండు ముఖాలున్నది	-	ఏకాదశరుద్రరూపము

పన్నెండు ముఖాలున్నది - ఆదిత్యస్వరూపము
పదమూడు ముఖాలున్నది - ఇంద్రస్వరూపము
పదునాలుగు ముఖాలున్నది- హనుమత్స్వరూపము

రుద్రాక్షను సాక్షాత్ శివునిగా భావించి "ఓం నమశ్శివాయ" అని పూలతో ప్రతిదినము 108 సార్లు పూజించినచో శాంతి, సుఖము కలుగును.

రుద్రాక్షను లభించే ప్రాంతాలు

మన దేశంలో నీలగిరి, పళని ప్రాంత అడవులలోను, అస్సాం అడవులలోను రుద్రాక్ష వృక్షాలున్నవి. హిమాలయా పర్వతాల పైన, నేపాలు దేశంలోను రుద్రాక్ష వృక్షాలున్నాయి. బాగా ఎదిగిన వృక్షము 25 మీటర్లు ఎత్తు, రెండు మీటర్లు చుట్టు కొలత కలిగి ఉండును. ఆకులు పెద్దవి. పువ్వుల కొక విధమైన సువాసన ఉండును.

రుద్రాధ్యాయము

(నమకము - చమకము)

రుద్రశబ్దమునకు అనేక అర్థము లున్నవి.

1. ప్రళయ కాలమున సర్వమును నశింపజేయువాడు.
2. నాదాంతమున ద్రవింపజేయువాడు.
3. వేదరూపమగు శబ్దముచే ధర్మములను చూపువాడు.
4. ప్రణవరూప శబ్దముచే తనను పొందించువాడు.
5. తేజస్సు గలవాడు.
6. బంధించ శక్తి గలవాడు. మోహింప శక్తిగలవాడు. భక్తులకు వీనిని తొలగించువాడు.
7. సంసార దుఃఖము పోగొట్టువాడు.

బ్రహ్మచారులు యాజ్ఞవల్క్య ఋషిని అడిగిరి. ఏ మంత్రముచే మోక్షము లభించును.

శత రుద్రీయమని, తైత్తరీయ సంహిత చతుర్థకాండ పంచమ ప్రశ్నాత్మకము రుద్రాధ్యాయము.

నిత్యము దీనిని పారాయణ చేసిన యెడల ఇహపర సుఖములు, మోక్షము కూడ లభించును.

ఈ నమక చమకములతో శివలింగమును గాని గురుపాదములనుగాని అభిషేకించిన జలము పరమ పవిత్రమైనది.

అభిషేకజలమును జల్లుకొనినను ఆచమించినను దీర్ఘవ్యాధులు సైతము నయమగును. మృత్యువును కూడ జయించవచ్చును.

మన శ్వాసక్రియలో :-

మృత్యుంజయుడు (శివుడు) ఉండునని శాస్త్రము చెప్పుచున్నది.

రేచకములో ముక్కునుండి విడుచు గాలిలో అగ్ని రూపమున ఉండును.

పూరకము - లోనికి పీల్చు గాలిలో సోమునిగా నుండును.

కుంభకము - లోని ధరించియున్న గాలిలో శివ రూపమున ఉండును.

శ్లో. 1. రేచకే అగ్నిరూపోసి
సోమరూపోసి పూరకే
కుంభకే శివరూపోసి
మృత్యుంజయ నమోస్తుతే

2. త్వం యజ్ఞ సర్వయజ్ఞానాం
త్వం బుద్ధి ర్బోధ లక్షణా
శబ్ద బ్రహ్మత్వమోంకారో
మృత్యుంజయ నమోస్తుతే.

శ్రీ వాసుదేవానంద సరస్వతీకృత
జయలాభాదికరస్తోత్రం

1. దత్తాత్రేయం మహాత్మానం
వరదం భక్తవత్సలం
ప్రసన్నార్తి హరం వందే
స్మర్తృగామీ సనోవతు

2. దీనబంధుం కృపాసింధుం సర్వకారణ కారణం
సర్వరక్షాకరం వందే స్మర్తృగామీ సనోవతు

3. శరణాగత దీనార్త పరిత్రాణ పరాయణం
నారాయణమ్ విభుం వందే స్మర్తృగామీ సనోవతు

4. సర్వానర్థహరం దేవం సర్వమంగళ మంగళం
సర్వక్లేశ హరం వందే స్మర్తృగామీ సనోవతం

5. బ్రహ్మణ్యం వ్రధర్మతత్వజ్ఞం భక్తకీర్తి వివర్ధనం
భక్తాభీష్టప్రదం వందే స్మర్తృగామీ సనోవతు

6. శోషణం పాపపంకస్య దీపనం జ్ఞానతేజసః
తాపప్రశమనం వందే స్మర్తృగామీ సనోవతు

7. సర్వరోగ ప్రశమనం సర్వపీడా నివారణం
ఆపదుద్ధరణం వందే స్మర్తృగామీ సనోవతు

8. జన్మసంసార బంధఘ్నం స్వరూపానందదాయకం
నిశ్రేయసప్రదం వందే స్మర్తృగామీ సనోవతు.

నరసింహ సరస్వతీ స్తోత్రం

(శుష్కకాష్టము చిగిర్చినంతనే కుష్టురోగము పోయిన
నరహరి చేసిన స్తుతి సారము)

కోటి సూర్యుల కోటి చంద్రుల కాంతి కలవాడవు
విశ్వమునకు ఆశ్రయమైనవాడవు, దేవగణములచే
పూజింపబడువాడవు భక్తవరదుడవు, అత్రి అనసూయల
ప్రియనందనుడవు, కలియుగమున ధర్మసంస్థాపన చేయుట
కవతరించిన శ్రీ నరసింహసరస్వతీస్వామీ మీకు వంద
నము - నను రక్షింపుడు
లక్ష్మీపతివి - విశాల నేత్రములు గలవాడవు భక్తుల మోహాంధ
కారమును తొలగించు సూర్యుని వంటి వాడవు
వరదాయకుడవు - నమస్కారము - నమస్కారము -
నను రక్షింపుము

అరిషడ్వర్గములైన కామక్రోధలోభ మోహ మద మాత్సర్య
ములను మదపుటేనుగులకు అంకుశమైన వాడవు.
భక్తరక్షణకు యతి ధర్మమును స్వీకరించిన
నరసింహ సరస్వతీ నీకు నమస్కారము
జగమునకు కర్తవు - భక్తులకు కామధేనువు వంటి
వాడవు - సూర్యచంద్రులు నేత్రములు - ఈశ్వరుడవు
నరసింహ సరస్వతీ నమస్కారము - రక్షింపుము

చంద్రునివంటి ముఖము, కమల పత్రములువలె విశాల
మైన నేత్రములు - పాపముల పారదోలుటకే దండమును
కమండలమును హస్తమున ధరించిన
యతివరా, శ్రీహరీ, నరసింహసరస్వతీ వందనము
నను రక్షింపుము.

వేదములు శాస్త్రములు నీ పాదపద్మములను స్తుతించును
నాదబిందు కళాతీతుడవు - భక్తుల తాపత్రయ
ముల హరింపచేసెడి కల్పవృక్షము వంటి నరసింహ
సరస్వతీ నమస్కారము- నను రక్షింపుము
జ్ఞాన సాగరుడవు, స్మరించి నంతనే భక్తులకు
అష్టాంగ యోగసిద్ధి నొసగు వాడవు, భక్తులను
కష్టముల నుండి కాపాడి కోర్కెలు తీర్చువాడవు
అమరపురమున నివసించి భక్తుల నుద్ధరించిన స్వామీ
నీకు వందనము - నను రక్షింపుము-
సర్వజ్ఞుడవు అనంతుడవు సర్వశక్తులు కలవాడవు
సర్వేశ్వరుడవు - ఆదిమధ్యాంత రహితుడవు
వాక్కునకు మనస్సుకు అందని వాడవు ఓ నరసింహసర
స్వతీ నీకు నమస్కారము - నన్ను రక్షింపుము

సాయందేవుడు శ్రీ నరసింహ సరస్వతిని స్తుతించెను ఆ స్తుతి సారము

భక్తజనులకు సౌభాగ్యమును గూర్చెడి స్వామిని
దర్శింప గలిగితిని
భక్తజనులు తమ హృదయములో ధ్యానించు
స్వామి చరణకమలములను చూడగలిగితిని
భక్తుల రక్షించి, యోగసిద్ధుల నొసగు
సర్వశ్రేష్టుడగు నరసింహసరస్వతి యతివరుని
చూచు భాగ్యము లభించెను
మహా వాక్యములు ప్రతిపాదించెడి పరబ్రహ్మమే,
దండకమండలధారియై జగము నుద్ధరింపగా
సగుణరూపము దాల్చెను, ఈ మహనీయుని

కనుల పండువుగ చూడగల్గితిని
శ్రీనరసింహ సరస్వతుల యునికి వలన గాణ్గాపు
రము భూకైలాసమయ్యెను. దయాసముద్రులు
భక్తవరదులు - భక్తరక్షణకై
అవతరించిన మీ చరణకమలములకు నమస్కారము
యతిచంద్రుని చూచు భాగ్యము కలిగినది
పరబ్రహ్మమే సాకారమైనది - ఎంత భాగ్యమో
మిమ్ము చూచుచున్నాను.
జయము జయము యతీశ్వర - స్మరణమాత్ర
సంతుష్టుడవు యతివరా - మోహాంధకారమును
నశింపజేసెడి మీ చరణకమలముల కనులార్పక
చూచుచున్నాను.
మహావిష్ణువే యతిరూపము ధరించెను - తమ కృ
పాకటాక్షము నందిన భక్తుడు ధన్యుడు.
నరసింహ యతివరా! మీరు సాక్షాత్ కృష్ణపరమా
త్మయని విశ్వసించుచున్నాను.
గజేంద్రునకు మోక్షము నొసగిన మహావిష్ణువే
సద్గురు రూపమున సంచరించుచుండుట
నేత్రానందముగ చూచుచున్నాను.